సంచలన వార్తా పత్రిక

లీడర్

SANCHALANA VAARTHA PATRIKA LEADER

ఆదివారం • 7 జనవరి 2018 । సంపుటి : 20 సంచిక : 162 । ఎడిటర్ : వి.వి.రమణమూర్తి । 8 పేజీలు । వెల : రూ. 2.00

Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad



పాఠకులు ఈ రోజు సంచికతో పంచరంగుల 2018 క్యాలెండర్ ఉచితంగా అందుకోండి.

మత్స్యకార యువత కన్నెర్ర



తమని ఎస్టీలో చేర్చాలంటూ జీవీయంసీ ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద మత్స్యకారులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు మద్దతుగా శనివారం మత్స్యకార యువత భారీ సంఖ్యలో తరలివచ్చింది. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని మద్దతు ప్రకటించారు.

- న్యూస్‌లీడర్ / విశాఖపట్నం

A1 అధికారులపై అట్రాసిటీ కేసు A2

సెక్షన్లు మార్చేసిన సోషల్ వెల్ఫేర్ డీడీ

కళ్లు మూసుకొని సంతకం చేసిన కలెక్టర్

కోర్టును ఆశ్రయించిన యువతి

ఎంవీపీ జోన్‌లో కేసు నమోదు



సాంఘిక సంక్షేమ శాఖ డీడీ డీవీ రమణమూర్తి



జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్

న్యూస్‌లీడర్ @ విశాఖపట్నం

బాధ్యతా రాహిత్యం, నిర్లక్ష్యం, అవినీతి ధోరణి కారణంగా ఇద్దరు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ముద్దాయిలుగా మారారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డీవీ రమణమూర్తి ఏ1గా, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ ఏ2గా ఎంవీపీ పోలీసు స్టేషన్లో అట్రాసిటీ కేసు నమోదయ్యింది. 2016సంవత్సరంలో ఒక యువతి ఇచ్చిన ఫిర్యాదు ఎస్సీ,ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ యాక్ట్, సిఆర్పిసి 156 క్లాజ్ 3 కింద ఎంవిపి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మోసపోయిన దళిత,గిరిజన యువతులు తక్షణ ఆర్థిక సాయం కింద మూడు రోజుల్లో చేయూత లభిస్తుంది. ఈ క్రమంలోనే సదరు యువతి తాను ప్రేమ పేరిట మోసిపోయిన నేపథ్యం సాయం కోసం అర్జీ చేసుకుంది. నిబంధనల ప్రకారం ప్రభుత్వం నుంచి 3.75 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందాల్సి ఉంది. దాని కోసం ఆమె సాంఘిక సంక్షేమ శాఖకు దరఖాస్తు చేసుకోగా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డీవీ రమణమూర్తి ఫైల్‌ను పూర్తిగా తారుమారు చేసేశారు. కేవలం పాతిక వేల రూపాయల పరిహారం మాత్రమే అందేలా సెక్షన్లు వేసి ఫైల్‌ను కలెక్టర్‌కు పంపారు. జిల్లా కలెక్టర్ మరింత బాధ్యతా రహితంగా తన వద్దకు వచ్చిన ఫైల్‌లోని వివరాలను స్క్రూట్నీ చేయకుండానే కళ్లు మూసుకుని సంతకం పెట్టేశారు. ఫైల్‌లో సెక్షన్‌లు తారుమారు చేయడం వెనుక ఎస్సీ వెల్ఫేర్ డీడీ తప్పిదం ఎంత ఉందో, చూడకుండా సంతకాలు చేయడం వెనుక జిల్లా కలెక్టర్‌ది అంత కంటే పెద్ద తప్పే ఉంది. ఈ విషయంపై సదరు యువతి తనకు ఇవ్వాల్సిన నష్టపరిహారం ఆలస్యం చేయడమే కాకుండా, సెక్షన్లను తారుమారు చేశారంటూ ఆమె ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టును ఆశ్రయించింది. విచారణ అనంతరం బాధ్యులైన అధికారులపై కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఈ మేరకు ఈ నెల 3వ తేదీన జిల్లా కలెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధ్యతా యుతంగా వ్యవహరించాల్సిన జిల్లా స్థాయి అధికారులు ఇలా చట్ట వ్యతిరేక విధానాలకు పాల్పడి కేసులో ఇరుక్కోవడం పట్ల ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జగడం జరిలం

చంద్రబాబుపై ఆగ్రహంతో ఊగిపోతున్న మత్స్యకారులు

మద్దతునిస్తున్న ప్రతిపక్షం

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: ముఖ్యమంత్రి చంద్రబాబుకు, విశాఖ మత్స్యకారులకు మద్య అగాధం బాగా పెరిగిపోయింది. కారణాలు ఎలాంటివైనా మత్స్యకారులపై చంద్రబాబు నోరు పారేసుకోవడంతో వివాదం ముదిరిపోయింది. తమను ఎస్టీలో చేర్చాలని 11రోజులుగా మత్స్యకారులు ఉద్యమం చేస్తున్నారు. చంద్రబాబు విశాఖ పర్యటనలో భాగంగా ఆయన పోర్టు గెస్ట్ హౌస్‌లో ఉన్న సమయంలో వారు ఆయనకు తమ సమస్యను విన్నవించుకోవాలనుకున్నారు. కానీ విన్నవించుకోవడం కాదు కదా, కనీసం పెదవి విప్పే ఛాన్స్ చంద్రబాబు ఇవ్వలేదు. మేడపై నుంచి కిందకి దిగడమే తడవు తిట్ల దండకం అందుకున్నారు. ఏం వేషాలేస్తున్నారా...నేను న్యాయం చేసే దాకా ఆగరా...ఏం చేసుకుంటారో చేసుకోండి...రోడ్డెక్కి రాజకీయం చేస్తే నేనేం భయపడను...ఇంకా మాట్లాడితే తొక్కతీస్తా అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విరుచుకుపడడంతో మత్స్యకారులు అయోమయానికి గురయ్యారు. అప్పటికప్పుడు వారిని వారు తమాయించుకున్నా తర్వాత మాత్రం తట్టుకోలేకపోయారు. బాధ్యత గల ముఖ్యమంత్రి ఇలా

మిగతా 2లో ▶

అందినంత దండేశారు!

విశాఖలోని ఒక ఎగ్జామ్ సెంటర్‌లో నిర్వాకం

అభ్యర్థుల సామగ్రి భద్రపరిచేందుకు రూ.20 రుసుము





విశాఖ క్రైం,న్యూస్‌లీడర్: పెందుర్తి మండలం చిన ముషిడివాడలోని ఒక ఎగ్జామ్ సెంటర్‌లో పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థుల నుంచి అక్కడి సిబ్బంది అందినంత దండేసుకోవడం ప్రస్తుతం చర్చ నీయాంశంగా మారింది. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలకు గాను శనివారం అర్హత పరీక్ష జరిగింది. ఈ మేరకు విశాఖలో కొన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగానే చినముషిడివాడలోని ఇయాన్ డిజిటల్ జోన్‌లో

మిగతా 2లో ▶

ప్రజా తీర్పును గౌరవించాలి

డీసీఐ ప్రైవేటీకరణను విరమించుకోవాలి

లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తాం

సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ)ను ప్రైవేటీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం గౌరవించాలని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత అన్నారు. డీసీఐ ఉద్యోగులు చేస్తున్న దీక్షకు మద్ధతుగా అఖిలపక్ష ట్రేడ్ యూనియన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌ను శనివారం సీహార్స్ కూడలిలో దీక్షా శిబిరం వద్ద

మిగతా 2లో ▶



డీసీఐ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత

అడకత్తెరలో తెలంగాణ ఉద్యోగులు

ఏపీలో ఉండలేక...తమ రాష్ట్రానికి వెళ్లలేక • టీ సచివాలయంలోకి రానివ్వని వైనం



అమరావతి,న్యూస్‌లీడర్: వారంతా తెలంగాణ ప్రాంతానికి చెందిన ఉద్యోగులే అయినా హైదరాబాద్‌లోని సచివాలయంలోనికి రానివ్వడం లేదు. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం చేసిన ఉద్యోగులు నేడు తెలంగాణ ప్రాంతానికి కాకుండా పోతున్నారు. దీనికి కారణం రాష్ట్ర విభజన నుంచి వారు ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో పనిచేస్తుండడమే కారణం. విభజన జరిగినప్పుడు ఆంధ్రాకు కేటాయింపునకు గురయ్యారు. కాలక్రమంలో తెలంగాణకు వెళ్లిపోవచ్చని ఆశపడ్డారు. కానీ మూడేళ్లు గడుస్తున్న వారిని పట్టించుకునేవారే కరువయ్యారు. క్లాస్3,4కు చెందిన 150 మందికిపైగా ఉద్యోగులు ఏపీ ప్రభుత్వంలో

మిగతా 2లో ▶

సొంత ఆలోచనలతో దూసుకెళ్లాలి

విద్యార్థులకు పిలుపునిచ్చిన మంత్రి అయ్యన్న

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్ : ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు సొంత ఆలోచనలతో దూసుకెళ్తూ చదువుకున్న కళాశాలకు,

మిగతా 2లో ▶



వృద్ధురాలు సజీవ దహనం

నర్సీపట్నం, న్యూస్‌లీడర్: నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో గంగిరెడ్ల అప్పలనర్స (63) అనే వృద్ధురాలు సజీవ దహనం అయ్యింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో నడవలేని స్థితిలో అప్పలనర్స ఉంది. కుటుంబ సభ్యులు

మిగతా 2లో ▶

సంచలన వార్తాపత్రిక
లీడర్ క్లాసిఫైడ్స్

విశాఖపట్నం | ఆదివారం 7-1-2018

జగడం జటిలం

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించడంతో వారు నొచ్చుకున్నారు. తాము ఎంతో శాంతి యుతంగా సమస్యను విన్నవించానుకుంటే సీఎం ఎందుకు తిట్టారో తమకు అర్థం కావడం లేదంటున్నారు. పైగా తమ హామీ నెరవేర్చేందుకు మాట ఇవ్వాల్సింది పోయి రోడ్డెక్కారు గనుక ఇక మీకు ఏదీ చెయ్యను అంటూ బెదిరింపులకు పాల్పడడాన్ని కూడా వాళ్లు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఇకపోతే మత్స్యకారులకు ప్రతిపక్ష వైసీపీ అండగా నిలబడింది. శనివారం వైసీపీ నాయకులు వాళ్లతో కలిసి దీక్షలు చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి మోపిదేవ వెంకట రమణ ఈ సందర్భంగా ముఖ్యమంత్రిపై నిప్పులు చెరిగారు. ఇలా మొత్తానికి మత్స్యకారుల ఉద్యమం తారా స్థాయికి చేరుతోంది. దీనికి కారణం మాత్రం చంద్రబాబు వ్యాఖ్యలే అనడం నిస్సందేహం.

అందినంత దండేశారు!


(మొదటి పేజీ తరువాయి)

కూడా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ పరీక్ష రాసేందుకు వెళ్లిన విద్యార్థులు గేటులో కాలు పెట్టగానే షాక్ గురయ్యే పరిస్థితి నెలకొంది. ఎందుకంటే విద్యార్థులు తమతో కూడా తీసుకెళ్లిన వస్తువులను ఎక్కడైనా పరీక్ష కేంద్రంలోనికి తీసుకెళ్లడానికి కుదరదు. వాటిని కేంద్రంలో నిర్దేశించిన ప్రదేశంలో విడిచి పెట్టాలి. అయితే దానికి ఎలాంటి రుసుము తీసుకోరు. వాటిని భద్ర పరిచే బాధ్యత పరీక్ష కేంద్ర యాజమాన్యానిదే. కానీ ఇయాన్ డిజిటల్ జోన్‌లో దానికి పూర్తి భిన్నమైన పరిస్థితి నెలకొంది. సామగ్రిని భద్ర పరిచేందుకు గాను ఒక్కో విద్యార్థి నుంచి రూ.20 వంతున వసూలు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఏదో ఆలయాల్లోనో, రైల్వే స్టేషన్లోనో సామగ్రి భద్ర పరిస్తే ఇచ్చే మాదిరి ఒక్కొక్కరికీ ఒక్కో టోకెను కూడా ఇచ్చారు. అయితే ఇదంతా అడ్డుగా డబ్బు దండుకోవడానికే తప్ప భద్రత గురించి కాదని విద్యార్థులు విమర్శిస్తున్నారు. ఏదేమైనా పద్దతులకు పూర్తి విరుద్ధంగా ఇలా అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వృద్ధురాలు సజీవ దహనం

(మొదటి పేజీ తరువాయి)

ఒక పాకలో ఆమెను ఉంచి ఆహారాన్ని అందిస్తున్నారు. చలి తీవ్రత పెరగడంతో శుక్రవారం రాత్రి ఆమె మంచం కింద కుంపటి పెట్టుకొని నిద్రిస్తుంది. అర్ధరాత్రి సమయంలో కుంపటి నుంచి మంటలు చెలరేగి మంటలతో వృద్ధురాలు దహనం అయ్యింది. వృద్ధురాలు నడవలేని స్థితిలో ఉండడంతో , అర్ధరాత్రి మంటలు చేలరేగడం గ్రామస్తులకు తెలియకపోవడం తో ఎవరూ ఆమెని రక్షించలేకపోయారు. సంఘటనా స్థలాన్ని నర్సీపట్నం ఏఎస్పీ అరిప్ అసిజ్, నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాదం డెంటల్ క్లీనిక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గాదం జన్మదినాన్ని పురుష్కరించుకొని సీతమ్మదారలోని పాపాహోంలో పిల్లలకు పండ్లు, బిస్కెట్లు, పాలు పంపిణీ చేశారు.

(మొదటి పేజీ తరువాయి)

లెక్కించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో హేమలత మాట్లాడుతూ ప్రజా బ్యాలెట్‌లో మొత్తం 1,01,320 మంది పాల్గొన్నారన్నారు. అందులో లక్షా తొంభై మంది ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. కేవలం 610 మంది మాత్రమే అనుకూలంగా ఓటు వేశారన్నారు. దేశభక్తిపైన, దేశ ప్రజల మీద ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి వున్నా ప్రజాతీర్పును గౌరవించి, డీసీఐ ప్రైవేటీకరణ విడనాడాలని డిమాండ్ చేశారు. లాభాల్లో వున్న సంస్థను ప్రైవేటీకరించాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించడం దారుణమన్నారు. సముద్రలోతులు తవ్వడం, నౌకలు పోర్టు జెట్టీలకు సులువుగా రావటానికి, పోర్టులు విస్తరణకు డీసీఐ ఎంతగానో కృషిచేస్తూ, దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. 1976లో డీసీఐను నెలకొల్పిన నాటినుంచి లాభాల బాటలో పయనిస్తూ పోర్టుల అభివృద్ధికి తోడ్పడుతోందన్నారు. అటువంటి సంస్థకు చెందిన నూరు శాతం వాటాలను ప్రైవేట్‌కు అప్పగించాలని బీజేపీ ప్రభుత్వం నవంబర్‌లో నిర్ణయించిందన్నారు. డీసీఐ ఆస్తులకు విలువ కట్టడానికి ఒక కమిటీని నియమించిందని తెలిపారు. ఈ


ప్రజా తీర్పును గౌరవించాలి

కంపెనీ ఆస్తులను చవకగా అమ్మడానికి రంగం సిద్ధం చేసిందన్నారు. ఇటువంటి తరుణంలో అంతా కలిసి డీసీఐ పరిరక్షణకు పోరాడాల్సిన అవశ్యకత ఉందన్నారు. దేశ అభివృద్ధిలో ప్రభుత్వ రంగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. అటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఒకవైపు మేడిన్ ఇండియా ప్రకటనలు చేస్తూ, ఉద్యోగాలు కల్పిస్తున్నామని ప్రకటనలు చేస్తున్నారన్నారు. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించాలని నిర్ణయిస్తూ.. ఉద్యోగాల కల్పనకు తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. సామాన్యులకు ఎంతో ఉపయుక్తమైన రైల్వే రంగాన్ని కూడా ప్రైవేటీకరించేందుకు చూస్తోందన్నారు. దేశంలో విశాఖతో సహా మొత్తం 413 రైల్వేస్టేషన్‌లను ప్రైవేట్ పరం చేయాలని చూసోందని, వాటిలో 43 స్టేషన్లకు ఇప్పటికే టెండర్లను ఆహ్వానించిందని తెలిపారు. అదేవిధంగా దేశ రక్షణలో కీలకమైన డిఫెన్స్ రంగంలో విదేశీ పెట్టుబడులు పెట్టాలని యోచిస్తోందన్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో తయారయ్యే 143 రకాల వస్తువులను ప్రైవేట్ చేతుల్లోకి అప్పగించేందుకు నిర్ణయించిందన్నారు. అనుభవం లేని సంస్థలకు పనులు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వ కుట్రలు పన్నుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి దేశ ద్రోహ చర్యలకు బీజేపీ ప్రభుత్వం పాల్పడుతోందని, వీటిని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.నరసింగరావు, నగర అధ్యక్షుడు ఆర్.కె.వి.ఎస్.వి. కుమార్, ప్రధాన కార్యదర్శి జగ్గునాయుడు, డీసీఐ ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, జనసేన ప్రతినిధి సతీష్, ఏఐటీయూసీ ప్రతినిధి మార్కండేయులు, అధిక సంఖ్యలో డీసీఐ ఉద్యోగులు పాల్గొన్నారు.

సొంత ఆలోచనలతో దూసుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులకు మంచి పేరు ప్రఖ్యాతులను తీసుకు రావాలని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలశాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం డైట్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన 11వ డైట్ ఉత్సవ్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వళనచేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లా డుతూ సొంత ఆలోచనలు, స్వశక్తితో ముందుకువెళ్లే విద్యార్థులకు సమాజంలో మంచి భవిష్యత్ ఎప్పుడూ ఉంటుందన్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ తదితర ట్రేడుల్లో నైపుణ్యత పొంది ఐటీ వైపు ఎందుకు మొగ్గు చూపుతున్నారో అర్థంకావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము చదువుకొనే రోజుల్లో ఇంజనీరింగ్ కాలేజీలే ఉండేవికావని ప్రస్తుతం విద్యకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి బడ్జెట్‌లోకూడా అత్యధి కంగా నిధులు కేటాయించిన సందర్భాలున్నాయి. వీటిని అందిపుచ్చుకొని విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగి కాలేజీకి, కాలేజి స్థాపించిన దాడి వీరభద్ర రావుకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. మన ఇంటిదగ్గరే కూర్చుని ప్రపంచంలో ఏమి జరుగుతుందో తెలుసుకొనే టెక్నాలజీ ఉందని, వీటన్నింటినీ అందిపుచ్చుకోవాలన్నారు. ప్రస్తుతం మనదేశంలో 35ఏళ్ల లోపుఉన్న యువకులు 65శాతం మంది ఉన్నారని, ఇది మనదేశం అదృష్టమని చెప్పా రు. మరికొన్ని రోజుల్లో ప్రపంచంలోనే నెంబరువన్‌గా మనదేశం అభివృద్ధి చెందేరోజులు దగ్గరలో ఉన్నా యన్నారు. చాలామంది విద్యార్థులకు ప్రతిభ ఉన్నప్ప టికీ వాటిని ఉపయోగించుకొనేందుకు ధైర్యంగా ముందుకు వెళ్లడంలేదన్నారు. తాను చదువుకున్న రోజుల్లో విశాఖ జిల్లాలో డిగ్రీ చదవాలంటే అనకాపల్లి లేక కాకినాడ వెళ్లే పరిస్థితులుండేవన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఆ పరిస్థితి నుంచి బయట పడగలిగామన్నారు. పిల్లలద్వారా సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతులు పొందాలని విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు కలలు కంటారని వాటిని నిజం చేయాలని కోరారు. తాను 23ఏళ్ల వయస్సులో అ ఎన్టీఆర్ ఆశీస్సులతో అతిపిన్న వయస్సులో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాయని .తాను ఎన్నికైన వెంటనే ఎన్టీఆర్ తనకు కబురుపంపి మీకు ఏమికావాలో కోరుమని అడిగారని చెప్పారు. తాను నర్సీపట్నంకు డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని అప్పుడు కోరడం జరిగిందన్నారు. దీనికి విద్యా రంగంలో తన అనుభవాలే కారణ మన్నారు. విద్యా వ్యవస్థపై ఎంతో మమకారం ఉన్న వ్యక్తి దాడి అని కాబట్టే 11 ఏళ్ల క్రితం ఇటువంటి కాలేజీని ఇక్కడ స్థాపించారని కొనియాడారు. ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ డైట్ ఇంజనీరింగ్ కాలేజీ డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. డైట్ కాలేజీలో కల్పిస్తున్న సౌకర్యాలు, పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కాలేజీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు విదేశాల్లో, దేశంలో వివిధ రాష్ట్రాల్లో స్థిరపడి ఉన్నత స్థితిలో ఉండడం అభినందించదగ్గ విషయమన్నారు. డైట్ కాలేజీ ప్రాంగణంలో మెడికల్ కాలేజీనికూడా స్థాపించాలని ఎమ్మెల్యే పీలా ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ విద్యార్థినిలు ఉండే కాలేజీ డైట్ కాలేజీ అన్నారు. దీనికి ప్రధాన కారణం కాలేజీలో క్రమశిక్షణే అన్నారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చి నటువంటి వ్యక్తి అయ్యన్న పాత్రుడని ఎన్టీఆర్ పిలుపునందు కొని అతిపిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా ఎన్నికై పలు పదవులు అలంకరించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి కాకముందు ధనిక వర్గాలకు చెందినవారే ఉన్నత విద్యను అభ్యసించేవారని ఆయన సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత ఎంసెట్‌ను ప్రవేశపెట్టి పేద, మధ్య తరగతి వారుకూడా ఉన్నత విద్యనభ్యసించే అవకాశం కల్పించిన ఘనత అన్న ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. విద్యా వ్యవస్థలో రాబోయే రోజుల్లో చాలామార్పులు వస్తున్నాయని, జాతీయస్థాయిలో పోటీతత్వం ఉంటుందని, దీనికి దీటుగా విద్యనభ్యసించాలని కోరారు. అంతకుముందు సివిల్ ఇంజనీరింగ్ ల్యాబ్‌ను మంత్రి అయ్యన్న, ట్రాన్స్‌పోర్టేషన్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే పీలా చేతులమీదుగా ప్రారంభించారు. అలాగే ఉత్సవ్ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డైట్ కాలేజీ కరస్పాండెంట్ దాడి రత్నాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అమరేంద్ర, డీన్ డాక్టర్ కె.రామారావు, డాక్టర్ ఆర్‌పీఎస్ లక్ష్మి, శాస్త్రవేత్త డీఎల్ శ్రీనివాసరావుస్వామి, డాక్టర్ సీహెచ్ ప్రభాకరరావు, డాక్టర్ బీవీ రాంకుమార్, డాక్టర్ లక్ష్మికుమారి తదతరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి అయ్యన్న, చిత్రంలో ఎమ్మెల్యే పీలా, దాడి రత్నాకర్

అడకత్తెరలో తెలంగాణ ఉద్యోగులు

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తున్నారు. తమ రాష్ట్రానికి కేటాయించాలంటూ అక్కడి ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించుకున్నా ఖాళీలు లేవంటూ చెప్పుకొస్తున్నారు. పలు శాఖల్లో తాము చేసే కొలువులకు సంబంధించి ఖాళీలు ఉన్నప్పటికీ ఇతర ఉద్యోగుల పదోన్నతులకు ఆటంకం కలుగుతుందనే తమని అడ్డుకుంటున్నారని ప్రవీణ్ అనే ఉద్యోగి వాపోయారు. ఆంధ్రప్రాంతం లోనే ఉద్యోగం చేసుకుందా మనుకుంటే ఏపీకి సంబం ధించిన స్థానికత లేకపోవడంతో తమ పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత రాష్ట్రం కోసం త్యాగాలు చేసి పోరాడిన తమకు తమ ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తోందని అనుకోలేదని మధనపడ్డారు. ఇదే అంశాన్ని సీఎం సెక్రటరీ నర్సింగరావుకు తెలియజేసేందుకు శనివారం హైదరాబాద్‌లోని సచివాలయం వద్దకు వెళ్లారు. గేటు ముందు వారందరినీ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని లోపలికి అనుమ తించలేదు. ఏపీకి సంబంధిం చిన ఐడీ కార్డు చూడడంతో వారిని అక్కడే నిలిపివేశారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయం గేటు వైపు కూడా వారిని అనుమతించకపోవడంపై ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. తమ జీవితాలు ఎటూ కాకుండా పోతున్నాయని ఆందోళన చెందారు.

సంచలన వార్తాపత్రిక
లీడర్ విశాఖపట్నం సిటీ
3
విశాఖపట్నం
ఆదివారం 7-1-2018

జీఎస్టీ కోర్సు దరఖాస్తుకు గడువు ఈనెల 10

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో నిర్వహిస్తున్న జీఎస్టీ కోర్సులో ప్రవేశానికి ఈనెల 10వ తేదీతో గడువు ముగియనున్నట్టు సంచాలకుడు ఆచార్య రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు రూసుము రూ.500లు చెల్లించాలని ప్రవేశసమయంలో ఫీజు రూ.5వేలు చెల్లించాలని ఆయన తెలిపారు. పూర్తివివరాలకు www. andhrauniversity.edu,in/doa వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు.

చిరువ్యాపారులకు
ముద్ర రుణాలతో మేలు
ఎంపీ హరిబాబు


రుణపత్రాలు అందజేస్తున్న ఎంపీ హరిబాబు

విశాఖసిటీ,న్యూస్‌లీడర్: చిరు వ్యాపారులు, చిల్లరవర్త కులకు నరేంద్ర మోడి ప్రవేశపెట్టిన ముద్రారుణాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని స్థానిక ఎంపీ కంభంపాటి హరిబాబు తెలిపారు. శనివారం దాబాగార్డెన్స్ లో సిండికేట్‌బ్యాంకు ఆద్వర్యంలో ముద్రా లోన్ మేళా ను నిర్వహించారు. చేపల వర్తకులు, తోపుడు బళ్ళ వ్యాపారస్తులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే 75 మంది లబ్ధిదారులకు 48లక్షల రూ పాయిలు రుణాలు మంజూరు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిదిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని వాటిలో చిరు వ్యాపారల కోసం ముద్రా రుణాలు పథకాన్ని ప్రవేశపెట్టింద న్నారు. అందరూ సద్వని యోగం చేసుకుని రుణాలు సక్రమంగా తిరిగిచెల్లించి బ్యాంకులకు సహకరిం చాలన్నారు. గతంలో ఫైనాన్సర్లవద్ద అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని తీవ్ర ఇబ్బందులు పడేవారని,ఇప్పుడా పరిస్థితి లేదన్నారు .రీజనల్ మేనేజర్ విజయబాబు మాట్లాడుతూ గతంలో 150 మంది వరకూ ముద్రాపథకంలో అర్హులైన వారందరికీ కేంద్రప్రభుత్వ ఆదేశాలమేరకు కేవలం 70పైసల వడ్డీకే రుణాలిచ్చా మన్నా రు.క్రమం తప్పకుండా ప్రతినెల రుణబకాయిలు చెల్లించి మరల రుణాలుపొందాలని సూచించారు. దూర ప్రాంతాల్లో వుంటూ నగరంలో వ్యాపారం చేసే చిరు వ్యాపాలకు రుణాలివ్వడానికి స్థానికత సమస్య వుందని భవిష్యత్తులో వీరికి కూడా రుణాలివ్వడానికి తమవంతు కృషిచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో చీఫ్‌మేనేజర్ నరసింహం పాల్గొన్నారు.

మత్స్యకారులకు సీఎం క్షమాపణ చెప్పాలి
ఎస్టీ సాధన సమితి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: మత్స్యకారుల అవమానపరిచే విధంగా దూషించిన ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే క్షమాపణ చెప్పి, ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం మత్స్యకారుల ఎస్టీ సాధన సమితి అధ్వర్యంలో సీనియర్ న్యాయవాది పుక్కళ్ళ నాగరాజు అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గత 10 రోజులుగా ఎస్టీలో చేర్చాలని కోరుతూ చేస్తున్న రిలేనిరహార దీక్షకు మద్దతుగా ఎమ్మెల్యే వాసుపల్లి, మంత్రి గంటా శ్రీనువాసురావులు వచ్చి సీఎం దృష్టికి తీసుకువెళ్తాం అని చెప్పి తమకి విశాఖకు రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబుతో హామీ ఇస్తామని చెప్పారన్నారు. ఈ మేరకు గెస్ట్‌హౌస్‌లో పోలిసులు అనుమతితో వెళ్ళిన తమపై భాద్యతగల ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించకపోగా ఖబ్డార్ టెంట్ ఎత్తివేయండి, తోలతీస్తా, తొక్కతీస్తా అనడం సమంజసం కాదని అన్నారు. కాంగ్రెస్ నుంచి బీజేపీ, టీడీపీలు తమని ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని దుయ్యబ ట్టారు. విశాఖ జిల్లా మంత్రులు అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనువాసురావు పదవీనుండి రాజీనామ చేసి బయటకు రావాలని డిమాండ్ చేశారు. దూషించిన ముఖ్యమంత్రిపై మత్స్యకార న్యాయవా దులం దరూ కేసులు పెడతామని చెప్పారు. ఈ సమావేశంలో కోస్తా మ త్స్యకార సంఘం అధ్యక్షుడు శాంతరాం, సాధన సమితి కన్వీనర్ మూగి శ్రీరామమూర్తి, నెయ్యిల నాగ బూషణ్‌రావు, మత్స్యకార మహిళా అధ్యక్షురాలు బడే గౌరీశ్వరీ, సింగడి సూరిబాబు పాల్గొన్నారు.

15నుంచి అప్పన్న ఆలయంలో సంక్రాంతి సంబరాలు




సింహాచలం, న్యూస్‌లీడర్ ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం , సింహచలం సిం హాద్రి అప్పన్న దేవాల యంలో సంక్రాంతి సంబ రాలు ఘనంగా నిర్వ హిం చడానికి దేవస్తానం అన్ని ఎర్పాట్లు చేస్తోంది. ఈ నేప థ్యంలో ఈ ఓ రామ చం ద్రమోహన్ అదికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాడు. సం క్రాంత్రి పండుగలలో ఒకేసారి దేవుని ఉత్సవాలు మూడు రావటంతో భక్తు లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్నిఏర్పాట్లు చెయ్యాలని సంబం దిత విభాగాల పర్యావేక్షకులకు ఆదేశాలు ఇచ్చారు. 15న సింహగిరిపై సంక్రాంతి సంబరాలు, 16 కనుమరోజు గజేంద్ర మోక్షం, 17న స్వామి వారి తెప్పోత్సవం కార్యక్రమాలకు ఘణంగా నిర్వహించాలని అన్నారు . ఉచిత ప్రసాదాలు, మంచినీటి సౌకర్యాలు , అన్నప్రసాదాన్ని భక్తులకు విరివిగా అం దిం చాలని అదికారులకు ఆదేశా లిచ్చారు. తెప్పోత్సవానికి స్వమి వేణు గోపాలస్వామి అలంకారంతో , మకర సంక్రమణ ఉత్సవానికి శ్రీ మహా విష్ణువు అలంకారంతో స్వామిదర్శన మివ్వనున్నారని , అధికారులు తెలిపారు

ప్రజారోగ్యానికి ఆరు శాతం బడ్జెట్ కేటాయించాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: రాబో యే బడ్జెట్ సమావేశాల్లో ప్రజారోగ్యానికి ఆరు శాతం బడ్జెట్‌ను కేటాయించాలని ప్రజారోగ్య పరిరక్షణ కమిటి జిల్లా కన్వీనర్ రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజారోగ్య పరిరక్షన కమిటీ అధ్వర్యంలో ప్రజారోగ్యంనకు బడ్జెట్ కేటాయింపులు అనే అంశంపై శనివారం జగదాంబ దరి సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిం చా రు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రోజురోజుకి దిగజారుతున్న ఆర్థిక పరిస్థితుల వల్ల ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. వైద్యం చేయించుకోవా లంటే తగిన స్థోమత లేక సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించి, ప్రభుత్వ ఆసుపత్రులు, హెల్త్ సెంటర్లను బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో శారదా ట్రస్ట్ నాయకురాలు ద్రాక్షాయణి, జన విజ్ఞాన వేదిక సహా కార్యదర్శి చిలకామూర్తి, సంతోష్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దళిత సేన ధర్నా


నినాదాలు చేస్తున్న దళిత సేన నాయకులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: మహారాష్ట్రలోని బీమ్ కోరేగావ్‌లో మహర్‌ల మీద ఈ నెల 1 న జరిగిన దాడిని నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సేన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శనివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు పెంటారావు మాట్లాడుతూ 1818లో పీష్వా రాజుల నియంత పాలనను మహర్ సైన్యం అంతమొందించిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం జనవరి 1 విజయ స్థూపం వద్ద మహర్‌లు తమ పూర్వీకుల త్యాగాలను స్మరించుకుంటారని తెలిపారు. ఈ సంవత్సరం కూడా అదేవిధంగా జరుగుతుండగా మనువాద శక్తులు పథకం ప్రకారం దాడిచేసి ఒక యువకుడిని హతమార్చాయని ఆరోపించారు. ఈ సంఘటనను దేశవ్యాప్తంగా దళితులు, ప్రజాస్వామ్య వాదులు, లౌకికవాదులు ఖండిస్తున్నారన్నారు. కేంద్రంలో భాజపా అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరిగాయని, మతోన్మాదశక్తులు దళితులపై దాడులు చేస్తున్నాయన్నారు. అంబేద్కరీయులు చైతన్యవంతమైనప్పుడే పాలకుల దురాగతాలను ఎండగట్టి, ప్రజలకు న్యాయం చేయగలమని, ఈ పోరాటంలో తమతో కలిసి రావాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో దళితసేన మహిళా అధ్యక్షురాలు నక్కెళ్ళ నాగమణి, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. ప్రభాకర్, నగర అధ్యక్షుడు చింతాడ సూర్యం, కంఠశెట్టి లక్ష్మీకాంతం, ఇప్పాడ శ్రీను, పోలిపల్లి విశ్వవాణి, సారిక సుబ్బలక్ష్మి, బుడిమూరి ఈశ్వరరావు, కాకర నరసింహారావు, కానూరి మేనక, జాన్ విక్టర్, కె. నాని, అరవింద్, పుచ్చా కామేశ్వరరావు, శ్రీను, లక్ష్మణరావు పాల్గొన్నారు.


గోపాలపట్నం హైస్కూల్లో జరుగుతున్న ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించిన ఉడా వీసి బసంత్ కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు. - న్యూస్‌లీడర్ గోపాలపట్నం

ఆధునిక యుగంలో ఆచార సంప్రదాయాలు అవసరం
కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సతీమణి శోభనాస్మృతి

విశాఖసిటీ, న్యూస్‌లీడర్: ఆదునికంగా అభివృద్దిచెం దుతూ ఆచార సాంప్రదాయాలను మరిచిపోతున్న నేటి తరానికి వాటి విలువలు తెలపాల్సిన అవసరం ఎంతైనా వుందనిజిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సతీమణి శోభనాస్మృతి అన్నారు.శనివారం ఎంవీపీకాలనీ ఐఐఏఎమ్ కళాశాల విద్యార్థులు కళాశాలప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.ఈకళాశాలలో వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన చదువుకుంటున్న విద్యార్థులు వారివారి ప్రాంతాలలో వుండే కట్టుబాట్లు, సాంప్రదాయాలు, అలవాట్లు, వస్త్రాలంకరణలను ఒకరితోఒకరు పంచు కున్నారు.సాంప్రదాయ దుస్తులతో అలరించారు. కైట్‌ఫెస్టివ ల్,వంటలపోటీలలో పాల్గొనా రు. ఈకార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ తెలుగువారంతా జరుపుకునే పెద్ద పండుగ సంక్రాంతిని ఇలా విద్యార్థులు సంబరాలు చేసి ఆచాం సాంప్రదాయాలకు పెద్దపీటవేయడం అభినందనీ యమన్నారు .విద్యార్థులు చదువుతో పాటు ట్రెడిషన్‌ని ఆచరిం చాలన్నారు.మరోఅతిది ఫ్లూయెంట్‌గ్రిడ్ ఎక్జి క్యూటివ్ డైరెక్టర్ వాణి గన్నమణి మాట్లాడుతూ ఈకళాశాలలో ప్రతి సంవత్సరం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తాం"న్నారు.రైతకు చేతికి పంట అందివచ్చి కుటంబమంతా సుఖసంతోషాలతో పల్లెల్లో జరుపుకునే పండుగవాతా వరణాన్ని విద్యార్థులు ఇక్కడ కళ్ళకు కట్టినట్లు చూపిందారని,పండుగను వారం రోజులమందే తెచ్చేశా రని ఆనందం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయ రుద్రరాజు,సెక్రటరీ సుంకర రవీంద్ర, ఎగ్జుక్యూటివ్ డైరెక్టర్ తేజ,సమతాకాలేజ్ ప్రిన్సిపాల్ విజయరవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సేవ్ పబ్లిక్ సెక్టార్- డెవలప్ విశాఖ పుస్తకావిష్కరణ



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల నేటి స్థితిగతులపై సీఐటీయూ అధ్వర్యంలో రూపొందించిన 'సేవ్ పబ్లిక్ సెక్టార్-డెవలప్ విశాఖ' పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం జగదాంబ దరి సీఐటీయూ కార్యాయలంలో జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన హేమలత మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు పూనుకొందని ఆరోపించారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ)ని నూరుశాతం ప్రైవేటీకరణ చేయాలని బిజెపి ప్రభుత్వ క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. అదేవిధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ 10శాతం వాటాలు అమ్మాలని నిర్ణయిందినట్లు ఈ నెల మూడవ తేదీన రాజ్యసభలో స్టీల్ శాఖా మంత్రి ప్రకటించారన్నారు. ప్రైవేట్‌కు అప్పగించిన హిందూస్థాన్ జింక్ పూర్తిగా మూతబడిందన్నారు. అదేవిధంగా విశాఖతో సహా 43 రైల్వేస్టేషన్లను 45 సంవత్సరాల లీజుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. ప్రైవేటీకరణ విధానాల వల్ల అన్ని పరిశ్రమలు ప్రమాదంలో పడి ఉపాధి తీవ్రంగా దెబ్బతింటోందన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడుకోవడానికి ఉద్యమం జరుగుతోందని అన్నారు. ఈ ఉద్యమానికి, ప్రభుత్వరంగ సంస్థల పరిస్థితిపై అవగాహనకు ఈ పుస్తకం ఎంతో తోడ్పడుతుందని అన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు నరసింగరావు మాట్లాడుతూ విశాఖలో ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పడిన నాటినుంచి దేశానికి, విశాఖ అభివృద్ధికి విశేష సేవలు అందించాయన్నారు. అయితే ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను, ప్రస్తుత పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీఐటీయూ భావించిందన్నారు. దీనిలో భాగంగా గత యేదాది 'ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడుకుందాం-విశాఖ నగరాన్ని అభివృద్ధి చేద్దాం' అనే తెలుగు పుస్తకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఉద్యోగులు, కార్మికులు, యువత, మేధావులు, ప్రజల నుంచి దీనికి మంచి ఆదరణ లభించిందన్నారు. దీంతో తెలుగు చదవలేని ప్రభుత్వ రంగ అధికారులు, ఇతరుల కోసం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రాధాన్యతను వివరించే 'సేవ్ పబ్లిక్ సెక్టార్- డెవలప్ విశాఖ' పుస్తకాన్ని ఆంగ్లంలో ముద్రించటం జరిగిందన్నారు. విశాఖ, దేశాభివృద్ధికి ప్రభుత్వ పరిశ్రమలే మూలమని, అటువంటి వాటిని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని భావిస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో పుస్తకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని, తద్వారా ప్రభుత్వ రంగ సంస్థల ఆవశ్యకత గురించి ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవలతోనే
ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి



గాజువాక, న్యూస్‌లీడర్ ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన అందరి భాద్యతగా ఉండాలని ఆర్‌ఈ సిఎస్ మాజీ డైరెక్టర్ దొడ్డి బాలాజి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తోకాడలోని మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు గాజువాకకు చెంది స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నమ్మిసూర్యారావు అందించిన 28 వేల రూపాయలు విలువ చేసే స్టీలు కంచాలు, పుస్తకాలు, వృద్ధులకు దుప్పట్లు, పంచిపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బాలాజీ మాట్లాడుతూ సమాజసేవకు అంకితమైన నమ్మి సూర్యారావును ఆయన అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు. గాజువాకలో చేపడుతున్నా సేవా కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూర్యారావును కోరారు. ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వవికాస నిపుణులు అలజంగి ఉదయ్‌కుమార్, ట్వింకిల్ రాజా, స్థానికలు మూర్తి, అప్పలరాజు, బాబూరావు, అప్పారావు, వెంకటరావు, వీరు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ వనిత నూతన కార్యవర్గం



దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: వాసవీ క్లబ్ 2018కి గాను సంస్థ అధ్యక్షురాలుగా వి. నిర్మల ఎన్నికయ్యారు. ఆమెతో కార్యదర్శిగా కె.పుష్ప, ఇతర సభ్యులు నియమితులయ్యారు. ఈ మేరకు వనిత కెసిజిఎఫ్ వైజాగ్ ఫెమినా మహిళా సభ్యుల ఆధ్వర్యంలో ద్వారకానగర్ 'వి' హోటల్ ప్రాంగణంలో శనివారం 2018కి గాను వాసవీ క్లబ్ వనిత కెసిజిఎఫ్ వైజాగ్ ఫెమినా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. 2018కి కె.పుష్ప, కోశాధికారిగా సిహెచ్.చందనలు ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.రవికుమార్ హాజరై జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎం.రవికుమార్ ప్రసంగిస్తూ సేవతోనే ఆత్మసంతృప్తి కలుగుతుందని తద్వారా జీవితం సార్థకత అవుతుందన్నారు. ప్రతి ఒక్కరు మంచి ఆశయంతో సేవా కార్యక్రమాలు నిర్వహించి సంస్థ ఉన్నతికి దోహదపడాలన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఉపాధ్యక్షులు వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ కొల్లూరు కామరాజు మాట్లాడుతూ సంస్థకు సంబంధించిన సభ్యులు మహోన్నతమైన సేవా కార్యక్రమాలు నిర్వహించి సంస్థ ఉన్నతికి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోనే వాసవీ క్లబ్ వనిత కెసిజిఎఫ్ వైజాగ్ ఫెమినా గొప్ప సంస్థగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ప్రత్యేక ఆహ్వానితులుగా వి.మధుసూదన్, జి.వాసుదేవమూర్తి, సిహెచ్ శ్రీరామ్మూర్తి, విశిష్ఠ అతిథులుగా బి.వి.సావిత్రి, కె.సత్యలక్ష్మిలు పాల్గొని ప్రసంగించారు. నూతన కార్యవర్గంలో ప్రమాణ స్వీకారం చేసిన సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు వి.నిర్మల, కె.పుష్పలు సంస్థ ఉన్నతికి కృషి చేస్తామని తెలుపుతూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నూతన, పూర్వ కార్యదర్శి బి.వి.పద్మావతి, పూర్వ కోశాధికారి వి.నిర్మల అధిక సంఖ్యలో మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి చంద్రన్న బీమా



మల్కాపురం, న్యూస్‌లీడర్ : మల్కాపురం జీవీఎంసి 49 వార్డు అల్లూరి సీతరామరాజు కాలనీ చెందిన ముప్పన్న పద్మ గురువారం మృతి చెందారు . మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం నుండి మంజూరు చేసిన , చంద్రనబీమా 5000 రూపాయలు 49 వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మజ్జి సోమేశ్ మృతురాలు భర్త గణేష్ అందజేశారు .ఈ సందరబ్ గా సోమేశ్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన చంద్రన్న బీమా పథకం పేదల పాలిట దేవుడు ఇచ్చిన వరం అని అన్నారు ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ 49 వార్డు మహిళా అధ్యక్షురాలు ఎస్. శ్రీలక్ష్మి, బీమా మిత్ర , కేత లక్ష్మి టీడీపీ నాయకులు సానికులు పాల్గున్నారు

పరారీలో ఫేస్‌బుక్ ప్రియుడు
పోలీస్ స్టేషన్‌లో ప్రియురాలు ఫిర్యాదు



గాజువాక, న్యూస్ లీడర్. ఆమెది ఢిల్లీ, అతనిది రాజస్థాన్ రాష్ట్రాలు అయినా ఒకరికొరకు ప్రేమలో పడ్డారు ప్రేమలో పడటానికి కలిసి చదువుకున్న సందర్భం కాదు, ఒకే ప్రాంతం అంతకన్నా కాదు కేవలం ఫేస్ బుక్ పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇంకేముంది ఒకరిపై ఒకరికి నమ్మకాలు చోటు చేసుకోవడంతో ప్రియుడితో కలిసి బతకాలని అనుకున్న యువతికి మూడునెల్ల ముచ్చటగానే మిగిలింది. జరిగిన సంఘటనతో యువతిని అవాక్కవ్వడమే కాకుండా ఒంటరిగా మిగిలింది. ఓదార్చేందుకు అటు తల్లిదండ్రులు, బందుమిత్రులు లేకుండా పోయారు. దిక్కుతోచని స్థితిలో యువతి స్టీల్ ప్లాంట్ పోలీసులను ఆశ్రయించి పిర్యాదు చేసిన సంఘటన వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి ఢిల్లీ రాష్ట్రం ద్వారకా ప్రాంతానికి చెందిన కిరణ్ సింగ్ అనే యువతి రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కిషన్‌పాల్ సింగ్‌లు ఇద్దరికీ ఫేస్ బుక్‌లో పరిచయం. వీరి పరిచయం కాస్త ప్రేమగా మారింది. ప్రియుడు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జూనియర్ ట్రైనింగ్ అవుతున్నాడు. ప్రియుడు కేంద్ర ప్రభుత్వ కర్మాగారంలో జూనియర్ ట్రైనింగ్ అవుతున్న నేపద్యంలో తన జీవితం బాగుంటుందనే నమ్మకం, ప్రియుడి బరోసాను నమ్మింది. విశాఖ వస్తే వివాహం చేసుకోగలనని ప్రియురాలికి చెప్పడంతో ఢిల్లీ నుండి రెక్కలు కట్టుకొని విశాఖలో వాలిపోయింది. ఇద్దరూ స్టీల్ ప్లాంట్ సెక్టర్ 6లో ట్రైనీ క్వార్టరులో మూడునెలల పాటు సహజీవనం సాగించారు. ఇంతలో ప్రియుడు కిషన్ పాల్ సింగ్ ట్రైనింగ్ పూర్తి కావడంతో ఇద్దరూ కలిసి ఢిల్లీకి పయనమైయ్యారు. ఢిల్లీ చేరుకోగానే ప్రియురాలు కిరణ్ సింగ్‌ను అక్కడే వదిలి పరారైయ్యాడు ప్రియుడు ఎంతకీ కనిపించక పోవడంతో దిక్కుతోచని స్థితిలో మళ్లీ విశాఖ చేరుకున్న యువతి విశాఖ ఉక్కు కర్మాగారంలో వాకాబు చేయగా ట్రైనింగ్ పూర్తి చేసుకుని వెళ్ళిపోయాడని సమాచారంతో ఖంగుతిన్న యువతి స్టీల్ ప్లాంట్ పోలీస్టేషన్‌లో పిర్యాదు చేసింది , పిర్యాదు అందుకొన్న పోలీసులు కేసునమోదు చేసి కిషన్ పాల్ సింగ్ కొరకు వెతికే పనిలో పడ్డారు.

అంబులెన్స్ దగ్ధం



విశాఖక్రైం,న్యూస్‌లీడర్: నగరంలోని జిల్లా పరిషత్‌కు సమీపంలో గల ఏబీసీ ఆస్పత్రిలో అంబులెన్స్ దగ్ధమైంది. దానిని నిలిపి వుంచిన ప్రాంతానికి సమీపంలో షార్ట్‌సర్క్యూట్ జరగగా మంటలు ఎగిసి పడడంతో అంబులెన్సుకు నిప్పంటుకుంది. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వారు ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అదృష్ట వశాత్తూ ఘటన జరిగిన సమయంలో రోగులు, వారి బంధువులు ఎవరూ దగ్గరగా లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

పంచాంగం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు పుష్యమాసం శుక్లపక్షం

బ.షష్ఠి సా.4:05 వరకు
ఉత్తర రా.1:00 వరకు
వర్జ్యం ఉ. 8:20 నుండి 9:56 వరకు
దు.ము: సా. 4-02 నుండి 5-02 వరకు
రా.కా: సా.4-07 నుండి 5-47 వరకు

మనవాళ్లొస్తే మంచిదే..

చైనా యువత స్వదేశం వెళ్ళి అక్కడి ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసిందనే వార్తలు వినబడుతున్నాయి. మన భారతీయులు స్వదేశం వస్తే, చేతులు ముడుచుకొని ఉండరు. తాజా సాంకేతిక పరిజ్ఞానం వారి చేతిలో ఉన్నది. తమ సృజనాత్మకతను మేళవించి, కొత్త తరహా ఆర్థిక వ్యవస్థలో- ఫేస్‌బుక్, అమెజాన్, ఉబర్ వంటి అనేక కొంగ్రొత్త సంస్థలను సృష్టిస్తారు. కొన్ని లక్షలమంది ఉన్నత విద్యావంతులు, నిపుణులు స్వదేశానికి రావడం వల్ల ఇక్కడి ఆర్థిక వ్యవస్థ మరింత సుసంపన్నం అవుతుందనే నిర్మాణాత్మక దృక్పథం అలవరుచుకుందాం. అమెరికా వద్దనుకుంటే, మన బిడ్డలను రెండు చేతులా ఆహ్వానిద్దాం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బయ్ అమెరికన్, హైర్ అమెరికన్ అనే నినాదంతో అధికారానికి వచ్చిన నేపథ్యంలో, హెచ్-1బి వీసా కొనసాగింపు పట్ల కఠిన వైఖరిని అవలంబిస్తారనేది మన దేశ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ఆందోళన కలిగిస్తున్నది. ఈ ప్రతిపాదన చట్టరూపం దాలిస్తే, కొన్ని లక్షల మంది నిపుణులైన కార్మికులు ఉద్యోగాలు కోల్పోయి భారత్‌కు తిరిగి రావలసి ఉం టుందని అంచనా. ఇప్పుడున్న విధానం ప్రకారం- మూడేండ్ల వీసా గడువు మరో పర్యాయం పొడిగించుకోవచ్చు. ఆరేండ్ల తర్వాత గ్రీన్‌కార్డు దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే, అది తేలేవరకు నిరవధి కంగా వీసా పొడిగింపు ఉంటుంది. ఈ క్రమంలో లక్షలాదిమంది భారతీ యులు అమెరికాలో స్థిరపడుతున్నారు. కానీ ట్రంప్ చెబుతున్న విధానం అమలులోకి వస్తే గ్రీన్‌కార్డు ప్రాసెసింగ్‌లో ఉన్నప్పుడు హెచ్-1బి పొడిగింపు ఉండదు, వీరు అమెరికాలో కొనసాగలేరు. దీని కితోడు ఇతర దేశస్థులను నియమించుకోవడం వల్ల, స్వదేశీయులు ఉద్యోగం కోల్పోవడం లేదని కంపెనీ హామీ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఉద్యోగులకు కనీస వేతనాన్ని కూడా పెంచుతున్నారు. చౌకగా విదేశీయుల సేవలను ఉపయోగించుకునే వెసు లుబాటు ఉండదు. ఇవన్నీ నేరుగా, పరోక్షంగా విదేశీయులను నియమించు కోకుండా, అడ్డుకట్ట వేసే నిబంధనలను ప్రవేశ పెట్టాలనే ప్రతిపాదన ఉన్నది. అయితే ఈ ప్రతిపాదన బిల్లు రూపంలో చట్టసభల్లో ప్రవేశపెట్టడానికి ముందే పారిశ్రామికవర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతున్నది. అందువల్ల గండం గట్టెక్కే అవకాశం కూడా ఉన్నది. ట్రంప్ పట్టుదలగా వ్యవహరిస్తే మాత్రం సాఫ్ట్‌వేర్ కంపెనీలకు, ఉద్యోగస్తులకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడటం ఖాయం. హెచ్-1బి నిబంధనలు మార్చడం జరిగితే ఎక్కువగా నష్టపోయేది భారతీయులే. ఏటా ఇచ్చే 85 వేల హెచ్-1బి వీసాలలో సగానికి పైగా లబ్ధి పొందేది భారతీయులే. ఇప్పటికే హెచ్-1బి వీసాతో వచ్చిన వారి భార్య లేదా భర్తపై ఆంక్షలు విధించదలిచారు. విస్తృత కుటుంబ కోటా కింద వచ్చే వారినీ కట్టడి చేస్తున్నారు. క్రమంగా అమెరికాకు వలస వెళ్ళేవారికి ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయనేది దీనివల్ల తెలుస్తున్నది. ఊహిస్తున్న ప్రమాదం జరుగకపోవచ్చు. కానీ జరిగితే ఏ విధంగా ఎదుర్కోవాలనేది కూడా ఆలోచించవలసిందే. చట్టపరంగా, నైతికంగా అమెరికా అనుసరించే విధానాన్ని తప్పుపట్టలేము. అక్కడి ప్రజలు, అక్కడి అవసరాలకు అనుగుణంగా వారు తమ విధానాలను రూపొందించుకుంటారు. ఈ అంశం ఆర్థికపర మైనదే కాదు, సామాజికమైనది, ఉద్వేగభరితమైనది. ఒక్క అమెరికానే కాదు, పలు ఇతర దేశాలు కూడా వలసల పట్ల కఠిన వైఖరిని అవలంబిస్తున్నాయి. యూరప్ దేశాలలో నెలకొన్న సంక్షోభం గమనిస్తూనే ఉన్నాం. గల్ఫ్ దేశాలలో ఒకప్పుడున్న ఉపాధి అవకాశాలు ఇప్పుడు లేవు. భవిష్యత్తులో విదేశీ ఉద్యో గాల పరిస్థితి మరింత క్లిష్టంగా మారినా ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఈ నేపథ్యంలో మన విధానకర్తలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలె. మన ప్రయో జనాల పరిరక్షణకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలె. అభివృద్ధి చెంది న దేశాల పారిశ్రామిక రంగానికి అనుబంధంగా ఉండటం, సేవారంగంపై ఎక్కు వగా ఆధారపడటం వంటి అంశాలను సమీక్షించుకోవాలె. మనకంటూ పారి శ్రామిక పునాదిని నిర్మించుకోవడం, స్వావలంబన సాధించడం అవసరం. లక్షలాదిమంది తిరిగి వచ్చే కార్మికులకు ఉద్యోగ కల్పన ప్రభుత్వ బాధ్యత కాదు. కానీ వారు ఉపాధి పొందడం అనేది మన ప్రభుత్వాలు అనుసరించే విధానాలపై ఆధారపడి ఉంటుంది. విదేశాల నుంచి నైపుణ్యంతో, అనుభవం తో వచ్చే వారు వృద్ధి పొందే పరిస్థితులు ఇక్కడ నెలకొని ఉండాలె. అది ఇక్కడి పారిశ్రామికులకు, నిపుణులకు, విస్తృతంగా మొత్తం సమాజానికి ఉపయోగ పడుతుంది. ఇవాళ హెచ్-1బి వీసా నైపుణ్య కార్మికులు కావచ్చు, రేపు మరో వర్గానికి చెందిన వారు ఉండవచ్చు. విదేశాల నుంచి స్వదేశానికి వచ్చే వారు ఏదో కోల్పోయిన భావనకు గురికాకూడదు. స్వదేశంలో బతుకుదెరువు ఎట్లా అనే ఆందోళన చెందకూడదు. నిపుణులుగా ఎంతో అనుభవంతో స్వదేశంలో అడుగు పెడుతున్నందుకు సంతోషించాలె. తాము గడించిన అనుభవంతో స్వదేశానికి ఏ విధంగా ఉపయోగపడగలమనే మథనం జరుగాలె. ఈ క్రమం లో తాము ఉపాధి పొందడం అనేది చిన్న విషయమై పోతుంది. తాము తమ కాళ్ళ మీద నిలబడటమే కాకుండా, అనేకమందికి ఉపాధి కల్పించి, సామాజిక, ఆర్థికాభివృద్ధికి దోహదపడిన వారవుతారు.

అవినీతికి కులం ఉంటుందా..?



దేశంలో జరుగుతున్న అవినీతి, నేరాలకు కులం ఉన్నదా! అంటే ఉన్నదనే వాదనలు వినిపిస్తున్నాయి. వెలుగులోకి వస్తున్న ఆర్థిక అవినీతి నేరాలు, విచారణలు, శిక్షల విషయం చూసినప్పుడు కులం ఛాయలు కనిపిస్తున్నాయంటున్నారు కొందరు విశ్లేషకులు. అవినీతి సర్వత్రా వ్యాపించి ఉన్న విషయం అందరికీ తెలిసిన విషయమే. అయితే వెలుగులోకి వస్తున్న అవినీతి కేసులు, పట్టుబడుతున్న వారిని చూస్తే..సమాజంలోని నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో కిందివరుస కులాల్లోని వారే ఎక్కువ శాతం ముద్దాయిలుగా పట్టుబడుతున్నారని, నేరస్తులుగా కోర్టులలో ముద్ర వేయబడుతున్నారని అంటున్నారు. దీనికి అనేక ఉదంతాలు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.


సుఖ్‌రామ్, రాజా ఇద్దరూ కేంద్ర మంత్రులుగా టెలికాం మంత్రులుగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. సుఖ్‌రామ్ దోషిగా నిలిచాడు. రాజా మాత్రం నిర్దోషిగా బయటపడ్డాడు. ఇందులో సుఖ్‌రామ్ తను పడుకునే మంచం బెడ్డుకింద నోట్లకట్టలు దొరికాయి. కానీ మరో ఉదంతం రాజా విషయంలో ఎలాం టి డబ్బులు దొరుకలేదు. డబ్బులు దొరుకనప్పుడు అవినీతిపరుడని ఎలా అంటామని న్యాయమూర్తి అమాయకంగా ప్రశ్నిస్తూ, అతన్ని నిర్దోషిగా తీర్పు ప్రకటించారు. ఈ క్రమంలో చూస్తే.. సుఖ్‌రామ్ బ్రాహ్మణుడు. రాజా దళితుడు. మరి అవినీతి, నేరాల విషయంలో కులం పాత్ర గురించి చర్చించుకోవాల్సిందే. అవినీతికేసులు, వాటి విచారణలది సుదీర్ఘ, విచిత్ర చరిత్ర. ఏ రాజా పై ఆరేండ్లుగా విచారణ కొనసాగింది. ఆ క్రమంలో ఆయన 15 నెలలు జైలు జీవితం గడుపాల్సి వచ్చింది. అలాగే ఆయనపార్టీ సహచరులు కనిమొళి వెనుకబడిన వర్గానికి చెందిన వారు. ఆమె కూడా నిర్దోషిగా బయటపడ్డారు. అలాగే బొగ్గు కుంభకోణంలో దోషిగా తేలిన మధుకోడా, అవినీతి, అసత్య ఆరోపణల నేపథ్యంలో శిబూసోరేన్ నిర్దోషిగా బయట కివచ్చా డు. వీరిద్దరూ ఆదివాసులు.ఇదే క్రమంలో అవినీతి ఆరోపణల గతంలోకి వెళ్లి చూస్తే.. మాయా వతి దళితురాలు. లాలూప్రసాద్ యాదవ్, ములా యంసింగ్ యాదవ్ అవినీతి ఆరోపణలు, ఆదాయానికి మించిన ఆస్తుల విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీరు ఓబీసీ వర్గానికి చెందినవారు. ఇలా అనేక అవినీతి ఆరోపణలు, విచారణలు, అప్పుడప్పుడు అవినీతి కేసు లు పతాక శీర్షికలకు ఎక్కడం లాంటివన్నీ మెరుపులుగా కనిపిస్తుంటా యి. ఇవన్నీ రాజకీయవర్గాల అవసరాల నేపథ్యంలో వెలుగుచూస్తున్నా యి. చర్చల్లోకి వస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే పాలకపక్ష రాజకీయ అవసరాల నేపథ్యంలో కొన్ని అవినీతికేసులు ముందుకు వస్తున్నాయి. మీడియా పతాక శీర్షికల్లోకి వస్తున్నాయి. ఇదంతా ముందస్తు ప్రణాళిక తో నడుస్తున్న తతంగంగా కనిపిస్తుంది. అంతిమంగా చూస్తే రాజకీయ ప్రయోజనాలే అవినీతి కేసుల అంతరార్థం అని అర్థమవుతున్నది. ఈ క్రమంలో చూస్తే.. అవినీతి అక్రమాల కేసులో అతి ఎక్కువ జైలు శిక్ష అనుభవించిన వాడు హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఓంప్రకాశ్ చౌతాలా ముందువరుసలో ఉన్నాడు. ఇతను ఓ జాట్ కులస్తుడు. మొత్తంగా చూస్తే.. అవినీతి ఆరోపణలతో జైలుశిక్షలు అనుభవిస్తున్న వారిలో ఎవరు ఎక్కువ ఉన్నారు, ఉంటున్నారంటే.. అగ్రవర్ణాల కంటే వెనుకబడిన వారేననేది అర్థమయ్యే విషయమే.అవినీతి కుంభకోణాల గత చరిత్రలోకి చూస్తే.. 2008లో జరిగిన ఓటుకు నోటు కేసులో ఫగ్గన్ సింగ్ కులస్తే, అశోక్ అర్గల్, మహావీర్‌సింగ్ భగోరాలు స్టింగ్ ఆపరేషన్‌లో అడ్డంగా దొరికారు. వీరిని వెనుక ఉండి నడిపించిన వారు తప్పించుకున్నారు. కానీ వీరు పట్టుబడ్డారు. వీరంతా ఎస్సీ, ఎస్టీలు. దీనికి ముందు 2005లో జరిగిన పైసలకు ప్రశ్న కుంభకోణంలో 11 మంది ఎంపీలు తమ సభ్యత్వాన్ని కోల్పోయారు. వీరిలో ఆరుగురు బీజేపీకి చెందినవారు కాగా, ముగ్గురు బీఎస్పీకి చెందినవా రు, ఒకరు కాంగ్రెస్, ఒకరు ఆర్జేడీ పార్టీలకు చెందినవారు. ఇంకా నరేం ద్ర కుశావాహ, రాజారాంపాల్ ఇద్దరూ ఓబీసీలు, లాల్‌చంద్రకోల్ దళితుడు.అయితే అవినీతి ఆరోపణలు, శిక్షల్లో కొం దరు ఉన్నత కులాల వారు కనిపిస్తుండొచ్చు. సుఖ్ రామ్, జయలలిత, సురేష్‌కల్మాడీ లాంటి వారు కొంద రున్నారు. అయితే అవినీతి ఆరోపణలు, శిక్షలుపడిన వారిలో చూస్తే మిగతా వర్గాలవారితో పోల్చితే చాలా తక్కువ. ఈ క్రమంలో వారికి ఉన్న ప్రత్యేక పరిస్థితి ఏంటంటే, వారికి అవినీతి ఆరోపణల సుం చి బయటపడేందుకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయి.

లేదా ఆ కేసు లు సాదివేతతో విచారణ పేరుతో కొనసాగుతుంటాయి. ఇదిలా ఉంటే.. అవినీతి ఆరో పణలు, శిక్షల వాస్తవం ఎలా ఉంటుందంటే.. సుఖ్‌రామ్ తన బెడ్డుకింద నోట్ల కట్టలతో దొరికి పదేండ్ల శిక్ష పడితే ఆయన జైలు జీవితం గడుపాలి. కానీ ఎన్నడూ జైలులో ఉండలేదు. అంతేకాకుండా ఆయన సుదీర్ఘకాలం కాంగ్రెస్ సభ్యునిగా కొనసాగారు. ఇప్పుడు ఆయన వయస్సు 90 ఏండ్లు. ఇక ఆయన జైలుకు పోయే పరిస్థితే ఉత్పన్నం కాదు.

అలాగే దేశంలోని జైళ్ల ను పరిశీలిస్తే.. గరిష్ఠ సంఖ్యలో నిమ్న, వెనుకడినవర్గాల వారే జైళ్లలో ఎందుకు మగ్గుతున్నారు? వారే నేరాలు, ఘోరాలు, హత్యలు చేస్తున్నా రా? అంటే ఉన్నతవర్గాల వారికన్నా, వెనుకబడిన బడుగువర్గాల వారి లో నేర స్వభావం ఎక్కువ ఉంటుందని అనుకుందామా? ఉరితీయబడిన వారిలో ఎక్కువ దళితులు, మైనారిటీ వర్గాల వారే ఎందుకున్నారు? ఈ క్రమంలోనే మరో ముఖ్యమైన ప్రశ్న మనం వేసుకోవాలి. నేరా లు, అవినీతి గురించి పోలీసులు, న్యాయవ్యవస్థ, పాలనావ్యవస్థల్లో ప్రత్యేక వర్గం వారిలో జన్యుపరమైన లక్షణాల కారణంగానే ఆ దుర్గుణా లున్నాయని భావిస్తున్నారా? నిజానికి మన పాలక వ్యవస్థలు, మీడి యా, పోలీసుల తీరును చూస్తే అలానే అనిపిస్తుంది. దళిత, మైనార్టీల విషయంలోనూ ఒకే నీతి ఉన్నది. అది ఆధిపత్యనీతి. అణిచివేతనీతి.

అవినీతి ఆరోపణల గతంలోకి వెళ్లి చూస్తే.. మాయా వతి దళితురాలు. లాలూప్రసాద్ యాదవ్, ములా యంసింగ్ యాదవ్ అవినీతి ఆరోపణలు, ఆదాయానికి మించిన ఆస్తుల విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీరు ఓబీసీ వర్గానికి చెందినవారు. ఇలా అనేక అవినీతి ఆరోపణలు, విచారణలు, అప్పుడప్పుడు అవినీతి కేసు లు పతాక శీర్షికలకు ఎక్కడం లాంటివన్నీ మెరుపులుగా కనిపిస్తుంటా యి. ఇవన్నీ రాజకీయవర్గాల అవసరాల నేపథ్యంలో వెలుగుచూస్తున్నా యి. చర్చల్లోకి వస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే పాలకపక్ష రాజకీయ అవసరాల నేపథ్యంలో కొన్ని అవినీతికేసులు ముందుకు వస్తున్నాయి. మీడియా పతాక శీర్షికల్లోకి వస్తున్నాయి.

బుద్ధుడు సందేశాలు



దు:ఖం, సుఖం ఒకేచోట ఉంటాయి

దు:ఖమున్నచోటే సుఖముంటుంది. అయితే దాన్ని చూడ్డానికి నీ దృష్టి వికసిం చాలి, బురద అంటుకొన్నవాడు అది పంచు కోవడానికి దగ్గరలోనికి ఉన్న చెరువు కోసం వెతికినట్లు, పాప పంకిలమైన ఈ జీవితాన్ని ప్రక్షాళన చేసుకోవడానికి మరణ రహితమైన నిర్వాణ సాగరాన్ని నీవు ఆశ్రయించాలి. దాన్ని కోసం వెతికాలి వెదకపోతే అది దాని తప్పు కాదు గాదా! రోగి వైద్యుని సహాయం పొంది చికిత్స చేయించుకకోకపోతే అది వైద్యుని తప్పు ఎలా అవుతుంది? అలాగే పాప భారం చేత చేయించుకోపోతే అది వైద్యున్ని తప్పు ఎలా అవుతుంది? అలాగే పాప భారం చేత క్రుంగిపోయే మనిషి వివేకవంతుడైన గురువు సహాయం పొందకపోతే గురువును తప్పుబట్టలేము"

సిద్ధార్థుడు ఆగంతకుని ఉదాత్తమైన పలుకు లను విని ఇలా అన్నాడు: "నువ్వు మంచి సందేశం ఇచ్చావు. నా పని నెరవేరుతుంది. నా కర్తవ్యం అర్థమయ్యింది. మా తండ్రి నన్ను జీవితాన్ని అనుభవించి ఆనందించమన్నాడు. వంశ కీర్తి ప్రతిష్టల కోసం కృషి చేయమ న్నాడు. నేనింకా చిన్నవాడిని, ఆధ్యాత్మిక చింతనకు అనర్హుణ్ణి అంటాడు." అప్పుడు పూజ్యుడైన శ్రమణుడు తల అడ్డంగా వూపి, "ఆధ్యాత్మిక జీవితం గడపానికి ఇదే సరియైన సమయం అని ఎప్పుడూ ఎవరూ చెప్పలేరు" -అన్నాడు. ఆ మాట వినగానే సిద్ధార్థునిఒడలు పులక రించింది. హృదయం ఆనందంతో ఎగసిప డింది.

అయితే సత్యాన్వేషణకు ఇదే సరియైన సమయం," అన్నాడు. "సంపూర్ణ జ్ఞానోద యానికి అవరోధంగా ఉన్న బంధనాలన్నిటిని ఛేదించుకొనడానికి ఇదే అదను. ఇల్లు విడిచి, భిక్షువుగా మారి, ముక్తి పథాన్ని వెదకడానికి బయలుదేరవలసిన సమయం ఆసన్నమైంది," అని తన మనోగ తాన్ని వెల్లడించాడు. సిద్ధార్థుని నిశ్చయాన్ని దేవదూత విన్నాడు. తన ఆమోదం తెలిపాడు. "నిజమే, ఇదే మంచి సమయం. ఆధ్యాత్మిక జీవనం ఆరంభించు. నీ జీవిత పరమార్థాన్ని సాధించు.

దిన ఫలాలు

ఆదివారం -7-1-2018

మేషం: భావోద్వేగాలను అదుపులో ఉంచుకోకపోతే సమ స్యలు తప్పవు. రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు లాభదాయ కంగా ఉంటాయి. స్త్రీలు కొనుగోలుదార్లను ఆకట్టుకుంటాయి.

వృషభం: ఆర్థిక సాయం కోసం అర్థించేవారి విషయంలో అప్ర మత్తంగా ఉండాలి. పెద్దల అభిప్రాయాలను గౌరవించడానికి ప్రయత్నిస్తారు. మిత్రుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది.

మిథునం: ఆభరణాలపై పెట్టుబడుల వల్ల లబ్ధి పొందుతారు. స్నేహితులు తప్పుదారి పట్టించే ఆస్కారం ఉంది. ప్రయాణాల వల్ల ప్రయోజనం ఉంటుంది. మహిళలకు గుర్తింపు లభిస్తుంది.

కర్కాటకం: స్పెక్యులేషన్ వ్యవహారాలకు దూరంగా ఉండాలి. స్నేహితులు, కుటుంబంతో సంతోషంగా గడుపుతారు. భావో ద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి.

సింహం: ఆర్థిక సమస్యలు విమర్శలకు దారితీస్తాయి. వైవా హిక జీవితంలో ఇబ్బందులు ఎదురవుతాయి. వాహనం నడ పేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. పునరాలోచన అవసరం.

కన్య: ఖర్చులు పెరిగా ఆదాయం బాగుంటుంది. జీవిత భాగ స్వామితో సంతోషంగా గడుపుతారు. ప్రయాణాల సమయం లో విలువైన వస్తువుల పట్ల ఏకాగ్రత అవసరం.

తుల: ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ఖర్చులు పెరిగే ఆస్కారం ఉంది. కొత్తవారితో పరిచయాల విషయంలో అప్ర మత్తంగా ఉండాలి. సహనానికి పరీక్షా సమయం.

వృశ్చికం: ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. స్నేహితులతో విభేదాలు తలెత్తే ఆస్కారం ఉంది. ఆశ్చర్యాన్ని కల్గించే ఆహ్వా నాలను అందుకుంటారు. సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు.

ధనస్సు: అసౌకర్యాన్ని కలిగించే ఆర్థిక సమస్యలకు తల్లిదం డ్రుల సాయంతో ముగింపు పలుకుతారు. ఆధ్యాత్మిక కార్యక్ర మాల్లో పాల్గొంటారు. ప్రేమ వ్యవహారాల్లో భంగపాటు.

మకరం: ఆస్తి వ్యవహారాలు వాస్తవరూపం దాల్చి, అద్భు తమైన లాభాలను తెచ్చిపెడతాయి. దూరపు బంధువులను కలుసుకుంటారు. ప్రముఖులను కలుసుకుంటారు.

కుంభం: వృత్తిలో నైపుణ్యానికి పరీక్షా సమయం. పెట్టుబ డులు, భవిష్యత్తు విషయాల పట్ల గోప్యత పాటించాలి. సన్ని హితుల ధోరణి ఆందోళన కలిగిస్తుంది.

మీనం: స్పెక్యులేషన్ వ్యవహారాలకు దూరంగా ఉండాలి. దు రలవాట్లను వదిలించుకోడానికి ప్రయత్నిస్తారు. ఊహించని ప్రయాణాల వల్ల అసహనానికి గురవుతారు.

ఆరోగ్యం



ఇవి పాటిస్తే..
అనారోగ్యమనేది దరిచేరదు..

ఆరోగ్యమే మహాభాగ్యం. ఆరోగ్యవంతమైన శరీరముంటే ఏ పనినైనా సాధించవచ్చు. ఆరోగ్యానికి మూలం మన రోగనిరోధక వ్యవస్థ. దాన్ని జాగ్రత్తగా చూసుకుంటే ఎటువంటి ఇబ్బందులు రావు. తగినంత నిద్ర, విశ్రాంతి తీసుకోనివారు, పొగత్రాగేవారు, మత్తుపానీయాల అలవాటు ఉన్నవారు విటమిన్ లోపం వల్ల రోగ నిరోధక వ్యవస్థ దెబ్బతింటుంది. ఆ వ్యవస్థ సక్రమంగా పనిచేసేందుకు సమపాళ్ళలో పోషక పదార్థాలను శరీరానికి అందించాలి. అందులో ఒక్కొక్క పదార్థానికి ఒక విశిష్ట గుణముంది.

మామిడి, బత్తాయి వంటి పండ్ల ద్వారా ఎ- విటమిన్, నిమ్మ, ఉసిరి వంటి వాటి ద్వారా విటమిన్ – సి, కోడిగుడ్ల ద్వారా జింక్, ఐరన్, బాదం, కిస్‌మిస్ వంటి ద్వారా మేలు చేసే క్రొవ్వులు, చేపల ద్వారా ఇతర పోషకాలు శరీరానికి అందగలవు. ప్రతిరోజు ఆహారంలో ఆకుకూరలు, పెరుగు తీసుకోవాలి. వెల్లుల్లికి వైరల్ ఇన్ఫెక్షన్ రాకుండా కాపాడే శక్తి ఉంది. మాంసం తింటే బాక్టీరియాతో వచ్చే వ్యాధులు అరికడుతుంది. కాబట్టి జంక్ ఫుడ్ వంటి వాటిని తీసుకొని అనారోగ్యాన్ని కొనితెచ్చికోకూడదు.



చలికాలం చిట్కాలు

చలికాలంలో చర్మసమస్యలు ఎక్కువగా ఇబ్బందిపెడుతాయి. వీటిని అధిగమించాలంటే సాధ్యమైనన్ని నీళ్లు తాగడమే ఉత్తమమైన పరిష్కారం.

- పొడిబారిన చర్మానికి అవకాడో ఆయిల్, మినరల్ ఆయిల్ రాసుకుంటే కాంతివంతంగా మారుతుంది.
- చలికాలంలో హ్యూమిడిఫైయర్స్ చాలా అవసరమవుతాయి. దీనివల్ల చర్మం పొడిబారడం, పగలడం తగ్గుతుంది.
- పాదాలకు పగుళ్ల రాకుండా ఉండేం దుకు పెట్రోలియం జెల్లీ, గ్లిజరిన్ లాంటివి వాడాలి.

చరిత్రలో జనవరి 7



1927 : కృత్రిమ పాదం జైపూర్ ఫూట్ సృష్టికర్త ప్రమోద్ కరణ్ సేథీ జననం.

1935: భారత జాతీయ సైన్సు అకాడమీని కలకత్తాలో నెలకొల్పారు.

1937 : ప్రముఖ రాజకీయవేత్త మరియు మంత్రివర్యులు దొడ్డపనేని ఇందిర జననం.

1964 : అమెరికన్ నటుడు నికోలస్ కేజ్ జననం.

1950 : సామాజిక సేవికురాలు, సంఘ సంస్కర్త, బాల కార్మికులపై చేసిన కృషికి రామన్ మెగసే అవార్డు గ్రహీత శాంతా సినా జననం. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్‌కు చైర్ పర్సన్. పద్మశ్రీ అవార్డు గ్రహీత శాంతాసినా. ఎంవీ ఫౌండేషన్ స్థాపకురాలు. శాంతాసినా ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెంది నవారు. జనవరి 7వ తేదీ 1950 సంవత్సరంలో పుట్టా రు. బాల్యంలో సికింద్రాబాద్ సెయింట్ అన్స్ హైస్కూలులోనూ, కీస్ హైస్కూల్లోనూ విద్యాభ్యాసం చేశారు. 1972 సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రంలో పీజీ చేసారు. 1976లో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాల యం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ప్రొఫె సర్‌గా చేరారు. 1981 సంవ త్సరంలో ఎంవీ ఫౌండేషన్ (మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్) స్థాపించారు. మొద ట్లో సామాజిక మార్పుకోసం, పేదలకు విద్యనందించే దృక్పథంతో ఆరంభించిన ఈ ఫౌండేషన్ 1991 తర్వా త బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం వీధిబాలలకు విద్యాబుద్ధులు చెప్పించింది. ఈ సంస్థలో 80 వేలకు పైగా స్వచ్ఛందసేవకులు ఉన్నారు. శాంతా సినా విద్యావంతులైన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించింది. ఈమె పితామహుడు మామిడిపూడి వెంకటరంగయ్య గొప్ప విద్యావేత్త, సమాజవాది, చరిత్ర ఆచార్యుడు. మద్రాసు విశ్వవిద్యాలయంలో వినూత్న విద్యావిధానా నికి కృషిచేసిన సంస్కర్త.

తండ్రి మామిడిపూడి ఆనందం చార్టెడ్ ఎకౌంటెంట్. ఆయన రెండుసార్లు రాజ్యసభ సభ్యుడుగా ఎంపికయ్యారు. శాంత సోదరుడు నాగార్జున ఐఎయస్ అధికారిగా పదవిలో ఉండగానే 47వ ఏట మృతి చెందాడు. శాంతా సినా 60 దశకం లో ఉస్మానియా విశ్వవిద్యాల యంలో చదివే రోజుల్లో తనకు కాబోయే భర్త అజొయ్ కుమార్‌ను కలిసింది. ఆ తరువాత శాంతా సినా ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డి చేసే రోజుల్లో ఇద్దరూ పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు.

తిరుమల చరితామృతం

తిరుపతి, తిరుమల స్థానికులు ఈ సేవలు చూడడానికి కాని, దర్శనానికి కాని డబ్బు ఇచ్చేవారు కాదు. వారిని "వుండూరు వాళ్లు" అంటారు. వాళ్లకది హక్కు ఈ రుసుములు బయట నుండి వచ్చిన యాత్రికుల నుండే వసూలు చేసేవారు.

కొండ ఎక్కడానికి యాత్రికులు రుసుం చెల్లించేది మొదట్లో లేదు. కాని రెంటర్లు, అమలుదార్లు వచ్చి, ఆర్కాటు నవాబు సంరక్షణలో ఆలయం వున్నప్పుడు, ప్రతి యాత్రికునిపైనా యాత్రిక పన్ను వేసేవారు. బ్రాహ్మణులు, యోగులు, సన్యాసులు, బైరాగులు, గోసాయిలు, దాసరుల దగ్గర ఈ రుసుం వసూలు చేసేవారు కాదు. తర్వాత కంపెనీవారి కాలంలో ఆనాటి కలెక్టరు స్ట్రాటన్ అన్న ఆయన ప్రభుత్వానికి సిఫార్సు చేసి, ఈ పన్ను రద్దుచేయించాడు.

.... ఈ నేపథ్యం వల్ల మన తాతల కాలంనుంచీ మనలో 'శ్రీనివాసుడు ధనికుల దేవుడు' అన్న భావం నాటుకుపోయి ఉండవచ్చు.

కాని శ్రీనివాసుడు -అంటే సాక్షాత్తు నారాయణుడికి మనషులు సృష్టించిన నగలు, నగదు కావాలా? అఖర్లేకపోతే 'వడ్డీకాసులవాడు' అని పేరెందుకు వచ్చింది అని కొందరు వాదిస్తారు. "పెళ్లి చేసుకోవడం కోసం అప్పు చేశాడు కదా? అదే మన దగ్గర గుంజుతున్నాడు." అనుకుంటారు భక్తులు. కాని పురాణాలు ఏం చెబుతున్నాయి?

పద్మావతీదేవిని పెళ్లి చేసుకోవాలని కుబేరుడి వద్దనుంచి చక్రవర్తికి 14 లక్షల రామటెంకీలు అప్పుగా తీసుకొన్నాడు. భక్తులిచ్చిన కానుకల నుంచి అప్పు తీర్చివేస్తానని కుబేరుడికి పత్రం రాసిచ్చాడు కదా! దానికి బ్రహ్మదేవులు, పరమేశ్వరుడు, అశ్వత్థవృక్షం సాక్షులని కూడా పురాణం చెప్పింది కదా...! మరి అప్పు తీర్చాలి కదా! అందుకే ఆయనకు ఎక్కువ కానుకలు ఇచ్చేవారంటే ప్రీతి అని చెప్పవచ్చు అన్నది వాదం. పురాన కథ వాస్తవమైనా, ఇది లోక విడంబన కోసం, కలికాలం యుగధర్మం చూపించడానికే అన్నది అర్థం చేసుకోవాలి.

కుబేరుని మాటలలోనే మనకు తెలుస్తుంది. మొదట అప్పు అడిగినప్పుడు, స్వామితో "స్వామీ, ఇదేమి కోరిక,అంతా నీదే కదా! నీ సొమ్మును కాపాడే బాధ్యత నాకు అప్పగించా"వంటాడు. స్వామి -శ్రీపతి /లక్ష్మీపతి. అంతా ఆయనదే. ఆయనకు మనమిచ్చే దాని అవసరం లేదు. ఆయనకు లక్ష్మీ దేవి అవసరం కూడా లేదు. సర్వ స్వతంత్రుడు, సర్వశక్తిమంతుడు. ఒదరూ అతని అధీనులు. అతనికి సమానులే లేరు. ఇక ఆయనకంటే అధికుల ప్రసక్తి ఎక్కడ? స్వరమణుడు. ఎవ్వరి అవసరం లేకుండానే ఆయన మనుగడ. అటువంటి స్వామికి మనమిచ్చే కానుకలెందుకు కావాలి? .... ఎందుకంటే ఆయన దయామయుడు, కరుణాసముద్రుడు. మనకు అనుగ్రహం చేయడానికి మనచేత సమర్పణ చేయించుకుంటాడు. ఏదిచ్చినా భక్తితో త్యాగబుద్ధితో ఇవ్వాలి. ఎవరి శక్తికొలది వారు ఇవ్వాలి. దాన్నిబట్టి అనుగ్రహం చేస్తాడు.మన కర్మను బట్టి ఫలం. అలా మన కర్మలకు ఫలం ఇచ్చేవాడు. శ్రీనివాసుడు. కర్మ మూడు రకాలు, మానసిక, వాచిక, కాయిక కర్మలు. అన్ని రకాల కర్మలకూ ఫలం ఉంటుంది. సత్కర్మకు పుణ్యం, దుష్కర్మకు పాపం. ఈ కర్మఫలం భగవంతుడు సుఖదుఃఖాల రూపంలో ఇస్తాడు. సామాన్యంగా మనం అనుకుంటాం. ఈ పాప పుణ్యాలు బ్యాంకు ఖాతాల్లాంటివని. చాలా మంద పాపాలు చేసి, వాటిని ధార్మిక కార్యక్రమాలతోనో, దానాలతోనో కడిగి వేసుకోవచ్చని, కొంత స్వామి హుండీలో వేస్తే పాప ప్రక్షాళన అయిపోతుందనీ అనుకుంటారు.మన శాస్త్రం నిర్దిష్టంగా చెప్తోది. పాప కర్మకు పాపఫలమే, పుణ్య కర్మకు పుణ్యఫలమే. విడివిడిగా రెండూ అనుభవించాల్సిందే. పుణ్యం చేసి పాపం ఖాతా తగ్గించుకోలేం. పాపానికి దుః ఖం, పుణ్యానికి సుఖం. ఈ విషయంలో భగవంతుడు అంద రినీ సమంగానే చూస్తాడు.

అలా అయితే భగవంతుడెం దుకు? భక్తి ఎందుకు? దీనికి సమాధానం. స్వస్వరూప భగవత్ దర్శనంతో 'సంచిత' – అంటే ఎన్నో జన్మలుగా మనం సంపాదించి మూటలు కట్టి అనుభవించాల్సిన కర్మ ఫలం దగ్ధమవుతుందిట. ముందు జన్మలలో చేయబోయే పాపాలను మూటలు గట్టే కర్మగ్రంథులు కూడా దగ్ధమై –'ఆ గామి' కర్మఫలం కూడా ఉండదు. మిగిలేదీ ప్రారబ్ధమే. ప్రారబ్ధం అనుభవించి తీరాల్సిందే. ప్రారబ్ధం ఇప్పుడు మనం అనుభవిస్తున్న కర్మఫలం.

దానిని అర్థం చేసుకోవడానికే బ్రహ్మసూత్రాల్లో ఒక ఉదాహరణ ఇచ్చారు. రైతు పంట కోసం, నూర్చి, బస్తాల్లో నింపుతాడు. క్రిందటి ఏటి పంట, ఈనాటి పంట అన్ని బస్తాలూ 'సంచిత'మైతే అతను అనుభవించడానికి ఒక బస్తా విప్పి అందులో రోజుకు కొంత అనుభవిస్తాడు అదీ.

శ్రీనివాసుడు దయామయుడు



రొయ్యలు తినొద్దంటూ ఫత్వా

హైదరాబాద్ : ముస్లిములు రొయ్యలు తినకుండా నిషేధిస్తూ జామియా నిజామియా చీఫ్ ముఫ్తీ ముహమ్మద్ అజీముద్దీన్ ఫత్వా జారీ చేశారు. 142 ఏళ్ల ఇస్లామిక్ యూనివర్శిటీ రొయ్యలపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకోవడం వివాదాస్పదంగా మారింది. రొయ్యలు చేపల కిందకు రావని, అవి కీటకాలకు చెందినవని జామియా నిజామియా పేర్కొంది. రొయ్యలు తినడాన్ని హేయమైన ఘటనగా అజీముద్దీన్ పేర్కొన్నారు.

మళ్లీ మార్కులు కొట్టేసిన సుష్మా



విదేశాల్లో చదువుకోవాలనుకున్న విద్యార్థినికి సాయం

న్యూఢిల్లీ:
విదేశీ వ్యవహారాల్లో ఏ చిన్న సమస్య వచ్చినా మంత్రి సుష్మా స్వరాజ్ పరిష్కరిస్తారు. ఆ సమస్య పెద్ద వాళ్లకు వచ్చిందా సాధారణ ప్రజలకు వచ్చిందా అని ఆమె ఆలోచించరు. విదేశాల్లో చిక్కుకున్న వారిని భారత్ తీసుకురావాలన్నా, లేదా ఉన్నత చదువుల కోసం ఇక్కడి వారిని విదేశాలకు పంపాలన్నా ఆమె తలచుకుంటే క్షణాల్లో జరిగిపోతుంది. ఇటీవల రాజస్థాన్‌కి చెందిన ఓ విద్యార్థినికి అలాంటి సహాయమే చేసి సుష్మా స్వరాజ్ తనది గొప్ప మనసని మరోసారి చాటుకున్నారు.


జలాల్‌పూర్‌కు చెందిన భానుప్రియ హరిత్‌వాల్ 10, 12 తరగతుల్లో విశేష ప్రతిభ కనబరిచి.. ఉన్నతవిద్య కోసం రాజస్థాన్ ప్రభుత్వం అందించే కోటి రూపాయల ఉపకారవేతనానికి ఎంపికైంది. కాలిఫోర్నియా స్టేట్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ చేయాలని ఆశించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయం నిర్వహించిన అంతర్గత పరీక్షలో కూడా ఉత్తీర్ణత సాధించింది. ఆ తర్వాత అసలు సమస్య మొదలైంది. విదేశాలకు వెళ్లాలంటే వీసా కావాలి.. అందుకోసం ఆమె దరఖాస్తు చేసుకోగా దౌత్య కార్యాలయం 2 సార్లు తిరస్కరించింది. విదేశీ విద్యాలయంలో సీటు సాధించినప్పటికీ వీసా జారీ కాక పోవడంతో వెళ్లలేక పోయింది. దీంతో భానుప్రియ కుటుంబం స్థానిక ఎంపీని ఆశ్రయించింది. ఆయన చొరవ తీసుకుని మంత్రి సుష్మాస్వరాజ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె వెంటనే స్పందించి వీసా వచ్చేలా చేసింది.



కొత్త రూ.10 నోట్లు సరే మరి పాత నోట్ల సంగతేంటి?

ముంబై :
రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా కొత్త రూ.10 నోట్లు జారీచేయడానికి సిద్ధమవుతోంది. చాకోలెట్ బ్రౌన్ రంగులో మహాత్మా గాంధీ సిరీస్‌లో ఈ నోట్లను ప్రవేశపెట్టబోతున్నట్లు తెలిసింది. భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఈ కొత్త నోటుపై కొణార్క్ సూర్య దేవాలయం, మహాత్మాగాంధీ చిత్రం, అశోక్ స్తంభం, స్వచ్ఛ భారత్ లోగో వంటి ఫీచర్లు ఉండనున్నాయని ఆర్‌బీఐ పేర్కొంది. కొత్త నోట్లు తీసుకొస్తున్నప్పటికీ, గతంలో తీసుకొచ్చిన అన్ని రూ.10 నోట్లూ చెల్లుబాటు అవుతాయని తెలిపింది. సెంట్రల్ బ్యాంకు ఇప్పటికే ఈ కొత్త నోట్లను 1 బిలియన్ పీసులను ప్రింట్ చేసినట్టు ఈ విషయం తెలిసిన అధికారులు చెప్పారు. కొత్త రూ.10 నోటుకు సంబంధించి డిజైన్‌ను కూడా ప్రభుత్వం గత వారంలోనే ఆమోదించిందని తెలిపారు. ప్రస్తుతం మారుస్తున్న పాత రూ.10 నోటు డిజైన్‌ను 2015లో రూపొందించారు. గతేదాది ఆగస్టులో మహాత్మాగాంధీ సిరీస్‌లో ఆర్‌బీఐ కొత్త రూ.200, రూ.50 నోట్లను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. నకిలీలకు వ్యతిరేకంగా ఆర్‌బీఐ కొత్త డిజైన్‌లో తక్కువ డినామినేషన్ నోట్లను పునఃప్రవేశపెడుతోంది. ఈ క్రమంలోనే కొత్త రూ.10 నోట్లు, కొత్త డిజైన్‌లో మార్కెట్‌లోకి వచ్చేందుకు సన్నద్ధమవుతున్నాయి. నకిలీలను, అవినీతిని నిర్మూలించడానికే 2016 నవంబర్ 8న ప్రభుత్వం పెద్దనోట్లు రూ.1000, రూ.500ను రద్దు చేసింది. చలామణీలో ఉన్న 86 శాతం కరెన్సీని వెనక్కితీసుకుంది. అప్పటి నుంచి కొత్త నోట్లను ప్రవేశపెట్టడం, పాత వాటి స్థానంలో కొత్తవి తీసుకురావడం చేస్తున్నాయి. డిసెంబర్ 8 నాటికి ఆర్‌బీఐ 16.96 బిలియన్ పీసుల రూ.500 నోట్లు, 3.6 బిలియన్ పీసుల రూ.2000నోట్లను ప్రింట్ చేసినట్టు ఆర్థికమంత్రిత్వ శాఖ లోక్‌సభలో తెలిపింది. ఈ నోట్ల మొత్తం విలువ రూ.15.79 ట్రిలియన్లు.

యోగి వివాదాస్పద నిర్ణయం





లక్నో :
ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ తీసుకున్న ఓ నిర్ణయం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాలన్నింటికి కాషాయం రంగు పూయాలని గతంలో ఆయన అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే అది ఇప్పుడు మతపరమైన విమర్శలకు దారితీసింది.

ప్రధాన కార్యాలయంతోసహా హజ్ కమిటీ ఆఫీసులకు కూడా అధికారులు కాషాయం రంగు పూయటంతో ఇస్లాం మత పెద్దలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాత్రికి రాత్రే ఆయా కార్యాలయాల గోడల రంగును మార్చేయటంతో అది తీవ్ర స్థాయికి చేరుకుంది. "ఇది ముమ్మాటికీ ఖండిం చదగ్గ అంశం. సాధారణంగా ఈ రంగు రాజ కీయాల కోసం వాడేది. ఇలాగే చూస్తూ ఊరుకుంటే రేపు హజ్ యాత్రికులను కూడా కాషాయపు దుస్తులు ధరించమంటారేమో?" అని లక్నో హజ్ కమిటీ అధి కారి షాహర్ ఖాజీ మౌలానా అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే ఈ నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణా మాలు ఉంటాయని హజ్ కమిటీ సభ్యులు హెచ్చరిస్తున్నారు.

ఇక షియా పర్సనల్ లా బోర్డు సభ్యుడు మౌలానా యాసుబ్ అబ్బాస్ కూడా యోగి ప్రభుత్వ చర్యను తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇలా రంగులు మారుస్తారా? అది కూడా మనోభావాలు దెబ్బతీసేలా.. ఇది మంచి పద్ధతి కాదు అంటూ అబ్బాస్ పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం విమర్శలను చాలా తేలికగా తీసుకుంటోంది. మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి మోసిన్ రాజా.. సీఎం యోగి నిర్ణయాన్ని సమర్థిస్తున్నారు. కాషాయం రంగు శక్తి, వెలుగులకు చిహ్నమని... ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఆయన పేర్కొంటున్నారు.

ఉత్తర ప్రదేశ్‌లో కార్యాలయాలకు అంతకు ముందు తెలుపు రంగు ఉండేది. కానీ, గతేడాది అక్టోబర్‌లో వాటన్నింటికి కాషాయం రంగు పూయాలంటూ యోగి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యాలయం లాల్ బహదూర్ శాస్త్రి భవన్‌తో మొదలుపెట్టి ఇప్పటిదాకా 100 స్కూళ్లకు, 50 ఆర్టీసీ బస్సులకు, పలు పోలీస్ స్టేషన్‌లకు కాషాయం రంగు అధికారులు అద్దేశారు.

ఎయిర్ ఇండియా రేసులో ఉన్నాం!

విస్తారా సీఈవో లెస్లీతింగ్ వెల్లడి

న్యూఢిల్లీ:
ప్రభుత్వరంగ ఎయిర్ ఇండియా కొనుగోలుకు టాటా గ్రూపు, సింగపూర్ ఎయిర్‌లైన్స్ బిడ్ వేసే అవకాశాలున్నట్లు ఎయిర్ విస్తారా సీఈవో లెస్లీతింగ్ సంకేతమిచ్చారు. టాటా గ్రూపు, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌ల సంయుక్త సంస్థ విస్తారా అన్న విషయం తెలిసిందే. శుక్రవారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో లెస్లీతింగ్ మాట్లాడారు. అయితే, టాటాగ్రూపు, సింగపూర్ ఎయిర్‌లైన్స్ కలసి బిడ్ వేస్తాయా లేక విడిగానా అన్న విషయంపై మాత్రం ఆయన స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతానికైతే అంతర్జాతీయ సేవల్లోకి ప్రవేశించడం, సేవల విస్తరణపైనే ఇరు సంస్థలూ ఫోకస్ చేస్తున్నట్లు చెప్పారు. ఎయిర్‌లైన్స్ మార్కెట్లో 13 శాతం వాటా కలిగి ఉన్న ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసేందుకు గతంలోనే ఇండిగో, టాటా గ్రూపు ఆసక్తి వ్యక్తీకరించాయి.





ఆప్ ప్రభుత్వం మరో మాహిష్మతి



ఢిల్లీ:
టాలీవుడ్ దర్శకుడు రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటించిన 'బాహుబలి' సినిమా ఏ ముహూర్తాన విడుదలైందో కానీ, ఇప్పుడు ప్రతీ చిన్న విషయానికి ఆ సినిమాలోని పాత్రలను ఆపాదిస్తూ మాట్లాడుతున్నారు. తెలుగు రాజకీయాల్లో ఇది విపరీతం కాగా, జాతీయ రాజకీయాల్లోకీ 'బాహుబలి' ప్రవేశించింది. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ నేత కుమార్ విశ్వాస్ తనను తాను 'బాహుబలి'గా అభివర్ణించుకున్నారు. ఢిల్లీలోని 'ఆప్' ప్రభుత్వాన్ని మాహిష్మతి సామ్రాజ్యంగా పేర్కొన్న ఆయన దీనిని శివగామిలా వేరొకరు పాలిస్తున్నారని అన్నారు. ఈ బాహుబలి (తనను)ని చంపడానికి రోజుకో కట్టప్ప పుట్టుకొస్తున్నాడని ఆరోపించారు. ఆప్ నేత గోపాల్ రాయ్ తనపై చేసిన వ్యాఖ్యలపై కుమార్ విశ్వాస్ ఇలా స్పందించారు. ఈనెల 16న రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. సంజయ్ సింగ్, సుశీల్ గుప్తా, నరైన్ దాస్ గుప్తా లను ఆప్ తమ అభ్యర్థులుగా ప్రకటించింది. దీంతో సీటు ఆశించిన విశ్వాస్ అసంతృప్తితో ఉన్నారు. దీనికితోడు ఇటీవల గోపాల్ రాయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసే వారిని రాజ్యసభకు ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. దీంతో అసలే సీటు దక్కక కోపంగా ఉన్న కుమార్ విశ్వాస్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. మునిసిపల్ ఎన్నికలు జరిగిన ఆరు నెలల తర్వాత గోపాల్ రాయ్ నిద్రలేచారని ఎద్దేవా చేశారు. బాహుబలి లాంటి తనను చంపేందుకు కట్టప్పలు పుట్టుకొస్తున్నారని పేర్కొన్నారు.

చంద్రబాబు సమర్థతే రాష్ట్రాన్ని నడిపిస్తోంది

మంత్రి అచ్చెన్నాయుడు

నరసన్నపేట,న్యూస్‌లీడర్:
రాష్ట్ర విభజన వలన ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని అయిన ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు సమర్థవంతమైన పరిపాలన చేస్తున్నాడని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత,రావాణా శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలం గొట్టిపల్లి పంచాయితిలో జన్మభూమి-మన ఊరు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతు 10 సంవత్సరాలు పరిపాలన చేసిన కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సమస్యలు ఎక్కువ చేసిందని స్వర్థప్రయోజనాలకోసం వారు వాడుకున్నారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని గాలికి వదలేసి వారు స్వలాభం చూసుకున్నారని అన్నారు. అందుచేత రాష్ట్రంలో నేడు సమస్యలు పెరిగాయని తెలిపారు. విభనతో 16 వేల కోట్లు లోటు బడ్జట్‌తో ఉన్న రాష్ట్రాకి సమర్థవంతమైన పాలన ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు అందిస్తున్నారని ఆయన తెలిపారు. విద్యా, అభివృద్ధికి 25 వేల కోట్లు కేటాయించిందని అయిన తల్లిదండ్రులు ప్రవేటు విద్యకు ప్రోత్సహిస్తున్నారని అచ్చెన్నాయుడు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పరిచేందుకు సుమారుగా 4,800 కోట్లుతో మౌలిక సదుపాయాలకు కల్పిస్తున్నామని తెలిపారు.ఉపాధ్యాయులు పోస్టులు భర్తికి ముఖ్య మంత్రి కంకణం కట్టారని తెలిపారు. అలాగే రాష్ట్రంలో 50 లక్షల మందికి పింఛన్లు చెల్లిస్తుందని ఉగాది నుండి చంద్రన్న పెళ్లికానుకగా ఆడపిల్లలు కోసం పెళ్లి కానుక అందించడానికి సిద్ధంగా ఉన్నారని అచ్చెన్నాయుడు అన్నారు. రూ. 25 వేల కోట్లు రైతు రుణమాఫీ చేసామని చెప్పారు.మార్చి నుండి జిల్లాలో రెండువ పంటలు పండించెందుకు వంశధార నాగావలి ఆదునీకరణతో నీరు అందిస్తుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి,ఎంపిపి శిమ్మ,పార్వతమ్మ,జడ్పీటీసి చింతు శకుంతల,ఏఎంసి అధ్యక్షులు బైరి బాస్కరారవు, డిఆర్‌డిఈ పిడి కిషోర్‌బాబు,పత్యేక అధికారి గోవిందరావు సర్పంచ్ కోరెడ్డి క్రిష్ణవేణి,ఎంపిడివో డా.డి.వి.విధ్యాసాగర్, తహశీల్దార్ జెల్లేపల్లి రామారవు, నరసన్నపేట సర్పంచ్ గొద్దు.చిట్టిబాబు,ఎంపిటీసి సభ్యులు వివిధ శాఖాదికారలు పాల్గున్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగ అవకాశాలు

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట,న్యూస్‌లీడర్:
నిరుద్యోగ యువతి యువకులకోసం నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగ అవకాశాల ఉన్నాయని ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి తెలిపారు. పద్మావతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ నైపుణ్యతను పెంపొందించె దిశగా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేసిదని తెలిపారు. దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాని చెప్పారు. ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలని ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి చెప్పారు. ఈ జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులకు పద్మావతి డిగ్రీ కళాశాలలో శిక్షనివ్వడం జరుగుతుందని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ గోవిందరావు తెలిపారు. విద్యార్థులు ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు పోటీ పరిక్షలు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 830 మంది హాజరయ్యారని ఇందులో 102 మంది ఎంపికయ్యారని దుర్గాప్రసాద్ చెప్పారు. వీరందరికి ఎంపిక ఈ కార్యక్రమంలో ఎంపిపి శిమ్మ పార్వతమ్మ, జెడ్పీటీసి చింతు శకుంతల, ఎ.ఎం.సి చైర్మన్ బైరి భాస్కరారవు, కళాశాల డైరెక్టర్ పల్లి సూరిబాబు, పాగోటి రామచంద్రరావు, సర్పంచ్ గొద్దు చిట్టిబాబు తదితరలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ డైరీ ఆవిష్కరణ

నరసన్నపేట,న్యూస్‌లీడర్:
స్థానిక లయిన్స్ క్లబ్ డైరీని లయన్స్ క్లబ్ అధ్యక్షులు చీపురు కృష్ణమూర్తి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చీపురు కృష్ణమూర్తి మాట్లాడుతూ డైరిలో లయిన్స్‌క్లబ్‌కు సంబంధించిన సమగ్ర సమాచారంతో పాటు సభ్యులు వివరాలు లయిన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రదాన కార్యదర్శి గొందు సతన్నారనయణ, కోశాదికారి డి.వి.రఘు,లయిన్ ప్రతినిధులు యు.బాలగంగాధర్, సదాశివుని క్రిష్ణ,డా.వి.సన్యాసిరావు తదితరలు పాల్గొన్నారు.

రజనీ ఎంట్రీపై మరోసారి కమల్ కామెంట్



చెన్నై:
సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయ ప్రవేశంపై నటుడు కమల్ హాసన్ మరోసారి స్పందించారు. రజ నీకాంత్ రాజకీయాల్లో రావాడాన్ని స్వాగతిస్తున్నా నట్లు తెలిపారు. నడిగర్ సంఘం స్టార్ నైట్ కార్య క్రమానికి మలేసియా వెళుతూ చెన్నై విమానాశ్ర యంలో కమల్ హాసన్ మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లోకి వస్తున్నానని రజనీ ప్రకటన చేయ గానే తాను స్వాగతించానని గుర్తుచేశారు. ఆర్కే నగర్ ఉప ఎన్నికల్లో టీటీవీ దినకరన్ విజయంపై తాను వ్యాఖ్యలు చేయటంపై కూడా కమల్ స్పందించారు. ఈ విషయంలో తనపై ఏ ఫిర్యాదులు, కేసులు వచ్చినా చట్టపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధమని అన్నారు.

ఆర్కేనగర్ ఉప ఎన్నికలో ధనప్రభావం కారణంగానే దినకరన్ గెలిచారని, ఈ విజయం భారత ప్రజాస్వామ్యానికి మచ్చ అని కమల్ హాసన్ తీవ్రంగా విరుచుకుపడిన సంగతి తెలిసిందే. కమల్ హాసన్ వ్యాఖ్యలపై దినకరన్ వర్గీయులు తీవ్రంగా మండిపడుతున్నారు. కమల్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

అమరావతికి అత్యున్నత విద్యాసంస్థలు

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి : ఆచార్య విజయరాజు



అమరావతి:
విదేశీ విద్య సామాన్యులకు కూడా అందేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్ షిప్పులు అందిస్తోందని, రాష్ట్రేతర విదేశీ ఉన్నత విద్యా సంస్థలను ఆహ్వానించి అమరావతిలో నెలకొల్పుతోందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య విజయరాజు అన్నారు. శనివారం విజయవాడలోని మారిస్ స్టెల్లా కాలేజీలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు తరగతిగదులకే పరిమితం కాకుండా సమాజంలో అనుసంధానమై గ్రామీణుతో మమేకమై అక్కడి పరిస్థితులు, వారి సమస్యల పరిష్కారంలో పనిచేయాలని తెలిపారు. ఓడీఎఫ్, శానిటేషన్, వాతావరణ పరిరక్షణ తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించేందుకు చక్కని పరిష్కారమార్గం జన్మభూమి కార్యక్రమం అన్నారు. భారత ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో 3.71శాతం నిధులు విద్యారంగానికి కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం 13.65 శాతం కేటాయించిందన్నారు. జేఆర్‌సీ, టీఐఎస్‌ఎస్, ఎస్‌ఐఈఎంఎస్, బ్రిటీష్ కౌన్సిల్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి కార్యక్రమాలు విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నతస్థానాలు అందుకోవాలని విజయరాజు ఆకాంక్షించారు.

గోతులమయంగా పట్టుపురం రోడ్డు



గోతుల మయమైన రోడ్డు

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్:
మండలంలో గల జర్జంగి నుంచి కస్తూరిపాడు మీదుగా పట్టుపురం వరకు నిర్మించిన రోడ్డు గోతుల మయమై అధ్వాన్నస్థితిలో కొట్టుమిట్టాడుతుంది. 10 సంవత్సరాలు క్రితం నాబోర్డు నిధులుతో నిర్మించిన ఈ రోడ్డు వల్ల సుమారు 10 గ్రామాలకు సౌకర్యం కలుగుతుంది. కాగా పట్టుపురం, విశ్వనాథపురం పంచాయతీల పరిధిలో గ్రానైట్ పరిశ్రమలు విస్తరించటంతో భారీ వాహనాలు నడవటం వల్ల రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ఇప్పటికైన రాష్ట్ర రవాణాశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ రహదారిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నత శిఖరాల అధిరోహణకు ఇంటర్ విద్యే కీలకం



మాట్లాడుతున్న విజయమ్మ తదితరులు

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్:
జీవితంలో ఉన్నత విద్య అభ్యశించటం ద్వారా ఉన్నత శిఖరాలు అదిరోహించాలంటే హైస్కూల్‌తో పాటు ఇంటర్ విద్యే కీలకమని శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు తల్లి కింజరాపు విజయమ్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉర్వి విక్రమ్ చార్టిబుల్ ట్రస్టు విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో బాలికలకు వ్యక్తిత్వ వికాశానికి జీవననైపుణ్యాలు, 10వ తరగతి తరువాత విద్య ఉపాధి వంటి వంశాలుపై కౌన్సిలింగ్ కెరియర్ గైడ్స్ అనే అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బాలికలు తమ కౌమార దశే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు అవిరోదించటానికి కీలకమని ఈ సమయంలోనే తమ భవిష్యత్‌ను మంచి మార్గంలో నడిచేందుకు దోహదపడుతుందని అందువల్ల ప్రతి విద్యార్థిని మంచి విద్యాను అభ్యసించి ఉన్నత శిఖరాలను అవరోదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కెజీవీ జిల్లా ఉన్నత పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సుమారు 850 మంది బాలికలు పాల్గొన్నారు, అలాగే ఉర్వి చార్టిటబుల్ ట్రస్టు చైర్మన్ వివిఎస్‌బి రావు, రిటార్డు ఐపీఎస్, జిల్లా విద్యాశాఖాధికారి సాయిరాం, కొత్తమ్మ తల్లి ట్రస్టుబోర్డు చైర్మన్ బోయిన గోవిందరాజులు, స్థానిక సర్పంచ్ దేవాది సింహాద్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తమ్మినేని అమరవాణి, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి

పట్టుపురం గ్రామప్రజలు ఆందోళన



నీటి సమస్య పరిష్కరించాలని ఎంపీడీఓను నిలదీస్తున్న మహిళలు

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్ :
తమకు త్రాగేందుకు నీరు లేకపోతే మరుగుదొడ్లు నిర్మించి ఏమి చేయాలంటూ మండలంలో గల పట్టుపురం గ్రామప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ ఎం.రేణుక ఆధ్వర్యంలో జరిగిన జన్మభూమి - మా ఊరు గ్రామ సభలో ఆ పంచాయతీ మహిళలు సంబంధిత అధికారులను త్రాగునీటి సమస్యపై నిలదీశారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించాలని లేకపోతే సంక్షేమ పథకాలు రద్దుచేస్తామని అధికారులు చెబుతున్నారు.

నీటి సౌకర్యంలేని మరుగుదొడ్లు ఎందుకని వారు అధికారులను ప్రశ్నించారు. ప్రస్తుతం గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించిన తరువాత మరుగుదొడ్లు గూర్చి ఆలోచిస్తామని వివరించారు. గ్రామంలో వేసిన రెండు బోర్లునుంచి మంచినీరు రాలేదని, ఒక బోరు పాడైందని ఈ పరిస్థితిలో దళితవాడలో ఉన్న మంచి నీటి భావి నుంచి నీరు తెచ్చుకుంటున్నామని వాపోయారు. అలాగే అర్హులకు పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని, బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి నిర్మించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కె.శ్రీదేవి, సీఎస్‌డీటీ బైరి రాజు, విద్యుత్‌శాఖ ఏఈ చంద్రశేఖరరావు, పశు వైద్యాధికారి రాంకుమార్, మండల ఇంజనీరింగ్ అధికారి రెడ్డి సత్యాన్నారాయణ, ఉపాధి ఏపీఓ జి. హరిప్రసాద్, మండల విద్యాశాఖధికారి టి. నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పశువుల పెంపకానికి ప్రభుత్వ సహాయం

పశువైద్యాధికారి రాంకుమార్



పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్ రాంకుమార్

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్ :
పశువుల పెంపకం దారులకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని పశువైద్యాధికారి డాక్టర్ ఎ. రాంకుమార్ అన్నారు. కస్తూరిపాడు, పట్టుపురం గ్రామంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువుల పెంపకం దారులకు ఊరూరా పశుగ్రాసం అనే పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగించుకోవాలన్నారు. ప్రతి యేటా పశువుల గూర్చి వేల కోట్లు ఖర్చు చేస్తుందని దీనికి సంబంధించిన వివరాలు అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. అలాగే పశువుల్లో చూడీ, కృత్రిమగర్భధారణ, సాధారణ వ్యాధులు పై పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే పశువుల గొంతువాపు, సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర ధర్మారావు, గ్రామ సర్పంచ్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

7న వైజాగ్ పింక్ రన్

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి ఆదివారం ఉదయం 5గంటలకు వైజాగ్ పింక్ రన్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మిలింద్ సోమన్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల ఆరోగ్యం, రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడానికే ఈ రన్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఆసక్తి గలవారు పూర్తివివరాలకు 0891 6952333 నెంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా ఆయన కోరారు.

ముగిసిన ఆలిండియా మేజర్ పోర్టు క్రీడా పోటీలు



విజేతలకు ట్రాఫీ అందజేస్తున్న కృష్ణబాబు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: విశాఖపట్నం పోర్టు స్పోర్ట్సు కౌన్సిల్ నిర్వహించిన అఖిల భారత మేజర్ పోర్టు క్రీడా పోటీలు ఘనంగా ముగిసాయి. ఈ పోటీలలో ఆతిధ్య విశాఖ పోర్టు చెస్ టోర్నీలో ఛాంపియన్‌గాను, టేబుల్ టెన్నీస్ ఛాంపియన్స్ కోల్‌కొతా పోర్టు ట్రస్టు, క్యారమ్స్ ఛాంపియన్స్‌గా చెన్నై పోర్టు ట్రస్టు గెలుపొందాయి. టోర్నీలో గెలుపొందిన జట్లకు పోర్టుట్రస్టు చైర్మన్ కృష్ణబాబు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోర్టు ఉన్నతాధికారులు హరిచంద్రన్, మెహరా, హరిహరరావు, నిరజ్ సంపత్, టీవీఎస్‌వై శర్మ, పాల్గొన్నారు.

నేవల్ స్టాఫ్ వైస్ చీఫ్ విశాఖ సందర్శన



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: రక్షణ శాఖకు చెందిన నేవీ హెడ్ క్వార్టర్స్ నుంచి నేవల్ స్టాఫ్ వైస్ చీఫ్ వైస్ అడ్మిరల్ అజిత్ కుమార్ రెండురోజుల పర్యటనలో భాగంగా విశాఖ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన తూర్పు నౌకాదళం ప్రధాన అధికారి వైస్ అడ్మిరల్ కరంబీర్ సింగ్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.

త్యాగరాజ కీర్తనలు ఎంతో మధురం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: త్యాగరాజ కీర్తనలు ఎంతో మధురమని వేలాది మంది కళాకారులు ఈ కీర్తనలు దేశవిదేశాలలో ఆలపించి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందారని ప్రముఖ సంగీత విద్వాంసులు నాదనిధి డాక్టర్ అన్నవరపు రామస్వామి అన్నారు. శ్రీ త్యాగరాజ జయంతోత్సవాల సందర్భంగా కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు, త్యాగరాజ ఆరాధన ట్రస్టు అధ్యక్షులు సీఎస్ఎన్ రాజు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐవీఎల్ .శాస్త్రి, సరవనేని విజయకుమార్, గొల్లపూడి మారుతీరావు, సైదా కృష్ణప్రసాద్, పేరాల బాలమురళీ కృష్ణతో పాటు వందలాది మంది కళాకారులు పాల్గొన్నారు. శ్రీలతల కచేరిలో పలు కృతులు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ప్రజా సంక్షేమమే తేదేపా లక్ష్యం

ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు



జన్మభూమి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

ఎన్ఏడీ, న్యూస్‌లీడర్ : ప్రజా సంక్షేమమే తెదేపా ప్రభుత్వ లక్ష్యమని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు అన్నారు. స్థానిక జీవీఎంసీ 41 వార్డ్ తుమ్మదపాలెం లో వార్డు అధ్యక్షుడు పెంటకోట త్రినాథ రావు అధ్వర్యంలో జరిగిన జన్మభూమి మా ఊరు గ్రామసభలో అయన పాల్గొన్నారు. ముందుగా అధికారులు జన్మభూమి ప్రతిజ్ఞ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారానికే సీఎం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి. నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులు, పింఛన్లు, వ్యవసాయ రాయితీ యంత్ర పరికరాలు, చంద్రన్న బీమా సభ్యత్వ నమోదు పత్రాలను పంపిణీ చేశారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ, అంగన్‌వాడీల ఆధ్వర్యంలో సిబ్బంది స్టాళ్లు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జన్మభూమి కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని జన్మభూమిని ప్రశంసిస్తున్నారని గుర్తుచేశారు. జన్మభూమి గ్రామసభల్లో ప్రజల వినతులను స్వీకరించి నమోదు చేయటం జరుగుతోందన్నారు. గత జన్మభూమిలో వచ్చిన వినతులను పరిష్కరిస్తున్నారని వివరించారు. జన్మభూమి తొలిరోజున 3లక్షల మంది పాల్గొంటే 4వరోజున 6.54లక్షల మంది పాల్గొన్నారని అన్నారు. మిగిలిన 5 రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తి కనిపించాలన్నారు. అలాగే గత 4రోజుల్లో రాష్ట్ర వ్యాప్తముగా 4,68,063 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో 1,52,444 ఫిర్యాదులు మాత్రమే అప్‌లోడ్ చేశారని, వచ్చిన ప్రతి ఫిర్యాదును రియల్ టైంలో పరిష్కరిస్తామని అన్నారు. అలాగే సమస్యలు పరిష్కరించక పోతే అసంతృప్తికి దారి తీస్తుందని, ఎంతమం దికి వీలైతే అంతమందికి న్యాయం చేయాలని ఇదివరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసి అధికారులు రమణమూర్తి ఏసీపీ రాజేశ్వరావు , కంచరపాలెం పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ సీఐ చంద్రశేఖర్ , ట్రాఫిక్ విభాగం సీఐ శ్రీనివాస్ ,చిరంజీవి ,వార్డు టీడీపీ నాయకుడు పెంటకోట అజయ్ బాబు , కుట్టా (కార్తీక్), పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ షరిఫ్ ఉర్సు ఉత్సవాలు



ఉత్సవంలో పాల్గొన్న ముస్లిం సోదరులు

ఎంఏడీ,న్యూస్ లీడర్ : గ్రేటర్ విశాఖ 40 వ వార్డు పరిధి డాక్టర్ జాకీర్ హుస్సేన్ నగర్ మస్జిద్ -ఈ -అల్ ఖాదిర్ గ్యార్వీ షరిఫ్ ఉర్స్ ఉత్సవాలు శనివారం వేడుకగా నిర్వహించారు వరుసగా రెండు రోజులు నిర్వహించిన గ్యార్వీ షరిఫ్ ఉర్స్ ఉత్సవాలకు పరిసర ప్రాంతాలనుండి ముస్లిం సోదరులు , మహిళలు , చిన్నారులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు . కార్యక్రమంలో బాగంగా సాయంత్రం నిర్వహించనున్న తక్రీర్ కార్యక్రమానికి నగరంలో ఉన్న పలు మస్జిద్ లనుండి మౌలానాలు " ముస్లిం మత పెద్దలు " హాజరవుతారని నిర్వహకులు తెలియ జేశారు . ముస్లిం లు ఎంతో భక్తి శ్రద్దలతో నిర్వహిస్తున్న గ్యార్వీ షరిఫ్ ఉర్స్ ఉత్సవాలకు ఉత్తర నియోజక వర్గం ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు ముఖ్య అతిధులుగా కార్యక్రమంలో పాల్గుటారని ఉర్స్ కమిటి అధ్యక్షులు షేక్ నూరి తెలిపారు . కార్యక్రమంలో బాగంగా మర్రిపాలెం పరిసర ప్రాంతల ప్రజలకు పెద్ద ఎత్తున దవతే ఆమ్ "అన్నసమారాధన " నిర్వహిస్తునామని తెలిపారు . కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కోస్తాంధ్ర యోధుల సంఘం కన్వినర్ ఐ .ఎం అహ్మద్ , మస్జిద్ కమిటి అధ్యక్షులు ఉస్మాన్ అలీ , ఉపాధ్యక్షులు మహమ్మద్ సర్వర్ , కార్యదర్శి అన్సర్ వలి , ఉర్స్ కమిటి సభ్యులు మున్నా , జిలానీ , ఖాజా నిజాముద్దీన్ , సలీమ్ , దాదా , ఖమ్రుద్దీన్ పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు .

జనరల్ ఆచార్యుల ఉద్యోగ నియామక ప్రకటన విడుదల చేయాలి

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఏయూలో ఎస్సీ, ఎస్టీ ఆచార్యుల బ్యాక్‌లాగ్ నియామకాల భర్తీ తరువాతే జనరల్ ఆచార్యుల ఉద్యోగ నియామక ప్రకటన విడుదల చేయాలని, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ విధానాన్ని తప్పనిసరిగా పారదర్శకంగా అమలు చేయాలని ఏయూ ఎస్సీ, ఎస్టీ, బీసీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.షారోన్ రాజు డిమాండ్ చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యము మీడియాలో ప్రకటనలు చేస్తూ, దళితులు, గిరిజనుల అభ్యున్నతికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నామని తెలియజేస్తారు. వాస్తవానికి 92 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర గల ఆంధ్రాయూనివర్శిటీలో గత 10 సంవత్సరాలు సైఐడి,ఎస్సీ,ఎస్టీ బ్యాక్ లాగ్ ఆచార్యుల ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడం శోచనీయం. గతంలో 2014లో ఏయూ. అధికారులు చేపట్టిన ఆచార్యుల అక్రమ ఉద్యోగ నియామకాలు, అక్రమ పదోన్నతులు రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ విధానానికి తూట్లు పొడిచి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన విషయంలో ప్రస్తుతం గౌరవ హైకోర్టు నుండి ఎటువంటి తీర్పు వెలువడలేదు. ఈ పరిస్థితుల్లో ఏ.యూ.లో ఆచార్యుల భర్తీకి త్వరలో ప్రకటన వెలువడనున్న నేపథ్యంలో ఏ.యూ. అధికారులను ముందుగా కలాగ్ ఆచార్యుల ఉద్యోగాలు నియామకాలు చేపట్టండి మరియు రూల్ ఆఫ్ రిజర్వేషన్ మరియు రోస్టర్ విధానాన్ని పారదర్శకంగా ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు. రేషనలైజేషన్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫార్సు శాస్త్రీయంగా లేకపోవడం కారణంగా వివిధ విభాగాల్లో అనిశ్చిత పరిస్థితి నెలకొన్న పరిస్థితులను బట్టి ఉన్నత విద్యను అభ్యసించినటువంటి నిరుద్యోగ దళితులు తమ విచారాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు భృతి ఇవ్వాలి



వినతి పత్రం అందిస్తున్న దళిత నాయకులు

గోపాలపట్నం, న్యూస్‌లీడర్ : రాష్ట్రంలో నిరుద్యోగ భృతి ఎస్సీ, ఎస్టీ ఇంటర్ చదివిన నిరుద్యోగులకు కల్పించాలని ప్రభుత్వ విప్ డొక్క మాణిక్య వరప్రసాద్‌కు జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పి. ఆదినారాయణ అధ్వర్యంలో దళిత సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. మాజీ మంత్రి మాణిక్య వరప్రసాద్‌ను కలిసిన వారిలో కొప్పల వెంకట్రావు, పాసలపూడి జాన్, చింతాడ సూర్యం, పైడిరాజు, కటితి సాధూరావు, నమ్మకూరి రమేష్, ఆర్. అప్పారావు, మళ్లవరపు సూర్యనారాయణ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈపీడీసీఎల్‌లో ఎన్‌టీఆర్ జలసిరి పై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కమలాకరబాబు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్‌టీఆర్ జలసిరి పథకంలో భాగంగా రైతులకు రాయితీపై ఇస్తున్న సోలార్ పంప్‌సెట్లపై ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నెడ్‌క్యాప్ (యన్ఆర్ఈడీసీఏపీ) వైస్ ఛైర్మన్ & ఎండీ ఎం. కమలాకరబాబు, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ఎం.ఎం.నాయక్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ హెచ్.వై.దొర ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో ఛానల్ పార్టనర్స్, సప్లయర్స్ పాల్గొన్నారు. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ హెచ్‌వై దొర మాట్లాడుతూ ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ఇప్పటి వరకు 4100 మంది రైతులు సోలార్ పంప్‌సెట్లకు చెల్లింపులు జరిపారని ఇప్పటి వరకు 2721 సలార్ పంప్‌సెట్లు అమర్చామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ లోపు పూర్తి చేయాలని సోలార్ ఛానల్ పార్టనర్స్‌ను నెడ్‌క్యాంప్ ఎండీ ఎం.కమలాకర బాబు ఆదేశించారు. అలాగే త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన సహకారాన్ని సోలార్ ఛానల్ పార్టనర్స్‌కి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్లు బొడ్డు శేషుకుమార్, టి.వి.ఎస్. చంద్రశేఖర్, సోలార్ & కమర్షియల్ జనరల్ మేనేజర్ డి. సుమన్ కల్యాణి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేయాలి

ఎస్‌కోట. న్యూస్‌లీడర్ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జన్మభూమి కార్యక్రమంతో గ్రామాల్లో ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు చేస్తున్న ముఖ్యమంత్రి కృషికి అభినందనీయమని అలాగే ప్రజలో పెరుగుతున్న మూఢ నమమ్మకాల నిర్మూలన కోసం కూడా జన్మభూమి సభలో ప్రజలకు తెలియజేయాలని జనజాగృతి సేవా సంస్థ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ శీరాపు శ్రీనివాసరావు కోరారు

లక్ష్య సాధనకు కృషి చేయాలి

పోర్టు ట్రస్ట్ చైర్మన్ కృష్ణబాబు



టాయిలెట్ల బ్లాకును ప్రారంభిస్తున్న కృష్ణబాబు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ లక్ష్యసాధనకు నిరంతరం కృషిచేయాలని పోర్టు చైర్మన్ కృష్ణబాబు పిలుపునిచ్చారు. పాతనగరంలో గల సెయింట్ అలోషియస్ ఉన్నత పాఠశాలలో పోర్టు సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన టాయిలెట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లలను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంచుకొని , పట్టుదలతో ఉన్నత చదువులు చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,ఉపాధ్యాయులు, పోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

7న నర్సీపట్నంలో 5కె రన్

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : 5వ విడత జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో బాగంగా యువజన సర్వీసుల శాఖ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల సంయుక్తంగా నర్సీపట్నంలో 5కె రన్ నిర్వహిస్తున్నట్టు జిల్లా యువజన సంక్షేమ అధికారి, ముఖ్యకార్యనిర్వాహణ అధికారి ఎస్.వెం కటేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మకాయల చినరాజప్ప,మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొం టారన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా సంఘాలు, యువజన సంఘా లు, ఎన్ఎస్ఎస్ , ఎన్‌సీసీ క్యాడెట్స్ విద్యార్థులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

నార్త్ ఏసీపీ బదిలీ తగదు

పెందుర్తి, న్యూస్‌లీడర్ : జెర్రిపోతులపాలెం దళిత మహిళలపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకున్న విశాఖనార్త్ ఏసీపీ అర్జున్‌ను బదిలీ చేయడం అక్రమం అపార్టీ కార్యదర్శి గంగారావు వ్యతిరేకించారు. తెలుగు దేశం పార్టీ వత్తిడికి తలొగ్గి పోలీసు కమిషనర్ ఈ చర్యలు తీసుకోవడం చట్టవ్యతిరేకమని ఈ చర్యను సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తుందని పోలీస్ కమిషనర్ తక్షణమే అక్రమ బదిలీ చర్యలు వెనక్కు తీసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో డిమాండ్ చేసారు.

భక్తి శ్రద్ధలతో లలితా పారాయణ



లలితా పారాయణం చేస్తున్న భక్తులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : పన్‌టౌన్‌లో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో స్వామి వివేకానంద జయంతోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున భక్తిశ్రద్ధలతో లలితా పారాయణం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఎస్ఎన్.పాత్రుడు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో బండారు గణపతిస్వామి, డిఎస్. అగర్వాల్, సోంబాబు, సూరాడ అప్పారావు, వాసుపల్లి ఉమాదేవి, ఎ.లక్ష్మి, శంకుతల తదితరులు పాల్గొన్నారు.

కనమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న పూనం మాలకొండయ్య



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారిని ప్రిన్సిపల్ సెక్రటరీ, హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ డిపార్టుమెంట్ అధికారి పూనంమాలకొండయ్య దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు, వేదపండితులు సాంప్రదాయ ప్రకారం పూర్ణ కుంభ స్వాగతం పలికి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు.

టాటా వినియోగారులకు సేవలు

దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: ఆరేళ్ళ వారంటీతో అన్ని రకాల ట్రాక్టర్స్, ట్రయిలర్స్, మల్టీ ఆక్సిల్ టక్కు, టిప్పర్స్‌పై ఆరు సంవత్సరాలు వారంటీ అందిస్తున్నట్లు టాటా మోటర్స్ కమర్షియల్ వెహికల్ హెడ్ గిరిష్ వాఘ్ ప్రకటనలో తెలిపారు. దేశంలో మొదటిసారిగా ఇంత మొత్తంలో వారంటీ అంద జేయడం వినియోగదారులను ఆకట్టుకుంటుందన్నారు. మొబైల్ సర్వీసు వెహికల్ ద్వారా వినియోగదారుడి చేరువలో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. మొబైల్ వర్కు షాప్‌లు 165, కంటైనర్ వర్కుషాప్‌లు 360 ద్వారా దేశవ్యాప్తంగా టాటా వినియోగదారులకు సేవలు అందజేస్తున్నట్లు తెలియజేశారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై నిలిచిన వాహనాలను 24గంటల్లో డెలవరీ చేయనున్నట్లు తెలిపారు. కస్టమర్ యాప్ ద్వారా సర్వీసు బుకింగ్ సౌకర్యం, నిర్వహణ టిప్స్, డీలర్ లోకేషన్, సర్వీసు హిస్టరీ ఎమర్జన్సీ ఎస్ఒఎస్ ఉపయోగించుకోవచ్చునన్నారు.

లీడర్ ఎంప్లాయిమెంట్ న్యూస్



శీ వేంకటేశ్వర వర్సిటీలో 125 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ వివిధ విభాగాల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

వివరాలు.....

1 అసిస్టెంట్ ప్రొఫెసర్

మొత్తం పోస్టుల సంఖ్య: 125

అర్హత: పీజీ/ నెట్/ స్లెట్/ సెట్/ పీహెచ్‌డీ.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్ కాపీకి ఇతర ధ్రువపత్రాలు జతచేసి పోస్టులో పంపాలి.

చివరి తేది: 02.02.2018

చిరునామా: Registrar, Sri Venkateswara University, Tirupati - 517502.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ ఖాళీలు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

వివరాలు....

గెస్ట్ ఫ్యాకల్టీ

మొత్తం ఖాళీల సంఖ్య: 07

అర్హత: ఎంబీఏ/ పీహెచ్‌డీ. సంబంధిత రంగంలో 10 సంవత్సరాల అనుభవం ఉండాలి.

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా

దరఖాస్తు విధానం: పూర్తి వివరాలతో కూడిన సీవీకి ఇతర ధ్రువపత్రాలు జతచేసి పోస్టులో పంపాలి.

చివరి తేది: 15.01.2018.

చిరునామా: School Of Management Studies, University Of Hyderabad, Dr.C.R. Rao Road, Central University Post, Hyderabad - 500046.

శ్రీ కృష్ణ దేవరాయ వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

అనంతపురంలోని శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ వివిధ విభాగాల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

వివరాలు.....

1 అసిస్టెంట్ ప్రొఫెసర్

ఖాళీలు: నిబంధనల ప్రకారం

అర్హత: పీజీ/ నెట్/ స్లెట్/ సెట్/ పీహెచ్‌డీ.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్ కాపీకి ఇతర ధ్రువపత్రాలు జతచేసి పోస్టులో పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: 26.01.2018

హార్డ్ కాపీలను పంపడానికి చివరి తేది: 31.01.2018

చిరునామా: The Registrar, Sri Krishnadevaraya University, Ananthapuramu - 515003.

యోగి వేమన వర్సిటీలో టీచింగ్ పోస్టులు

కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయం వివిధ విభాగాల్లోని అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

వివరాలు.......

అసోసియేట్ ప్రొఫెసర్/ అసిస్టెంట్ ప్రొఫెసర్

ఖాళీలు: వర్సిటీ నిబంధనల ప్రకారం

అర్హత: పీజీ/ నెట్/ స్లెట్/ సెట్/ పీహెచ్‌డీ. బోధన, పరిశోధన రంగాల్లో అనుభవం ఉండాలి.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా


దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్ కాపీకి ఇతర ధ్రువపత్రాలు జతచేసి పోస్టులో పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: 27.01.2018

హార్డ్ కాపీలను పంపడానికి చివరి తేది: 31.01.2018

చిరునామా: The Registrar, Yogi Vemana University, Kadapa - 516003.

చైనా-పాక్ ఒక్కటవుతాయా?



బీజింగ్ :
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన షాక్‌తో పాకిస్తాన్ నెమ్మదిగా చైనావైపుకు అడుగులు వేస్తోంది. కొన్నేళ్లుగా ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం కావడం, సీపీఈసీ ప్రాజెక్ట్ వల్ల దగ్గరయ్యాయి. పాకిస్తాన్‌ను అగ్రరాజ్యం దూరం పెట్టడంతో.. ఆ దేశం చైనాకు సన్నిహితమవుతోంది.

ఈ నేపథ్యంలోనే ఇరాన్‌లోని చాబహార్ పోర్టుకు దగ్గరగా ఉన్న పాకిస్తాన్ మిలటరీ బేస్‌ను చైనా తన అధీనంలోకి తీసుకున్నట్లు గ్లోబల్ టైమ్స్ పత్రిక ప్రకటించింది. ట్రంప్ ట్వీట్‌తో పాకిస్తాన్-చైనా సంబంధాల్లో కొత్త శకం మొదలైందంటూ కమ్యూనిస్ట్ కంట్రీ అధికార పత్రిక స్పష్టం చేసింది. ద్వైపాక్షిక వాణిజ్యం, ఇరు దేశాల మధ్య ఆర్థిక లావాదేవీలు, పెట్టుబడుల్లో చైనా కరెన్సీ యువాన్ వినియోగానికి పాకిస్తాన్ స్టేట్ బ్యాంక్ ఆమోదం తెలపడం బంధాన్ని మరింత దృఢతరం చేయడమేనని గ్లోబల్ టైమ్స్ అభిప్రాయపడింది. దీంతో పాకిస్తాన్, చైనాలోని ప్రభుత్వ, ప్రైవేటురంగ సంస్థలు ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడుల కార్యకలాపాల కోసం యువాన్‌ను వినియోగించడానికి అనుమతి లభించింది. ఈ కారణంతోనే చైనా తాజా మరో 50 బిలియన్ డాలర్ల పెట్టుబడిని పాకిస్తాన్‌లో పెడుతున్నట్లు ప్రకటించింది.

చైనా-పాకిస్తాన్ మధ్య సంబంధాలు బలోపేతం కావడంపై వాషింగ్టన్ టైమ్స్ ఆందోళనలు వ్యక్తం చేసిది. పాక్‌లోని జివానీ ప్రాంతంలో చైనా ఓడరేవును, మిలటరీ బేస్‌ను ఏర్పాటు చేసుకుంటోంది. ఇది భవిష్యత్‌లో ప్రమాదకర పరిస్థితులను తీసుకువస్తుందని నిపుణులు చెబుతున్నారు. జివానీ ఓడరేవు ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు దగ్గరగా ఉంటుంది. అంతేకాక గల్ఫ్ ఆఫ్ ఒమన్‌కు సరిహద్దుకూడా, ఇక గ్వాదర్ నౌకాశ్రయానికి కూడా సమీపంలో ఉంటుంది. ఇది ఒక వ్యూహాత్మక ఎత్తుగడ అని అమెరికన్ మేధావులు అంటున్నారు. అఫ్ఘనిస్తాన్‌కు ఎగుమతుల కోసం ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవును భారత్ అభివృద్ధి చేసింది. ఇది భారత్‌కు ఇబ్బందులు తెచ్చి పెట్టేదని అమెరికా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

స్పేస్ ల్యాబ్ కూలిపోతుందా?



హాంగ్‌కాంగ్:
చైనాకు చెందిన అంతరిక్ష కేంద్రం కూలిపోనున్నది. తొమ్మిది టన్నుల బరువున్న టియాంగాంగ్ 1 త్వరలో భూమిపై పడిపోనున్నది. డ్రాగన్ దేశం చైనా స్పేస్ ల్యాబ్‌ను మొదటిసారి నిర్మించింది. నిజానికి 2020 మధ్య వరకూ ఆ స్పేస్ స్టేషన్‌ను వివిధ రకాల ప్రయోగాల కోసం వాడాలని చైనా భావించింది. కానీ అనూహ్యంగా టియాంగాంగ్ లైఫ్ ముగిసినట్లు ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బహుశా.. ఈ ఏడాది మార్చి నెలలోగా ఈ అంతరిక్ష కేంద్రం కూలిపోయే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే ఖచ్చితంగా ఎప్పుడు పడిపోతుందన్న తేదీని మాత్రం చెప్పలేకపోతున్నారు. ఒకవేళ స్పేస్ స్టేషన్ కూలితే, అది ఎక్కడ పడుతుంది, దాని వల్ల ఎంత మందికి నష్టం జరిగే ప్రమాదం ఉందన్న అంశాన్ని కూడా స్పష్టంగా తేల్చలేకపోతున్నారు. కానీ కాలం చెల్లిన టియాంగాంగ్ మాత్రం భూ కక్ష్యలోకి రాగానే.. అది భూ వాతావరణం లోనే భస్మం అయ్యే అవకాశాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. సౌరశక్తితో నడిచే ఈ స్పేస్ స్టేషన్ సుమారు 11 మీటర్ల పొడుగు ఉంటుంది. ఆస్ట్రోనాట్లకు స్లీప్ స్టేషన్లు కూడా ఉన్నాయి. సెప్టెంబర్ 2011లో టియాంగాంగ్‌ను అంతరిక్షంలోకి ప్రయోగించారు. ఆ ఏడాది నవంబర్‌లోనే చైనా దానికి షెంజో స్పేస్‌క్రాఫ్ట్‌ను కూడా లింక్ చేసింది. ఆ తర్వాత రెండు సార్లు ఆస్ట్రోనాట్లు ఆ స్పేస్ ల్యాబ్‌కు వెళ్లి వచ్చారు.

11వ స్థానంలో 'బాహుబలి 2'





హైదరాబాద్:
దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన 'బాహుబలి: ది కన్‌క్లూజన్' మరో అరుదైన ఘనతను సాధించింది. ఇప్పటికే పలు రికార్డులు సృష్టించి, అంతర్జాతీయంగా తెలుగు చిత్ర పరిశ్రమ ఖ్యాతిని పెంచిన ఈ సినిమా గురించి తెలుసుకోవడానికి ఆన్‌లైన్లో కోట్ల మంది వెతికారు. ఇంగ్లీషు వికీ పీడియాలో ఈ సినిమా గురించి అత్యధిక మంది చదివారని వికీ మీడియా ప్రకటించింది. 2017లో ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మంది వికీపీడియాలో చదివిన 25 ఆర్టికల్స్ జాబితాను ఆ సంస్థ విడుదల చేసింది.ఇందులో 'డెత్స్ ఇన్ 2017' 3.73 కోట్ల వ్యూస్‌తో మొదటి స్థానంలో ఉంది. తర్వాత అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు 'డొనాల్డ్ ట్రంప్' పేరు ఉంది. ఆయన వికీపీడియా ప్రొఫైల్‌ను 2.96 కోట్ల మంది చూశారు. 1.92 కోట్ల వ్యూస్‌తో 'ఎలిజబెత్ 2' మూడో స్థానంలో, 1.87 కోట్ల వ్యూస్‌తో 'గేమ్స్ ఆఫ్ థ్రోన్' (సీజన్ 7) నాలుగో స్థానంలో ఉంది. 1.46 కోట్ల వ్యూస్‌తో 'బాహుబలి: ది కన్‌క్లూజన్' పదకొండో స్థానాన్ని సొంతం చేసుకుంది. ఓ ప్రాంతీయ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ఈ ఘనతను సాధించడం విశేషం. ప్రభాస్, రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ, సత్యరాజ్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రమిది. కీరవాణి బాణీలు అందించారు. ఈ సినిమా మొత్తం రూ.1700 కోట్లు వసూలు చేసినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

స్టేడియంలో క్రికెటర్ల భార్యల సందడి



కేప్‌టౌన్:
ఆతిథ్య దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో జరుగుతోన్న మ్యాచులో భారత క్రికెటర్ల భార్యలు సందడి చేశారు. కోహ్లి, ధావన్, రోహిత్ శర్మ, భువనేశ్వర్ సతీమణులు గ్యాలరీలో కూర్చుని మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. వీరంతా మన క్రికెటర్ల లక్కీ ఛార్మ్ గర్ల్స్. కొత్తగా పెళ్లయిన కోహ్లి, భువనేశ్వర్ తమ భార్యలతో కలిసి దక్షిణాఫ్రికా పర్యటనకు వచ్చారు.

కోహ్లి పెళ్లయిన తర్వాత మైదానంలో అడుగుపెట్టడం ఇదే తొలిసారి. గతంలో ఐపీఎల్, ఆస్ట్రేలియాతో మ్యాచులకు అనుష్క హాజరైన సంగతి తెలిసిందే. ఈ వారంలో బాలీవుడ్ నటి అనుష్క తిరిగి భారత్ వచ్చి యథావిధిగా సినిమా షూటింగుల్లో పాల్గొంటుందని వార్తలు వచ్చినప్పటికీ ఆమె ఇంకా దక్షిణాఫ్రికాలోనే ఉంది. నూతన సంవత్సర వేడుకల అనంతరం అనుష్క భారత్ తిరిగి వచ్చేస్తుందని అప్పట్లో వార్తలు వచ్చాయి.

మైదానంలో కోహ్లి సేన ఫీల్డింగ్, బ్యాటింగ్ చేస్తున్నంత సేపు గ్యాలరీలో కూర్చున్న అనుష్క తదితరులు భారత క్రికెటర్లను ప్రోత్సహిస్తూ కనిపించారు. ప్రస్తుతం వీరి ఫొటోలు నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి. ఆటగాళ్ల లక్కీ ఛార్మ్ గర్ల్స్ వీరే అంటూ నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో తెగ ట్వీట్లు పెడుతు న్నారు. భారత్-దక్షిణాఫ్రికా మధ్య మూడు టెస్టు మ్యాచుల సిరీస్‌లో భాగంగా మొదటి టెస్టు ప్రారంభమైన సంగతి తెలిసిందే. తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 286 పరుగులకు ఆలౌట్ అవ్వగా భారత్ 28/3తో కష్టాల్లో పడింది. ప్రస్తుతం క్రీజులో రోహిత్ శర్మ-పుజారా ఉన్నారు.

టీమిండియాతో ఆడకపోతే పాక్ క్రికెట్ చచ్చిపోదు

బీసీసీఐని ఎందుకు అడుక్కుంటున్నారు: జావెద్



న్యూఢిల్లీ:
ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా దాయాది దేశం భారత్ తమతో క్రికెట్ ఆడాలని పాక్ పదేపదే అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ), పలు సమావేశాల్లో కోరుతున్న నేపథ్యంలో ఆదేశ మాజీ క్రికెటర్, కోచ్ జావెద్ మియాందాద్ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ)కి పలు సూచనలు చేశాడు. స్వదేశంలో క్రికెట్ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పాక్ తరఫున 124 టెస్టులాడిన మియాందాద్ కరాచిలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ అన్నాడు.

'వాళ్లు(ఇండియా) మనతో ఆడాలనుకోవట్లేదు. భారత్‌తో ఆడకపోయినంత మాత్రాన మన(పాక్) క్రికెట్ చచ్చిపోదు. ఆ విషయం గురించి ఇక మర్చిపోవాలి. ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా తమతో మ్యాచ్‌లు ఆడాలని బీసీసీఐని అడుక్కోవాల్సిన అవసరం లేదు. గత 10ఏళ్ల నుంచి మనతో మ్యాచ్‌లు ఆడలేదు. అయితే ఏం? మన క్రికెట్‌కు ఏమైనా నష్టం వాటిల్లిందా? లేదు మనం ఇంకా చాలా బాగా రాణించాం. ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడమే దానికి ఓ ఉదాహరణ. 2009 నుంచి సొంతగడ్డపై అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు జరగక పోయినప్పటికీ నిలదొక్కుకోగలిగాం.' అని ఈ సందర్భంగా జావెద్ పేర్కొన్నారు.

భారత్, పాకిస్థాన్ మధ్య 2012 నుంచి ఎలాంటి ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌లు జరగలేదు. అంతర్జాతీయ టోర్నీల్లో మాత్రమే పాల్గొంటున్నాయి. 2008 ముంబయి దాడుల తర్వాత ఇరు దేశాల మధ్య అంతరం పెరిగింది. సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన, సీమాంతర ఉగ్రవాదానికి చరమగీతం పాడినప్పుడే పాక్‌తో క్రికెట్ ఆడుతామని ఇటీవల భారత విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

వామ్మో సెల్‌ఫోన్ యూజర్లు ఇంతమందా?



ఢిల్లీ:
మొబైల్ ఫోన్.. ఇప్పుడు నిత్యావసరంగా మారింది. పొద్దున లేచింది మొదలు రాత్రి నిద్రపోయే దాకా చేతిలో సెల్‌ఫోన్ ఉండాల్సిందే అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఇక ఇప్పుడు అందుబాటు ధరల్లో స్మార్ట్‌ఫోన్లు, డేటా ఆఫర్లు రావడంతో మొబైల్ వినియోగదారులు నానాటికీ పెరిగిపోతున్నారు. గతేడాది అక్టోబరు చివరి నాటికి మన దేశంలో మొబైల్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 97.54కోట్లకు చేరింది. ఈ మేరకు సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (సీవోఏఐ) తెలిపింది. 'డేటా ప్రకారం.. అక్టోబరు చివరి నాటికి దేశీయ టెలికాం సర్వీసు ప్రొవైడర్లు 97.54కోట్ల మందికి సబ్‌స్క్రిప్షన్ ఇచ్చారు. వీరిలో రిలయన్స్ జియో, మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ సబ్‌స్క్రైబర్లు కూడా ఉన్నారు' అని సీవోఏఐ తెలిపింది. ఇందులో 29.68శాతం మార్కెట్ షేరుతో భారతీ ఎయిర్‌టెల్ తొలిస్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా 28.95కోట్ల మంది ఎయిర్‌టెల్ వినియోగదారులున్నారు. ఆ తర్వాత 21.1కోట్ల సబ్‌స్క్రైబర్లతో వొడాఫోన్ రెండోస్థానంలో ఉంది. ఇక దేశంలో 19.4కోట్ల మంది ఐడియా వినియోగదారులున్నారు.

కాగా.. గతంతో పోలిస్తే ఎయిర్‌సెల్, టెలినార్ వినియోగదారులు తగ్గిపోతున్నారు. అక్టోబరు చివరి నాటికి ఎయిర్‌సెల్ నుంచి 10వేల మంది, టెలినార్ నుంచి 12.5లక్షల మంది మరో నెట్‌వర్క్‌కు మారారు. ఇక దేశవ్యాప్తంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎక్కువగా 8.49కోట్ల సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఆ తర్వాత 8.15కోట్ల మందితో మహారాష్ట్ర రెండో స్థానంలో ఉంది.

ఏకమవుతున్న రాజ్‌పుత్‌లు



జైపూర్ :
పద్మావతి చిత్ర వివాదం సమసిపోయిందనుకుంటున్న సమయంలో మరోసారి శ్రీ రాజ్‌పుత్ కర్ణిసేన కన్నెర్ర చేసింది. సెన్సార్ బోర్డు ప్యానెల్ కమిటీ సూచనలు.. అందుకు మేకర్లు కూడా దాదాపు అంగీకరించారనే వార్తల నేపథ్యంలో ఆందోళనకారులు అప్రమత్తమయ్యారు. చిత్రాన్ని పూర్తిగా నిషేధించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే దిశగా ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

కర్ణిసేన చీఫ్ లోకేంద్ర సింగ్ కల్వి మీడియాతో మాట్లాడుతూ... ఈ విషయంపై దేశంలోని రాజ్‌పుత్ తెగకు చెందిన వారంతా జనవరి 27న చిత్తోర్‌ఘడ్‌లో సమావేశం కాబోతున్నట్లు చెప్పారు. ఆ భేటీలో చిత్ర విడుదలను అడ్డుకునేలా ఓ కీలక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. "రాణీ పద్మావతి త్యాగం వెలకట్టలేనిది.. అలాంటి వ్యక్తిని అభాసుపాలు చేసేలా చిత్రీకరిస్తే చూస్తూ ఊరుకుంటామా?. సినిమా విషయంలో భన్సాలీకే స్పష్టత కొరవడినట్లుంది. ఓసారి చరిత్ర అంటాడు.. మరోసారి కల్పితం అంటాడు. సెన్సార్ బోర్డు నిర్ణయం కూడా సముచితంగా లేదు. అరు సూరైనా చిత్రాన్ని అడ్డుకుని తీరతాం. ఈ విషయంలో చట్టాలు కూడా మమల్ని అడ్డుకోలేవు. అవసరమైతే ప్రాణ త్యాగానికైనా సిద్ధం" అని ఆయన హెచ్చరించారు.

చరిత్రను భ్రష్టు పట్టిస్తుంటే నేతలు చూస్తూ ఊరుకోవటం సరికాదని.. ఈ విషయంలో ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తామని లోకేంద్ర స్పష్టం చేశారు. కాగా, డిసెంబర్ 30న సెన్సార్ బోర్డు పద్మావతి చిత్రం గురించి ఓ ప్రకటన విడుదల చేసిన సంగతి విదితమే. టైటిల్‌ను పద్మావత్‌గా మార్చటంతోపాటు పలు సూచనలు పాటిస్తే యూ బై ఏ సర్టిఫికెట్ తో చిత్ర విడుదలకు లైన్ క్లియర్ చేస్తామని సెన్సార్ బోర్డు వెల్లడించింది. ఈ నేపథ్యంలో నిర్మాతలు కూడా అంగీకరించారని.. ఫిబ్రవరి 9న చిత్రం విడుదల కాబోతుందని ఓ వార్త కూడా చక్కర్లు కొడుతోంది.

జాతీయ పోటీలకు తెలంగాణ బాక్సింగ్ సిస్టర్స్



హైదరాబాద్:
బాక్సింగ్‌లో రాణిస్తున్న అక్కాచెల్లెళ్లు రుహి సమీహ, జహియా అఫ్రీన్‌లు ఈ ఏడాది జాతీయ చాంపియన్ షిప్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించనున్నారు. రుహి ఈ నెలలో రోహతక్‌లో జరుగనున్న జాతీయ ఎలైట్ బాక్సింగ్ టోర్నీకి ఎంపికైంది. జహియా.. ఈనెల 19నుంచి మహారాష్ట్రలోని అకోలాలో జరిగే జాతీయ అండర్-19 టోర్నీలో పోటీపడనుంది.

ఓడ కోసం ఆటను వదిలేశారు



అమ్మో ఐదు రోజులా? టెస్టు మ్యాచ్ గురించి చెబితే.. క్రికెట్‌పై అంతగా అవగాహనలేని వాళ్లు ఇలా ఆశ్చర్యపోవడం మామూలే. కానీ ఓ టెస్టు మ్యాచ్ ఏకంగా తొమ్మిది రోజులు జరిగిందంటే క్రికెట్ అభిమానులే షాక్‌కు గురికావడం ఖాయం. నిజానికి అది అసలు కాలపరిమితేలేని మ్యాచ్. అంటే ఫలితం వచ్చే దాకా ఆడతారన్నమాట. ఇక్కడ మలుపేంటంటే 9 రోజులకు కూడా ఫలితం తేలలేదు. అనుకోని కారణంతో, అనూహ్యంగా డ్రాగా ముగిసింది. ఓ 78 ఏళ్లు వెనక్కి వెళితే ఈ అరుదైన, అత్యంత విచిత్రమైన టెస్టు మ్యాచ్ గురించి తెలుసుకోవచ్చు.

దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ మధ్య 1939లో జరిగింది అంతులేని కథ. టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన ఈ మ్యాచ్‌కు వేదిక దర్బన్. మార్చి 3 నుంచి 14 వరకు జరిగింది. రెండు రోజులు విశ్రాంతికి పోగా.. ఒక రోజు ఆట సాధ్యం కాలేదు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 530 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ 316 పరుగులు సాధించింది. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 481 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ లక్ష్యం 696 పరుగులు కాగా.. తొమ్మిదో రోజు ఆట ఆఖరికి ఆ జట్టు 5 వికెట్ల నష్టానికి 654 పరుగులు చేసింది. అప్పటికి ఇంగ్లాండ్ గెలవాలంటే ఇంకా 41 పరుగులు చేయాలి. కానీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఇంగ్లాండ్‌కు వెళ్లాల్సిన ఓడను అందుకోవడం కోసం ఇంగ్లిష్ ఆటగాళ్లు వెళ్లిపోవడమే అందుకు కారణం. ఫలితం డ్రా కావడం, అత్యంత సుదీర్ఘంగా సాగిన కారణంగా ఈ మ్యాచ్‌ను 'టైమ్‌లెస్' మ్యాచ్‌గా పిలుస్తుంటారు. టెస్టు మ్యాచ్‌ను నాలుగు రోజులకు తగ్గించాలన్న చర్చ నేపథ్యంలో ప్రయోగాత్మకంగా ఓ టెస్టును కూడా ఆడేసిన ఈ రోజుల్లో ఈ కాలపరిమితి లేని మ్యాచ్‌ను ఏమాత్రం ఊహించలేం కదా!

నకిలీ ఎస్ఎంఎస్‌లతో ఇబ్బందులు

ముంబై:
కొత్త ఏడాది సం బరం ఇంకా పూర్తిగా తీరనేలేదు. అప్పుడే ప్రజల్లో కలవరపెట్టే మెసేజ్‌లు. టెలికాం సబ్‌స్క్రైబర్లను టార్గెట్‌గా చేస్తూ... ఎస్ఎంఎస్‌ల వెల్లువ కొనసాగు తోంది. ఈ మెసేజస్ లోని సందేశం.. జనవరి 7 నుంచి మీ నెంబర్‌పై వాయిస్ సర్వీసులు ఆగిపోనున్నాయని. ఇతర నెట్‌వర్క్‌లోకి మీ నెంబర్‌ను మార్చుకుంటేనే పనిచేస్తాయంటూ ఆందోళనకర మెసేజ్‌లు వస్తున్నాయి. అన్ని టెలికాం ఆపరేటర్లకు ఈ మెసేజ్‌లు వెళ్తున్నాయి. దీంతో వెంటనే కస్టమర్లు ట్విట్టర్ వేదికగా టెలికాం కంపెనీలకు ఫిర్యాదు చేయడం ప్రారంభించారు.

అయితే ఈ మెసేజ్‌లను టెలికాం కంపెనీలు పంపడం లేదట. యూజర్ల ఫిర్యాదులపై స్పందించిన జియో, వొడాఫోన్, ఐడియా కంపెనీలు, అది తప్పుడు



మెసేజ్‌లను అని, యూజర్లు ఆ మెసేజ్‌ను పట్టించుకోవద్దంటూ క్లారిటీ ఇచ్చాయి. వాటిని తాము పంపడం లేదని కూడా పేర్కొన్నాయి. ఎయిర్‌టెల్ ప్రతినిధి ఆ మెసేజ్‌ను ఓ స్పామ్‌గా ధృవీకరించారు. టాటా డొకోమో, బీఎస్ఎన్ఎల్ సబ్‌స్క్రైబర్లకు కూడా ఈ మెసేజ్‌లు వస్తున్నట్లు తెలిసింది.

ఆశ్చర్యకరంగా యూపీసీను జనరేట్ చేసి నెంబర్‌ను వేరే నెట్‌వర్క్‌కు పోర్టు పెట్టుకోవాలంటూ యూజర్లను ఆదేశిస్తున్నాయి. అయితే ఏ ఆపరేటర్‌కు పోర్టు పెట్టుకోవాలో చెప్పడం లేదు. ఒక్క ఆపరేటర్ సబ్‌స్క్రైబర్‌కు మాత్రమే కాక, ప్రతి ఆపరేటర్ యూజర్లకు ఈ మేరకు ఎస్ఎంఎస్‌లు వస్తుండటం సబ్‌స్క్రైబర్లను ఆందోళనలో పడేసింది.

జనవరి 7 ఫేక్ డెడ్‌లైన్ అని, ఆధార్‌తో మొబైల్ నెంబర్‌ను వెరిఫికేషన్ చేసుకునే ప్రక్రియకు డెడ్‌లైన్ 2018 మార్చి 31 వరకు ఉందని కంపెనీ పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఆధార్ లేనివారికైతే, మార్చి 31 డెడ్‌లైన్ కాగ, ఇప్పటికే ఆధార్ కలిగి ఉన్న వారికి సిమ్ వెరిఫికేషన్‌కు ఆఖరి తేది ఫిబ్రవరి 6. ఐవీఆర్ ద్వారా ఆధార్-మొబైల్ నెంబర్ సిమ్ రీ-వెరిఫికేషన్ చేపట్టుకోవచ్చని టెల్కోలు చెప్పాయి.

కశ్మీర్‌లో భారీ పేలుడు



నలుగురు పోలీసుల మృతి

శ్రీనగర్ :
జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. బారాముల్లా జిల్లాలో భారీ పేలుడు జరపటంతో నలుగురు పోలీస్ సిబ్బంది ప్రాణాలు వదిలారు. ఘటనలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. శనివారం ఉదయం రద్దీగా ఉండే ఓ మార్కెట్ సముదాయం వద్ద ఐఈడీ మందుపాతరతో ఉగ్రవాదులు పేలుడు జరిపారు. పేలుడు ధాటికి ఓ షాపు పూర్తిగా కుప్పకూలిపోయిందని.. తీవ్రత చాలా దూరం ప్రభావం చూపిందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో భారీగా భద్రతా సిబ్బందిని మోహరించిన సైన్యం.. ఉగ్రవాదుల కోసం చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. గాయపడిన వారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా ఉద్రిక్తంగా మారింది. ఓ దుకాణం అడుగుభాగంలో ముష్కరులు ఈ బాంబును అమర్చినట్లు పోలీసులు తెలిపారు. పేలుడు ధాటికి సమీపంలోని మూడు దుకాణాలు కూడా ధ్వంసమైనట్లు చెప్పారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కెనడాలో రెండు విమానాలు ఢీ


ఎగసిపడిన మంటలు
టొరంటో విమానాశ్రయంలో ఇది రెండో ఘటన



టొరంటో:
ప్రయాణానికి సిద్ధంగా ఉన్న రెండు విమానాలు, విమానాశ్రయ రన్ వే మీద ఒకదానితో ఒకటి గుద్దుకున్నాయి. దీంతో విమానాల వెనకభాగం నుంచి స్వల్పంగా మంటలు, పొగ చెలరేగాయి. అప్పటికే విమానాల్లో ఎక్కి ఉన్న ప్రయాణికులను ముందు భాగంలో ఉన్న అత్యవసర ద్వారాల నుంచి బయట కు పంపించారు. కెనడాలోని టొరంటో పియర్సన్ విమానాశ్రయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ రెండు విమానాలను వెస్ట్‌జెట్, సన్‌వింగ్ విమాన యాన సంస్థలకు చెందినవిగా గుర్తించారు. ఇరు సంస్థలు ప్రమాదానికి సంబంధించి అధికారిక ప్రకటన జారీ చేశాయి. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమై ప్రయాణికులను సురక్షితంగా బయటకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నాయి. కాగా టొరంటో పియర్సన్ విమానాశ్రయంలో ఇలాంటి ప్రమాదం జరగడం ఇది రెండోసారి. ఐదు నెలల క్రితం కెనడా, పోలండ్‌లకు చెందిన రెండు విమానాలు రన్‌వే మీద ఒకదానిని మరొకటి ఢీ కొట్టుకున్నాయి. వెస్ట్‌జెట్ సంస్థకు చెందిన విమానం శుక్రవారం రాత్రి మెక్సికో నుంచి 168 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో టొరంటో విమానాశ్రయానికి చేరుకుంది. విమానం గేట్ దగ్గరికి వెళ్లేందుకు వేచి ఉండగా సన్‌వింగ్ సంస్థకు చెందిన విమానం గేట్ నుంచి వెనుకకు వస్తూ వెస్ట్‌జెట్ విమానాన్ని ఢీకొట్టింది. వెంటనే వెస్ట్‌జెట్‌లో ఉన్న ప్రయాణికులను అత్యవసర గేట్ నుంచి కిందకు దింపేశారు. అందరూ సురక్షితంగా బయటకు వచ్చారని వెస్ట్‌జెట్ అధికార ప్రతినిధి లారెన్ స్టీవార్ట్ వెల్లడించారు. ప్రమాద సమయంలో సన్‌వింగ్ విమానంలో ప్రయాణికులు, విమాన సిబ్బంది ఎవ్వరూ లేరని తెలిపింది. అప్పుడు సన్‌వింగ్‌కు చెందిన గ్రౌండ్ హ్యాండిలింగ్ సిబ్బంది ఉన్నారని పేర్కొంది. ప్రమాదం కారణంగా సన్‌వింగ్ విమానం వెనుక భాగంలో మంటలు చెలరేగి నల్లటి పొగ వచ్చింది. టొరంటో విమానాశ్రయంలో ఇటీవల ఇలాంటి ఘటన జరగడం రెండోసారి. ఆగస్టులో కూడా రెండు విమానాలు ఢీకొన్నాయి.

అమెరికాలో భారతీయుడి అరెస్టు

విమానంలో యువతిపై లైంగిక వేధింపులే కారణం



వాషింగ్టన్:
విమానంలో పక్క సీటులో కూర్చున్న యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన భారతీయుడిని అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. రాత్రి లాస్‌వెగాస్ నుంచి డెట్రాయిట్ వెళ్తున్న విమానంలో ప్రభు రామమూర్తి అనే 34 ఏళ్ల వ్యక్తి తన భార్యతో కలిసి ప్రయాణిస్తున్నాడు. అతని పక్క సీటులోనే ఉన్న 22 ఏళ్ల యువతి తాను నిద్రిస్తున్న సమయంలో రామమూర్తి తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడంటూ సిబ్బందికి ఫిర్యాదు చేసింది. విమానం కిందకు దిగగానే పోలీసులు రామమూర్తిని అరెస్టు చేసి మిచిగాన్ కోర్టులో హాజరుపరిచారు. విమానంలో తాను నిద్ర మాత్ర వేసుకుని గాఢ నిద్రపోయానని, ఆ యువతే తన మోకాళ్లపై పడుకుందని చెప్పిన రామమూర్తి వాదనను జడ్జి విశ్వసించలేదు. నిందితుడు, అతని భార్య తాత్కాలిక వీసాపై అమెరికాలో ఉన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ బెయిల్ ఇచ్చేందుకు జడ్జి తిరస్కరించారు.

సంచలన వార్తా పత్రిక
లీడర్
8
విశాఖపట్నం ఆదివారం 7-1-2018

మిద్దెతోట పుస్తకం అందరికీ ఉపయోగకరం

పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మిప్రసాద్



డాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: పర్యావరణ మార్గదర్శి వైశాఖి చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మిప్రసాద్ అన్నారు. విశాఖపౌర గ్రంథాలయంలో రైతునేస్తం ఫౌండేషన్ వ్యవస్థాప కులు వెంకటేశ్వరరావు రచించిన మిద్దెతోట పుస్తక ఆవిష్కరణ కార్యక్ర మానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఈ పుస్తకం వలన చాలా ఉపయోగాలు వున్నాయని, గతంలో విజయవాడలో కూడా ఈ కార్య క్రమానికి తను హాజరైనట్లు వెల్లడించారు. మన కూరగాయల తోట కార్యక్రమాన్ని నగరమంతటా విజయవం తంగా నిర్వహించాలని పర్యావరణ మార్గదర్శి వైశాఖీ చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమన్నారు. ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సూరపనేని విజయకుమార్ మాట్లాడుతూ విత్తనాల ప్రదర్శన, రసాయన ఎరువులు, రసాయన క్రిమిసంహారకాలు, రసాయన కలుపుతీత మందులతో పండిన హైబ్రీడ్, సీడ్‌లెస్ పంటలతో మోహం మొత్తిన వారూ. రుచిగా లేవని ఆరోపిస్తున్నావారంతా ప్రస్తుతం దేశీయ సాం ప్రాదాయ కూరగాయ విత్తనాలతో పండిన పంటలను కోరుకుం టున్నారన్నారు. దానికోసం అనేక కార్యక్రమాలతో పాటు నేడు విత్తన ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఎరువు తయారు చేసిన గోళాలు, కూరగాయాల తోటల చిత్రాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం విశ్రాంత శాస్త్రవేత్త ఎస్. శివరామప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఉచిత శిక్షణా కార్యక్రమంలో మిద్దెతోట పుస్తక రచయిత తుమ్మేటి రఘోత్తమ రెడ్డి, రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, రైతు మిత్ర ట్రస్టు వ్యవసాపకులు కర్రి రాంబాబు, ఉషాగజపతి రాజు తదితరులు నగరంలో కూరగాయాలు పెంచుతున్న వారికి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది.

ఎన్టీఆర్-చెర్రీ మల్టీస్టారర్ నిజం కాదట!



బాహుబలి లాంటి భారీ బడ్జెట్ మూవీ.. సుదీర్ఘమైన ప్రాజెక్టు తర్వాత రాజమౌళి చేయబోయే సినిమాపై అంతటా ఆసక్తి నెలకొనడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఎన్టీఆర్.. రామ్ చరణ్ లతో కలిసి దిగిన ఒక ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేసి.. తన నెక్ట్స్ ప్రాజెక్టుపై హింట్ ఇచ్చిన రాజమౌళి.. అసలు సంగతి మాత్రం ఇంకా చెప్పనేలేదు. కానీ ఇప్పటికే ఈ క్రేజీ మల్టీస్టారర్ పై అనేకానేక రూమర్స్ వచ్చేశాయి. వీటిలో ఏది సత్యం.. ఏది అసత్యం అని కనుక్కోవడం అంత తేలికైన విషయమేమీ కాదు. ఓ విషయాన్ని ఎంతగా దాచితే అంతగా క్లిక్ అవుతుందని.. 'బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడు' అనే పాయింట్ దగ్గరే ప్రూవ్ చేసిన దర్శక ధీరుడు.. ఇపుడు కూడా అదే కంటిన్యూ చేస్తున్నాడు. ఎన్టీఆర్-చెర్రీల కాంబినేషన్ లో మల్టీస్టారర్ ప్రాజెక్టుపై వస్తున్న కొత్త రూమర్ ఏంటంటే.. ఈ సినిమాలో వీళ్లిద్దరూ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలు పోషిస్తున్నారని.. వీళ్లిద్దరూ ఓ గ్రామీణ ప్రాంతంలో సబ్ ఇన్ స్పెక్టర్ రోల్స్ చేస్తారని అంటున్నారు. విక్రమార్కుడు మూవీలో పోలీస్ పాత్రను ఎంతటి శక్తివంతంగా రాజమౌళి చూపించాడో చూశాం. మళ్లీ జక్కన్న సినిమాలో పోలీస్ అంటే బాగానే ఉంటుంది కానీ.. అసలు ఇంకా స్క్రిప్ట్ కూడా లాక్ కాలేదన్నది ఇన్ సైడ్ టాక్. ఎన్టీఆర్-చెర్రీల కాంబినేషన్ లో మల్టీస్టారర్ మాట నిజమే అయినా.. ఇప్పటివరకూ ఒక్క స్టోరీ లైన్ మాత్రమే అనుకున్నారట. దీనికి తగినట్లుగా ఇంకా కథను డెవలప్ చేయాల్సి ఉందట. అందుకే అక్టోబర్ వరకూ టైం పెట్టుకున్నారట జక్కన్న అండ్ టీం. మరి అపుడే క్యారెక్టర్లు-ఉద్యోగాలు అంటే ఒట్టి రూమర్ మాత్రమే.

పెళ్ళికూతురు రకుల్



టాలీవుడ్ లో ప్రస్తుతం జయపజయలతో సంబంధం లేకుండా సినిమాలను చేస్తోన్న హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్. అమ్మడు మొన్నటి వరకు విజయాలను బాగానే అందుకుంది గాని ఇటీవల స్పైడర్ సినిమా డిజాస్టర్ అయినప్పటి నుండి మాత్రం రకుల్ కెరీర్ క్లోజ్ అయ్యింది అనేట్టు కొన్ని కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయితే రకుల్ మాత్రం అపజయాలను చాలా ఈజీగా తీసుకుంటోంది. తనకు ఇష్టమైన క్యారెక్టర్స్ ని చేస్తూ స్టార్ హీరోయిన్ అనే బిరుదును ఇంకా పెంచుకోవాలని చూస్తోంది. కోలీవుడ్ లో కార్తీ తో నటించిన ఖాకి సినిమా మంచి హిట్ అవ్వడంతో అక్కడి ప్రేక్షకుల దృష్టిని తన వైపు తిప్పుకుంది. ఇక రీసెంట్ గా అమ్మడు మొదటి సారి %అఓఇ% (జస్ట్ ఫర్ వుమెన్) మ్యాగజైన్ కి ఫొటో షూట్ ఇచ్చింది. బ్రైడల్ స్పెషల్ స్టిల్స్ లో రకుల్ అందాలతో చాలా కవ్వించేసింది. కూల్ గా కనిపిస్తూ కళ్లతోనే ఎదో మాయ చేసేస్తోంది. ఇక డ్రెస్ లు కూడా చాలా అందంగా ఉన్నాయి. రకుల్ ని ఇంత అందంగా ఎప్పుడు చూడలేదని ఇప్పటికే చాలా మంది నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రతి డ్రెస్ లో సరికొత్త పెళ్లి కూతురిగా కనిపించిందని చెబుతున్నారు. ముఖ్యంగా కవర్ పేజ్ పై ఉన్న స్టిల్ ని చూస్తే ఎవ్వరైనా అమ్మడికి ఫిదా అవ్వాల్సిందే. ఇక రకుల్ బాలీవుడ్ లో అయారి సినిమాను చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ లో బిజీగా వుంది. ఇక జనవరి 26న ఆ మూవీ రిలీజ్ కానుంది. అలాగే కోలీవుడ్ లో సూర్యా - సెల్వ రాఘవన్ ప్రాజెక్టులో కూడా రకుల్ కథానాయికగా కనిపించనుంది.

అభిమానుల కోసం..



అభిమానులు లేనిదే హీరోలు లేరు అనే పదం నిజంగా చాలా గొప్పది. ఏ సంబంధం లేని ఒక సినిమా నటుడిని ఎంతో ఇష్టంగా కొలిచే అభిమానుల గురించి ఎంత చెప్పినా తక్కువే. కానీ అభిమానులు ఇష్టాన్ని అర్థం చేసుకునే వాళ్లు చాలా తక్కువ మంది ఉంటారు. ఒక్కోసారి అభిమానుల ఆప్యాయత ఆగ్రహాన్నీ తెప్పిస్తాయి. దీంతో హాలో ఇవ్వాల్సిన చేతులు ఒక్కసారిగా పైకి లేస్తాయి. అర్థం చేసుకునే హీరోలు మన ఇండస్ట్రీలో చాలా తక్కువ మంది ఉన్నారు.

అలాంటి వారిలో మెగా స్టార్ రామ్ చరణ్ ఒకరు. ఈ మధ్య ఈ హీరో అభిమానులను తెగ కలుసుకుంటున్నాడు. రంగస్థలం సెట్స్ కి ఎంత మంది వచ్చినా సరే బ్రేక్ తీసుకొని మరి కలుస్తున్నాడు. తన చిన్నాన్న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తండ్రి మెగా స్టార్ చిరు కూడా ఎవరు కలవడానికి వచ్చినా నో అనకుండా కలుస్తుంటారు. అభిమానులకు రెస్పెక్ట్ ఇవ్వడంలో పవర్ స్టార్ మంచితనమే వేరు. ఇక అదే హైబ్రిడ్ క్వాలిటీతో వచ్చాడు రామ్ చరణ్. మంచితనంలో మనోడు కూడా సుపర్బ్ అనిపించుకుంటున్నాడు.

డబ్బు అలాగే ఎవరికన్నా వైద్యానికి సంబంధించిన సహాయల్లో కూడా తండ్రి బాబాయి బాటలో నడుస్తున్నాడు. అప్పట్లో కోనసీమలో రంగస్థలం షూటింగ్ లో ఉండగానే చెర్రీ ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఇద్దరు చిన్నారులకు సొంత ఖర్చులతో వైద్యం చేయించాడు. అప్పటి నుంచి చరణ్ పై అందరికి ఎక్కువ ఇష్టం ఏర్పడింది. ఇక రీసెంట్ గా రాజమండ్రిలో షూటింగ్ మొదలవ్వడంతో మరికొంత మంది అభిమానులను కూడా ఈ మెగా హీరో కలిశాడు. ఇక రంగస్థలం షూటింగ్ దాదాపు ఎండింగ్ కి వచ్చేసింది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో సమంత హీరోయిన్ గా నటిస్తోన్న సంగతి తెలిసిందే.

అజ్ఞాతవాసి కూడా చూడండి -సూర్య



టాలీవుడ్ లో తమిళ హీరోల సినిమాలు ఏ రేంజ్ లో రిలీజ్ అవుతాయో అందరికి తెలిసిందే. ఇక్కడ ఎంత పెద్ద సినిమాలు రిలీజ్ అవుతున్నా సరే కొంత మంది కోలీవుడ్ స్టార్స్ ఏ మాత్రం భయపడకుండా అదే సమయంలో పోటీ పడటానికి సిద్దమవుతుంటారు. అదే తరహాలో సూర్యా కూడా ఈ సంక్రాంతికి తన గ్యాంగ్ సినిమాతో టాలీవుడ్ బాక్స్ ఆఫీస్ పై కన్నేశాడు. టాలీవుడ్ లో సూర్యా డబ్బింగ్ సినిమాలకు మంచి మార్కెట్ ఉంది. కోలీవుడ్ హీరోల్లో ఇక్కడ రజినీకాంత్ తరువాత సూర్యా సినిమాలకు ఎక్కువ బిజినెస్ జరుగుతుంటుంది. ఇకపోతే శుక్రవారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ ని సూర్యా గ్రాండ్ గా చేశాడు. యూవీ క్రియేషన్స్ ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తోంది. అయితే ప్రీ రిలీజ్ వేడుకలో సూర్యా తన మాటలతో చాలా ఆకట్టుకున్నాడు. ముందుగా ఎప్పటి నుంచో తన సినిమాలను ఆదరిస్తున్న తెలుగు అభిమానులకు చాలా కృతజ్ఞతలని తెలుపుతూ ఈ సినిమా కూడా తప్పకుండా నచ్చుతుందిని చెప్పాడు. ఇక తెలుగు ఇండస్ట్రీ కి రావడానికి తనకు ఇంత సపోర్ట్ గా నిలిచినా అల్లు అరవింద్ గారికి చాలా థాంక్స్ అని సినిమాలో మొదటి సారి తను డబ్బింగ్ చెప్పాను అని తెలుగులో ఒక డైలాగ్ కూడా చెప్పాడు.

గుండెల్లో ధైర్యం చేతిలో ధర్మం ఉంటే దేనికి బయపడక్కర్లేదు అని సూర్యా చెప్పిన డైలాగ్ అందరిని ఆకట్టుకుంది. ఇక చిత్రానికి పని చేసిన గ్యాంగ్ మొత్తాన్ని పొగుడుతూ ఈ సంక్రాంతికి మీ ముందుకు రాబోతున్న సపోర్ట్ చేస్తారని అనుకుంటున్నా అని అలాగే పవర్ స్టార్ సినిమా అజ్ఞాతవాసి కూడా రాబోతోంది. ఆ సినిమా కూడా చుడండి అని సూర్యా పవన్ అభిమానులను ఆకర్షించాడు. ఫైనల్ గా మీ ప్రేమ నన్ను ఇక్కడి వరకు తీసుకువచ్చింది అంటూ మీ ఆశీస్సులు ప్రేమ ఇంకా కావాలి అంటూ ఫైనల్ గా ప్రసంగాన్ని ముగించాడు.

లేడి డైరెక్టర్ టేకింగ్ గురించి టాక్..



టాలీవుడ్ లో తెరపై మాత్రమే మహిళలు కనిపిస్తారు. కానీ తెరవెనుక గర్ల్స్ ఎక్కువగా కనిపించరు. ఎదో ఫ్యాషన్ డిజైనర్ గా తప్పితే మిగతా యూనిట్ వారు కనిపించేది చాలా తక్కువ. ఇక అప్పుడప్పుడు డైరెక్షన్ చేస్తూ కొంత మంది లేడిస్ మంచి టెక్నీషియన్ అని గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఇక ప్రస్తుతం అదే తరహాలో అందరిని ఆకర్షిస్తున్నారు మరో వుమెన్ డైరెక్టర్. ఆమె ఎవరో కాదు. సూపర్ స్టార్ మహేష్ సోదరి మంజుల ఘట్టమనేని. ప్రస్తుతం ఆమె మనసుకు నచ్చింది అనే సినిమాను డైరెక్ట్ చేస్తోన్న సంగతి తెలిసిందే. అయితే మొదట ఈ ప్రాజెక్ట్ గురించి అంతగా ఎవరు పట్టించుకోలేదు. ఎదో ట్రై చేస్తోంది అనుకున్నారు. కానీ మంజుల తన పని తనాన్నీ కొంచెం కొంచెంగా చూపిస్తోంది. సినిమా ఫస్ట్ లుక్ నుంచి టీజర్ వరకు ఫ్రెష్ ఫీల్ ను కలిగేలా చేస్తోంది. ఇంతకుముందు ఎన్నో లవ్ స్టోరీస్ వచ్చాయి. కానీ ఇది చాలా కొత్తగా ఉందే అనేలా మంజుల అందరి మనసుకు నచ్చేలా టాక్ ను సొంతం చేసుకుంటోంది.

రీసెంట్ గా సినిమాలోని ఓ పిల్లా అనే సాంగ్ టీజర్ కూడా రిలీజ్ అయ్యింది. ప్రేక్షకులకు ఆ పాట కన్నా టేకింగ్ ఎక్కువగా నచ్చుతోంది. సాధారణంగా మ్యూజిక్ సినిమాకి ప్రాణం పోస్తుంది అంటారు. ఇక్కడ మాత్రం పాటకు ప్రాణం పోసేలా మంజుల టేకింగ్ ఉందని చాలా స్టైలిష్ గా సినిమాను తెరకెక్కిస్తున్నారు అని ప్రస్తుతం సినీ ప్రముఖులు చర్చించుకుంటున్నారు. ఇక సినిమాలో హీరోగా సందీప్ కిషన్ కనిపిస్తోన్న సంగతి తెలిసిందే. అతనికి జోడిగా అమైరా దస్తూర్ నటిస్తోంది.

30శాతం డిస్కౌంట్‌తో చేనేత వస్త్రాలు



విశాఖపట్నం,న్యూస్‌లీడర్: నగరంలోని శంకరమఠం పద్మశాలి భవన్‌లో జరుగుతున్న హ్యాండ్‌లూమ్ ఎగ్జిబిషన్‌లో భాగంగా 30శాతం రాయితీపై వివిధ రకాలైన చేనేత వస్త్రాలను అందిస్తున్నట్టు ఎగ్జిబిషన్ నిర్వాహకుడు గోవిందరాజు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక డిస్కౌంట్లు ఉంటాయన్నారు. మంగళగిరి, పోచంపల్లి, ఉప్పాడ, కలంకారి చీరలు, చుడిదార్‌లపై సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక డిస్కౌంట్ ఉంటుందన్నారు. షర్టింగ్, బెడ్ షీట్, ఖాదీ సూటింగ్స్‌పై 20శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు ఎగ్జిబిషన్ జరుగుతుందని చెప్పారు. సెలవు దినాల్లో కూడా తెరిచే ఉంచుతామన్నారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 9గంటల వరకు వ్యాపారాలు సాగిస్తామని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సదన్వియోగం చేసుకోవాలని గోవిందరాజు కోరారు.

అప్పన్నకు హృదయలక్ష్మి ఆభరణం బహూకరణ





విశాఖపట్నం, న్యూస్‌లీడర్: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారికి ఓ భక్తుడు హృదయ లక్ష్మి స్వర్ణ ఆభరణాన్ని బహూకరించారు. నగరంలోని కొత్తపాలెం ప్రాంతానికి చెందిన వైకాపా 68 వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్ సుమారు 31 లక్షల ఖర్చుతో ఆభరణాన్ని తయారు చేయించి స్వామికి కానుకగా సమసర్పించారు. ఈ సందర్భంగా కిరణ్ దంపతులు తమ స్వగృహం నుండి సింహాచలం వరకు భారీ ఊరేగింపుతో వెళ్ళారు. సాము గరడీలు, తప్పెటగుళ్ళు, విచిత్రవేషధారణలతో ఊరేగింపు కోలాహలంగా సాగింది. మాజీ శాసన సభ్యుడు మళ్ళ విజయప్రసాద్, ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు, పార్టీలకు అతీతంగా పలువురు భక్తులు పెద్ద సంఖ్యలో ఇందులో పాల్గొని సింహాచలం చేరుకున్నారు. అనంతరం అర్చకుల వేదమంత్రాల మధ్య కిరణ్ దంపతులు సమర్పించిన కానుకను స్వామివారికి అలంకరించారు. అనంతరం సింహాచలం దేవస్థానం వద్ద భక్తులకు భారీ అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మళ్ళ విజయప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత భాగాన్ని ధార్మిక, సేవా కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు.

Printed, Published and Owned by V.V.Ramana Murthy and Printed at LEADER PRESS, 58-14-109/5, Block No. 113 A, VUDA Layout, Marripalem, Visakhapatnam - 530009, A.P. and Published at 47-10-7/3, Diamond Park Junction, Visakhapatnam - 530016, A.P.
EDITOR - V.V. RAMANA MURTHY, **RNI NO: 72163/99, Registered Postal Regd. No. - VSP/211/2015-17 E-MAIL andhraleader@gmail.com, Telephone Nos. 0891-6660599, 98488 49832**

ఉత్సాహంగా 5కె రన్

మునగపాక, న్యూస్‌లీడర్: మండలంలోని నాగులాపల్లి గ్రామంలో 5కె రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అనకాపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దొడ్డి శ్రీనివాసరావు, సర్పంచ్ యల్లపు వెంకటభాస్కరరావు ప్రారంభారు. నాగులాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సుమారు కిలోమీటర్ వరకు 5 రన్ నిర్వహించారు. ఈ రన్‌లో విద్యార్థులతోపాటు గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్.సీతారామ్, ప్రధానోపాధ్యాయులు డి.కోటేశ్వరరావు, మైలపల్లి పోతురాజు, మైలపల్లి అప్పలనర్సింహం, దొడ్డి భాస్కరరావు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సంక్షేమం- అభివృద్ధి రెండు కళ్లు: మంత్రి అయ్యన్న



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అయ్యన్న

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: 45ఏళ్లకే వృద్ధాప్య పింఛను తాను అధికారంలోకి వస్తే ఇస్తానని అర్థంలేని మాటలు చెబుతున్నటువంటి ప్రతిపక్షనేత జగన్మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి ఉండడం ఈ రాష్ట్ర ప్రజల దురదృష్టమని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి చింతాకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం 21 నుంచి 25 వార్డులవరకు గవరపాలెం చినరామస్వామి ఆలయంవద్ద జరిగిన జన్మభూమి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వృద్ధాప్యం అంటే 60 ఏళ్లు దాటిన వారని దీనికి అర్థంకూడా తెలియకుండా 45 ఏళ్లకే వృద్ధాప్య పింఛను ఇస్తాననడం హాస్యస్పదంగా ఉందన్నారు. భర్తలు చనిపోయిన వితంతువులు చాలామంది సర్టిఫికేట్లు లేకపోవడంవల్ల పింఛన్ పొందలేని పరిస్థితులు ఉన్నాయని వీరందరినీ గుర్తించి పింఛన్లుకూడా అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు 46 లక్షల మందికి ఇస్తున్నామన్నారు. మరో 5 లక్షలు అర్హులైన వారందరికీ అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేర్చాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉందని దీనికి కారణం మీ స్థానిక ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కృషి ఎంతైనా ఉందని కొనియాడారు. అనంతరం మంత్రి అయ్యన్నకు ఎమ్మెల్యే పీలా, స్థానిక నాయకులు సత్కరించి నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. అయ్యన్న చేతులమీదుగా చంద్రన్నకానుకలు, బేబీ కిట్లను, ఉపాధికూలీలకు గునపాలను, ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎంవీ సూర్యకళ, జీవీఎంసీ జోనల్ కమిషనర్ షేక్ సుభానీ, టీడీపీ నాయకులు బుద్ద నాగజగదీష్, మళ్ల సురేంద్ర, డాక్టర్ కె.విష్ణుమూర్తి, కె.సత్యవతి, కొణతాల వెంకటరావు, టీఎస్ఎంకే జోగినాయుడు, బొలిశెట్టి శ్రీనివాసరావు, కొణతాల రత్నకుమారి, కొణతాల నూకునాయుడు, కర్రి మల్లేశ్వరరావు, బొద్దేడ మురళి, కర్రి ప్రసాద్, మళ్ల సత్యనారాయణ, బుద్ద శ్రీను, బుద్ద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో.. మండలంలోని అరబుపాలెం, తిమ్మరాజుపేట, పల్లపు ఆనందపురం గ్రామాల్లో శనివారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ముందుగా జన్మభూమి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామస్థుల నుంచి అర్జీలను స్వీకరించారు. అలాగే చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.శాంతలక్ష్మి, తహసీల్దార్ జి.రాంబాబు, ఇతరశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కుంచంగి, రొంగలివానిపాలెం, కుంద్రంలో...

మండలంలోని కుంచంగి గ్రామంలో శనివారం జన్మభూమి - మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ - 2 డాక్టర్ సిరి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికి చేరాలన్న ఉద్దేశంతో జన్మభూమి - మా ఊరు కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ గ్రామానికి ప్రధాన రహదారి చాలా అధ్వాన్నంగా ఉందని ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. చంద్రన్న భీమా పథకం పేదలకు ఒక వరమని, దీనిని అందరూ వినియోగించుకోవాలన్నారు. ఇటీవల మరణించిన ముమ్మిన నూకరత్నం మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులకు చంద్రన్న భీమా పథకం ద్వారా ఐదువేల రూపాయల చెక్కును అందించారు. విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత స్థాయికి రావాలని, విదేశీ విద్య ఆదరణ పథకాన్ని వినియోగించుకోవాలని, ఈ పథకానికి ప్రభుత్వం పదిలక్షల రూపాయలను ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. బాలలకు బాలామృతాన్ని అందించారు. సాధికార మిత్రలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని దీంతో ప్రతీ కుటుంబం స్థితిగతుల నివేదిక ఇస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పల్లెల గంగా భవానీ, సర్పంచ్ పల్లెల బాబ్జీ, ఎంపీటీసీ ఉగ్గిన భాస్కరరావు, మండల ప్రత్యేక అధికారి సూర్యచంద్ర, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో వెంకటరమణ, ఏవో మహేశ్వరరావు, రొంగలివానిపాలెం సర్పంచ్ రాజేశ్వరి, ఉపసర్పంచ్ సూరిబాబు, కూండ్రం సర్పంచ్ శానాపతి స్వరూప, ఎంపీటీసీ నందవరపు సూరిబాబు, ఈవోఆర్డీ అప్పలరాజు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అధికారులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లడంతో ప్రజల సమస్యలు క్షుణ్ణంగా తెలుసుకునేందుకు అవుతుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో ధర్మవరం, మాదిగిపేట రెండు వార్డులకు సంబంధించి కనక మహాలక్ష్మి గుడివద్ద ఏర్పాటు చేసిన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలు తమకు అవసరమైన సంక్షేమ పథకాల కోసం పనిపాటు మానుకొని కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నేరుగా ప్రజలవద్దకే సంబంధిత అధికారులు వెళ్లేటట్లుగా జన్మభూమి - మన ఊరు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పరిపాలన విభాగం అంతా ప్రజల ముందే ఉంచడం వలనే తమ సమస్యలు వినేందుకు ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు, వినతులు స్వీకరించేందుకు అధికారులు ఉండడంతో వినియోగదార్లు, ప్రజలు చాలా ఉత్సాహంగా, ఆనందంగా జన్మభూమి కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేగి సత్యనారాయణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొఠారు సాంబ, మోడల్ అధికారి భాస్కరరాజు, కౌన్సిలర్ దిగుమర్తి సత్యవతి, మున్సిపల్ ఇంజనీరింగు విభాగం, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాడుగులలో... మండలంలో చింతలూరు, వీరనారాయణం, కేజీపేట గ్రామాలలో శనివారం ఉదయం స్పెషలాఫీసర్ కె.శైలజ, తహశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజ్ అధ్వర్యంలో జన్మభూమి - మా ఊరు కార్యక్రమం ఏర్పాటు చేశారు. చింతలూరు గ్రామంలో తహశీల్దార్ లోకవరపు రామారావు మాట్లాడుతూ ప్రజల సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు జన్మభూమి - మా ఊరు కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులకు సంబంధించి వాటి దరఖాస్తులను స్వీకరించి వెంటనే అమలు చేస్తామని తెలియజేశారు. ప్రతీ ఒక్కరు మరుగుదొడ్లు నిర్మించుకొని గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతలూరు సర్పంచ్ కాళంగి కళ్యాణ రాజు, ఎంపీటీసీ చిన్ని వెంకటలక్ష్మి, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు ఏడువాక గంగరాజు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో... ప్రజా సంక్షమమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే అనిత అన్నారు. శనివారం ఉదయం గుడివాడ గ్రామంలో జరిగిన 5వ విడత జన్మభూమి కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలుకాని ఎన్నోసంక్షేమ పథకాలు తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేస్తున్నదని అన్నారు. ప్రజల వద్దకే పాలన తీసుకురావడంతో ప్రజలకు కార్యలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా జన్మభూమిలో అర్జీలు స్వీకరించి సత్వర పరిష్కారం చూపిస్తున్నామన్నారు. ప్రతి పేదకుటుంబం ఆనందంగా సంక్రాంతి పండుగ చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఉచితంగా సక్రాంతి కానుకలు అందిస్తున్నామన్నారు. అంతకు ముందు వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ పథకాల అమలు తీరు వివరించారు. గత జన్మభూమిలో వచ్చిన ఆర్జీలు, వాటి పరిష్కారానికై ఆయా శాఖాధికారులను ఎమ్మెల్యే అనిత అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి వినోద్‌రాజు, జడ్పీటీసీ సభ్యులు బి.వరలక్ష్మి, సర్పంచి ఎస్ .వెంకటరాజు, నియోజకవర్గ నోడల్ అధికారి డా. రవి, మండల ప్రత్యేకాధికారి కోటేశ్వ రరావు, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఓ డి.స్వరూపారాణి మరియు మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



అయ్యన్నకు నూకాంబిక చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

నక్కపల్లిలో... ప్రభుత్వ అందిస్తున్న పథకాలు ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని తహశీల్దార్ ఎస్. రాణీ అమ్మాజీ అన్నారు. శనివారం ఎన్.నర్సాపురం గ్రామంలో జరిగిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో రాణీ అమ్మాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలందరిని దృష్టిలో ఉంచుకొని అనేకమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అర్హత గల ప్రతీ ఒక్కరు వీటిని పొందాలని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గణేష్, సర్పంచ్ సత్యవతి, వెలుగు ఏపీఎం శివప్రసాద్, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల పంపిణీ



తుమ్మపాల (అనకాపల్లి), న్యూస్‌లీడర్: జన్మభూమి - మా ఊరు కార్యక్రమం అవగాహన ర్యాలీలో భాగంగా మండలంలోని తుమ్మపాల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం మౌలిక సదుపాయాలు అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ దదరం మహాలక్ష్మినాయుడు మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమం వలన ప్రజలు నేరుగా అధికారులు, పాలకుల వద్ద వచ్చి వారి సమస్యలు చెప్పుకొని పరిష్కరించుకోవచ్చునన్నారు. అందుకే జన్మభూమికి మంచి స్పందన వస్తుందన్నారు. స్కూలు ప్రధానోపాధ్యాయులు కె.కామేశ్వరరావు జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 155 మంది పిల్లలకు ఏకరూపు దుస్తులను మహాలక్ష్మినాయుడు, సెక్రటరీ వి.ప్రసాద్ పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ సాలాపు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వివేకానంద జయంతోత్సవాలు



వివేకానందునికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అనకాపల్లి, న్యూస్‌లీడర్: మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలోగల ప్రభుత్వ పాఠశాలలో శనివారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలువేసి విద్యార్థులు నివాళులు అర్పించారు. యువత మేలుకో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా ఇక్కడ ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం పాఠశాల పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ ఎస్‌పీ చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని యువత మేలుకో సంస్థను స్థాపించామని, ఈ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫణీంద్ర, సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జన్మభూమి సభలో జోక్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరావు

అనకాపల్లి, న్యూస్‌లీడర్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి-మా ఊరు సభల్లో పార్టీ జోక్యం తగదని పలు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. స్థానిక కె.గోవిందరావు భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఇండియన్ అసోషియేషన్ అఫ్ లాయర్స్(ఐఏఎల్)ప్రతినిధి మళ్ల మాధవరావు మాట్లాడుతూ ఈ జన్మభూమి సభలకు హాజరవుతున్న ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు శ్రద్ధ చూపడంలేదు సరికదా వారి ప్రసంగాల ముగియగానే జన్మభూమి సభలను ముగించేస్తున్నారన్నారు. అధికారులుకూడా ఈ విషయంలో చోద్యం చూస్తున్నారన్నారు. రాజకీయ ప్రజా వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు మాట్లాడుతూ నియమ నిబంధనలకు లోబడి జన్మభూమి సభలు జరగడంలేదన్నారు. పార్టీలకు సంబంధించిన వ్యక్తుల జోక్యం ఎక్కువగా ఉంటుందన్నారు. ఇటువంటి పోకడలవల్ల జనాలు తీవ్ర సందిగ్ధంలో పడుతున్నారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంలో కలగజేసుకొని జన్మభూమి సభల్లో పార్టీ నాయకుల జోక్యం తగ్గించేలా చూడాలన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎన్ భద్రం తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం



పూర్వపు గురువులతో విద్యార్థులు

నర్సీపట్నం, న్యూస్‌లీడర్: 83 -84 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వపు విద్యార్థులంతా కలిసి విరాళాలు సేకరించి ఐదు లక్షలతో నిర్మించిన బాలిక మరుగుదొడ్లను శనివారం లాంఛనంగా చదువులు చెప్పిన గురువులతో ప్రారంభించారు. వారంతా ఉన్నత విద్యను ఒకే పాఠశాలలో కలిసి చదువుకుని పూర్తి చేసిన తరువాత ఎవరికి నచ్చిన కోర్సుల్లో వారు చేరి తలోదిక్కుకు వెళ్లిపోయారు. తదనంతరం ఉద్యోగాలు, వివాహాలు, భార్య పిల్లలతో బిజీ అయిపోయి 33 సంవత్సరాలు గడిపేశారు. పెద్దబొడ్డేపల్లి ఆర్‌సీఎం పాఠశాలలో 83 -84 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వపు విద్యార్థులంతా కలిసి విరాళాలు సేకరించి ఐదు లక్షలతో నిర్మించిన బాలిక మరుగుదొడ్లను శనివారం లాంఛనంగా చదువులు చెప్పిన గురువులతో ప్రారంభించారు. ప్రారంభానికి బ్యాచ్ పూర్వపు విద్యార్థులతో పాటు అప్పుడు పాఠాలు చెప్పిన గురువులు కూడా పాల్గొన్నారు. ముందు ముందు పేద విద్యార్థులకు విద్యా బోధనకు సహకారం అందిస్తామని పూర్వపు విద్యార్థులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులందరూ పూర్వపు గురువులను, ప్రస్తు స్కూల్ ఫాదర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు పి.లక్ష్మణ, రామ్, రత్నబాబు, గీతారాణి, జయ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రయోజనాల కోసమే జన్మభూమి

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అదీప్‌రాజ్



మాట్లాడుతున్న అదీప్‌రాజ్

సబ్బవరం, న్యూస్‌లీడర్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి - మా ఊరు కార్యక్రమాలు ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసమా లేక టీడీపీ ప్రయోజనాల కోసమా అని అర్థం కావడంలేదని పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రశ్నించారు. శనివారం సబ్బవరం వచ్చిన ఆయన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శుక్రవారం పురుషోత్తపురంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొంత మంది సింహాచలం దేవస్థానం భూములపై ప్రశ్నించగా దేవస్థానం భూముల పరిష్కార విషయంపై ఆయన్ని ప్రశ్నించగా ఎమ్మెల్యే బండారు ఏకపక్షంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు సమాధానం చెప్పవలసిన పనిలేదని, బయటకు వెళ్లిపోమని మాట్లాడటం భావ్యం కాదన్నారు. జన్మభూమి కార్యక్రమాలు ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే కాని రాజకీయ పలుకుబడిని ప్రస్తావించడానికి కాదని ఆయన అన్నారు. రానున్న రోజులలో జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమాలలో ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, అందులో భాగంగానే ఈ నెల పదవ తేదీన స్థానిక సీతారామ కళ్యాణ మండపంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రివర్యులు బొత్సా సత్యనారాయణ, సాయంత్రం నాలుగు గంటలకు జరుగు రచ్చ, పల్లెనిద్ర కార్యక్రమానికి ఆయన వస్తున్నారని అయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో తుంపాల అప్పారావు, దాసరి నర్సింహులు, వనం అచ్చింనాయుడు, మూకాద అప్పారావు, కొటాన రాము, కేశవరావు, శేఖర్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

పండగపూటా పస్తులు తప్పవా

అనకాపల్లి, న్యూస్‌లీడర్: వేలిముద్రలు పడక రేషన్ అందక కార్డుదారులకు పండగపూట ఇబ్బందులు తప్పడం లేదని సీపీఐ నాయకుడు వైఎన్ భద్రం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కూలిపనులు మానుకొని రేషన్ దుకాణాలకు కార్డుదారులు ఎన్నిసార్లు తిరిగినా అందడం లేదని తెలిపారు. సాఫ్ట్‌వేర్ పనిచేయక వేలి ముద్రలు పడకపోవడంతో రేషన్‌షాపులు చుట్టూ పదేపదే కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం లేకపోతుందని భద్రం తెలిపారు. గతంలో ఐరీష్ విధానంలో రేషన్ అందించేవారని, అయితే ప్రస్తుతం 4.9 వెర్షన్ సాఫ్ట్‌వేర్ సామర్థ్యం చాలక ఐరీస్ సపోర్టు చేయడంలేదని రేషన్‌డిపో డీలర్లు చెబుతున్నారని ఆయన తెలిపారు. వాటిని సరిచేసి సమర్థవంతమైన సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేయవలసిన ప్రభుత్వమే మీనమేషాలు లెక్కపెట్టి కాలయాపన చేయడం వలన నిరుపేదలైన కార్డుదారులు కూలిపనులు మానుకొని రేషన్ అందక తిప్పలు పడుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం, పౌర సరఫరా అధికారులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా సాఫ్ట్‌వేర్ పనిచేయకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి అందరికి రేషన్, సంక్రాంతికి చంద్రన్న కానుకలు అందించాలని సీపీఐ నాయకులు భద్రం, కోన లక్ష్మణ, కోరిబిల్లి శంకర్రావు, తాకాశి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, ప్రసాద్, రాజు కోరారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు


మాడుగుల, న్యూస్‌లీడర్: ప్రభుత్వ నిధులతో గ్రామాలలో నిర్మిస్తున్న మరుగుదొడ్లను ప్రతీ ఒక్కరూ వినియోగించుకొని బహిరంగ మలమూత్ర విసర్జనను మానుకోవాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వంటర్ల గ్రామ సర్పంచ్ కుమారరాజు, పంచాయతీ కార్యదర్శి గెంజి నాగేశ్వరరావు కోరారు. శనివారం ఉదయం వంటర్లపాలెం రామాలయంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు నిర్మించుకొని వాడకపోతే ప్రభుత్వం ఆదేశాల మేరకు రేషన్‌కార్డులు రద్దు చేస్తామని చెప్పారు. తొమ్మిదవ తేదీన జరిగే జన్మభూమి - మావూరు కార్యక్రమంలో గ్రామంలో రేషన్‌కార్డులు, పింఛన్‌లు లేనివారు దరఖాస్తులు అందించాలని కోరారు. ప్రతీ ఒక్కరు జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని అధికారులకు గ్రామ సమస్యలు తెలియజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు సిద్ధాబత్తుల గోవిందరావు, వీఆర్వో కె.జగన్నాథరావు, వీఆర్పీ నాగేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్త దేవితో పాటు డ్వాక్రా సంఘం మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు సంక్రాంతి బోనస్ పంపిణీ

మాడుగుల, న్యూస్‌లీడర్: విశాఖ డెయిరీ రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నదని వీరవల్లి అగ్రహారం సర్పంచ్ షేక్‌బీబీ అన్నారు. శనివారం పాల సంఘం భవనం వద్ద పాల సంఘం అధ్యక్షుడు వెలుగుల శివ ఆధ్వర్యంలో 150 మంది రైతులకు రెండు లక్షల యాభైవేల రూపాయలను సంక్రాంతి బోనస్‌గా అందించారు. డెయిరీ అభివృద్ధి చెందాలంటే ప్రతీ రైతు తప్పనిసరిగా డెయిరీకి పాలుపోసి అభివృద్ధికి కృషి చేయాలని పాల సంఘం అధ్యక్షుడు వెలుగుల శివ రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాడి రాజేశ్వరరావు, డెయిరీ సూపర్‌వైజర్ కమలాకర్, స్కూలు కమిటీ ఛైర్మన్ దాడి కొండాజీ, ఎస్.సురేంద్ర పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు అభినందనీయం

కృషి హాస్పటల్ సీఈవో ఆనంద్‌కుమార్



పాడి రైతులకు బోనస్‌లు పంపిణీ చేస్తున్న ఆనంద్‌కుమార్

మునగపాక, న్యూస్‌లీడర్: విశాఖ డెయిరీ ద్వారా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు కృషి హాస్పటల్ సీఈవో ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉమ్మలాడ గ్రామంలోగల పాల సంఘంవద్ద శనివారం పాడి రైతులకు సంక్రాంతి బోనస్‌లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మంది పాడిరైతులకు 2లక్షల85వేల రూపాయల బోనస్‌ను ఆనందకుమార్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ డెయిరీ ద్వారా రైతులకు అవసరమైన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే గ్రామస్థులకు అవసరమయ్యే పనులుకూడా విశాఖ డెయిరీ నిధులతో నిర్వహించడం జరిందన్నారు. అదేవిధంగా పాడిరైతులు తప్పనిసరిగా సుఖీభవ కార్డును పొందాలన్నారు. ఈ కార్డువల్ల పలు ప్రయోజనాలు విశాఖ డెయిరీ ద్వారా అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు మొల్లేటి సత్యనారాయణ, సర్పంచ్ కర్రి భాస్కరరావు, జేవో నాగేశ్వరరావు, పీఎస్ ఎం.గణేష్, పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలో

దిగువస్థాయి కోర్టు నోటీసులు చెల్లవు

ట్రైనీ జేసీ మిషాసింగ్



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ మిషాసింగ్

సబ్బవరం, న్యూస్‌లీడర్: సబ్బవరం తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ట్రైనీ జాయింట్ కలెక్టర్ మిషాసింగ్ విలేకరులతో మాట్లా డుతూ సబ్బవరంలో ఉన్న పెండింగు కేసులను చూ సేందుకు వచ్చామని, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించు కొని ఉంటున్నవారు క్రిందస్థాయి కోర్టులకు వెళ్లి నోటీసులు తీసుకువస్తున్నారని, ప్రభుత్వ స్థలాలపై హైకోర్టు ఇచ్చిన నోటీసులు మాత్రమే చెల్లుతాయని, క్రింది కోర్టులు ఇచ్చిన నోటీసులు చెల్లవన్నారు. పెండింగు కేసులపై స్థానిక ఎస్ఐ ఎన్.ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడి వాటి పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆమె చెప్పారు.

ప్రిన్సిపల్‌ను నిలదీసిన పేరంట్స్

చీడికాడ, న్యూస్‌లీడర్: మండలంలోని మంచాల ఏపీ మోడల్ స్కూలులో పాఠశాలలోని అపరిశుభ్రతపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ తంతి వీరల్‌ను నిలదీశారు. శనివారం జరిగిన పేరంట్స్ మీటింగులో పాఠశాలలోని మరుగు దొడ్ల అపరిశుభ్రతపై, మధ్యాహ్నం భోజనంలో అన్నంలో పురుగులు రావడంతో తరచూ విద్యార్థులు అస్వస్థతకు గురికావడంపై, పరీక్షలు మార్కులు తక్కువగా రావడం, స్కూలులో కనీసం విద్యార్థులను ఆడించే కిట్లు లేకపోవడంపై మండలంలోని ఏకైక మోడల్ స్కూలైన ఐఐటీకి ఇద్దరు మాత్రమే సెలక్టు కావడం ఏమిటి అని, నర్సీపట్నం ఐఐటీకి 20మంది సెలక్టు అయ్యారని, విద్యార్థులకు సరైన విద్యాబోధనందించలేదని, మౌలిక వసతులు లేవని, టీచర్ల మధ్య గ్రూపు తగాదాలు ఎక్కువగా ఉండడం వలన, టీచర్లు క్లాసులకు సక్రమంగా రాకుండా వంతులు వేసుకోవడం ఏమిటని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. ఇవే కాకుండా ఇటీవల జరిగిన జన్మభూమి మీటింగుకి విద్యార్థులను తీసుకెళ్లి సినిమా పాటలకు డ్యాన్సు వేయించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవన్నీ ప్రిన్సిపాల్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు అడగగా సరైన సమాధానం చెప్పకుండా దాటవేశారు. ఈ దోరణిపై విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేసి డీఈవోకి ఫిర్యాదు చేస్తామని పేరంట్స్ మీటింగు నుంచి వెళ్లిపోయారు.

విజయాలకు మార్గాలను అన్వేషించాలి



మాట్లాడుతున్న రాహుల్

పాయకరావుపేట, న్యూస్‌లీడర్: స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు విజయాలకు మార్గాలను ఎలా ఎంచుకోవాలి, వాటిని ఎలా పొందాలని అనే విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన జూనియర్ ఛాంబర్ జోన్ ప్రెసిడెంట్ జేసీ రాహుల్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో అనేక విద్యా, ఉపాధి అవకాశాలున్నాయని, వాటిని నెరవేర్చుకోవడానికి విద్యార్థులు ఒక నిర్దిష్ట గమ్యాన్ని ఏర్పరుచుకొని వాటిని చేరుకోవడానికి ఒక చక్కని ప్రణాళికను రూపొందించుకొని ముందుకు పోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీపరంగా కూడా విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు, జూనియర్ ఛాంబర్ అధ్యక్షులు జేసీ చెన్నా విజయ్, కార్యదర్శి జేసీ కె.రవితేజ, జోనల్ వైస్ ప్రెసిడెంట్ జేసీ సీహెచ్ హిమశేఖర్, సభ్యులు జేసీ డి.శ్రీకాంత్, జేసీ బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



మాడుగుల, న్యూస్‌లీడర్: మండలంలోని ముకుందపురంలో జన్మభూమి - మా వూరు కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.మేనాక్షి, సర్పంచ్ గుదాల వెంకటరత్నం అధ్వర్యంలో విద్యార్థులకు పలురకాల ఆటల పోటీలు, కథల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుదాల వెంకటరత్నం మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు విద్యార్థులకు ప్రతీరోజు ఆటలు, డ్యాన్సు పోటీలు, ఖో-ఖో వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గెంజి నాగేశ్వరరావు, వీఆర్వో కె.జగన్నాథరావు పాల్గొన్నారు.